మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 38 • పేజీలు:12+16 • వెల: రూ.5 సోమవారం • 8-1-2018 www.manamnews.com /manamnews

మనం మహి



మహి... భూ 'మాత'! పేరుకు తగినట్లు మానవాళి కన్నుతెరవక ముందునుంచే కన్నతల్లిలా సకల వనరులు సిద్ధంగా ఉంచిన పచ్చని సిరుల తల్లి. మానవుల అవసరాలన్నీ తీర్చగల శక్తి ఈ అమ్మకు ఉందిగానీ, అత్యాశను తట్టుకోలేక తల్లడిల్లుతోంది. ఈ భూ మాతను కాలుష్య భూతం నుంచి రక్షించుకోవడమే ఇప్పుడు ప్రపంచ జనావళి తక్షణ కర్తవ్యం. ఈ నేపథ్యంలో పర్యావరణం-పరిరక్షణపై అవగాహన దిశగా 'మహి' పేరిట 'మనం' పత్రిక మీ కోసం పూర్తి రంగులలో ఒక పేజీని ఇకపై ప్రతి సోమవారం అందిస్తుంది. ఇందులో స్థానిక, జాతీయ, అంతర్జాతీయ పర్యావరణ అంశాలు.. ప్రముఖుల అభిప్రాయాలు, విశ్లేషణలు వగైరాలన్నీ ఉంటాయి. తెలుగు మీడియా చరిత్రలో ఇప్పటివరకూ ఏ పత్రికా చేపట్టని ఈ ప్రయోగాన్ని ఆదరించి.. ఆశీర్వదించాలని పాఠక దేవుళ్లకు వినతి.

- ఎడిటర్

యాసంగి యాతన!

అప్పుల కోసం అన్నదాతల తిప్పలు

పంట రుణం.. లక్ష్యానికి బహుదూరం



- రుణలక్ష్యంలో 25% కూడా పూర్తి చేయని బ్యాంకులు
- బ్యాంకులకు భారీగా ప్రభుత్వ బకాయి
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని చోట్లా ఇదే పరిస్థితి
- రైతులకు అప్పలిస్తే.. బ్యాంకులపై భారం
- బ్యాంకులకు ప్రభుత్వ బాకీ.. 321 కోట్లు
- యాసంగి రుణలక్ష్యం.. రూ.15,900 కోట్లు
- ఇప్పటికి ఇచ్చింది అందులో నాలుగోవంతే
- గణనీయంగా పడిపోయిన సాగు

హైదరాబాద్, జనవరి 7 (మనం ప్రతినిధి):

ఆదిలాబాద్ జిల్లాకు చెందిన రామ్యానాయక్ మూడెకరాల్లో యాసంగి సీజన్‌లో వరి పంట సాగు చేసేందుకు సిద్ధమయ్యాడు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటను అప్పటికే అమ్మేందుకు మార్కెట్‌కు తరలించాడు. రెండు రోజుల క్రితమే ధాన్యం కొనుగోలు చేశారు మార్కెట్ అధికారులు. కానీ, నగదు చేతికి అందేందుకు మరో 15 రోజుల సమయం పడుతుంది. ఇప్పటికే యాసంగి సీజన్ ప్రారంభమై మూడు నెలలు దాటింది. వరి సాగుకు ఎంత లేదన్నా మూడెకరాలకు కలిపి తక్కువలో తక్కువ **మిగతా 6లో..**



తాగుబోతు డ్రైవింగ్..


విష్ణువర్ధన్

రెండు ప్రాణాలు బలి

పూటుగా తాగేసిన విష్ణువర్ధన్

అర్ధరాత్రి స్కూటీని ఢీకొన్న కారు

- అక్కడికక్కడే యువతి దుర్మరణం
- మరో యువతి బ్రెయిన్ డెడ్
- కిట్టీ పార్టీ కోసం వచ్చిన అనూష

హైదరాబాద్, జనవరి 7:

పూటుగా మద్యం తాగిన ఓ వ్యక్తి రెండు నిండు ప్రాణాలను బలిగొన్నాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత హైదరాబాద్ జూబ్లీ హిల్స్ రోడ్ నెం.10లో జరిగిన ఈ ప్రమాదంలో **మిగతా 5లో..**


అనూష మస్తానీ

ఇదీలోకం!



పంచాయతీలపై కేబినెట్

సబ్ కమిటీ!

- జూపల్లి నేతృత్వంలో నియామకం
- సభ్యులుగా ఆరుగురు మంత్రులు
- స్థానిక సంస్థల క్రియాశీలతే లక్ష్యంగా ఏర్పాటు!
- విధి నిర్వహణలో విఫలమైన వారిపై చర్యలు!
- పంచాయతీ రాజ్ చట్టంలో సమూల మార్పులు





హైదరాబాద్, జనవరి 7:

స్థానిక సంస్థలు అత్యంత క్రియాశీలంగా పనిచేసేలా, విధి నిర్వహణలో విఫలమైన వారిపై చర్యలకు అవకాశం కల్పించే కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తెస్తామని కొద్ది రోజుల క్రితం సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కొత్త చట్టం రూపకల్పనకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో కేబినెట్ సబ్-కమిటీ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సీఎం కేసీఆర్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీలో **మిగతా 6లో..**



గుడిలో 'తంత్రం'!

'గుడిలోన నా స్వామి కొలువై ఉన్నాడు'... అని ఒక భక్తురాలంటే... 'గుడియెనక నా సామి.. గుర్రమెక్కి కూసున్నాడు' అని మరో సరసురాలు అంటుంది...

- ఆరోపణలు.. విచారణ తూతూ మంత్రం
- పగలు అర్చనలు... రాత్రి వేళ 'పూజలు'
- గర్భగుడిలో చాటుగా ఉపాసకుల ప్రవేశం
- నమ్మకం పవిత్రం... ఆలయం అపవిత్రం
- అక్రమాలు సత్యం.. అవినీతి నిత్యకృత్యం

హైదరాబాద్, జనవరి 7 (మనం ప్రతినిధి):

అప్పుడెప్పుడో 1973లో వచ్చిన 'ఇదా లోకం' సినిమా కోసం సుప్రసిద్ధ గాయనీమణులు ఎస్.జానకి, ఎల్.ఆర్. ఈశ్వరి పాడిన పాట ఇది. గుడిలోని స్వామికి సేవ చేసేవారు కొందరైతే... గుడినీ, గుడిలో లింగాన్ని కూడా గుటకేసే స్వాములెందరో ఆ గుడివెనకే ఉంటారన్న నిజాన్ని 'వీటూరి' గీతం సరసంగా వివరిస్తే... రస చక్రవర్తి సంగీతంతో నాటికీ నేటికీ అది జనాన్ని ఉర్రూతలూపుతూనే ఉంది. ఇప్పుడీ పాట ఊసెందుకంటే... తెలుగు రాష్ట్రాల్లోని ఆలయాల్లో ప్రస్తుత పరిణామాలకు అతికినట్లు సరిపోతుంది కాబట్టే... ఆచారాలు, సంస్కృతీ సంప్రదాయాలకు **మిగతా 6లో..**

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలోనూ మార్పులేదు. రాత్రిపూట చలి గాలులు వణికిస్తాయి. గంటకు 13 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 29 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 14 డిగ్రీలు


గాలిలో తేమ: 52 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి మ.3.47 తదుపరి అష్టమి; నక్షత్రం: హస్త రా.1.43 తదుపరి చిత్త; వర్జ్యం: ఉ.9.44-11.23; దుర్ముహూర్తం: మ.12.01-12.45, మ.2.57-3.41; రాహుకాలం: ఉ.8.15-9.37; అమృతఘడియలు: సా.7.37-9.15; శుభసమయం: ఉ.6.00-7.00, మ.3.42-4.00;

సూర్యోదయం: 6.52

సూర్యాస్తమయం: 5.54




ప్రపంచ చాంపియన్

దుర్మరణం

- ఢిల్లీ శివారులో రోడ్డు ప్రమాదం
- సక్షమ్, మరో నలుగురు పవర్ లిఫ్టర్ల మృతి
- ప్రమాదానికి పొగమంచు కారణం

7లో..

మెడికోలు చలో చైనా!



భారతీయ విద్యార్థుల ఓటు అటే

- రేసులో వెనుకబడిన బ్రిటన్
- తక్కువ ఖర్చులో వైద్య విద్య పూర్తి
- ఎంసీఐ గుర్తింపూ ఓ కారణం

ముంబై, జనవరి 7:

వైద్య విద్య విషయంలో భారతీయ విద్యార్థుల గమ్యం మారింది. ఇన్నాళ్లూ బ్రిటన్‌వైపు వెళ్లేవారు.. ఇప్పుడు చైనా వైపు చూస్తున్నారు. 2010 తర్వాత విదేశాల్లో విద్యనభ్యసించడానికి వెళ్లే విద్యార్థులు వివిధ ప్రత్యామ్నాయాలు **మిగతా 6లో..**



సచిన్ కుమార్తెకు


వేధింపులు

- ప్రేమించాలంటూ ఇంటికి 20 సార్లు ఫోన్
- కిడ్నాప్ చేసి పెళ్లి చేసుకుంటానని బెదిరింపు
- పోలీసులకు ఫిర్యాదు.. నిందితుడి అరెస్ట్

7లో..



సీఎం కేసీఆర్‌ను ఆదివారం ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు డి. శ్రీనివాస్.



ప్రగతి భవన్‌లో ఆదివారం కరీంనగర్ జిల్లా ప్రజా పరిషత్ రూపొందించిన డైరీని ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి లక్ష్మారావు, కె.కేశవరావు, కరీంనగర్ జెడ్పీ చైర్మన్ తుల ఉమ తదితరులు ఉన్నారు.



ఎస్సీల్లో చేర్చాల్సిందే

- చాకలి సభలో వక్తల డిమాండ్

ఎల్‌బీనగర్, జనవరి 7 (మనం న్యూస్): రజకులను ఎస్సీల్లో చేర్చాల్సిందేనని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఇందుకోసం వచ్చే అసెంబ్లీ సమావేశంలో అవసరమైన తీర్మానం చేయాలని కోరారు. ఆదివారం హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో 'చాకలి ఎస్సీ సాధన సమితి' ఆధ్వర్యంలో మహాసభ జరిగింది. ఈ కార్యక్రమంలో బీహార్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే శాంరంజన్, టీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సాధన సమితి కన్వీనర్ కొత్తకొండ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. ప్రస్తుతం బీసీ జాబితాలో ఉన్న తాము మిగతా వారితో పోలిస్తే మరింత దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతున్నామని అన్నారు. దేశంలో 18 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలలో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని, అలాగే మనరాష్ట్రంలోనూ ఎస్సీల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన రజక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతన్న 'మద్దతు'కు రాష్ట్రాల పర్యటన

పరిశీలనలో మార్కెటింగ్‌శాఖ బృందం.. కొనుగోలు విధానాలను చూసి రాష్ట్రానికి అనుగుణంగా మార్చండి

- ఈ నెల 13 లోగా నివేదిక ఇవ్వండి
- వాటితో కొత్త విధానాల రూపకల్పన
- మిల్లుల సామర్థ్యమూ తెలపండి
- అధికారులతో సమీక్షలో మంత్రి హరీశ్



హైదరాబాద్, జనవరి 7: ఆరుగాలం శ్రమించి రైతన్న పండించిన పంటకు మద్దతు ధర కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. ఇందుకోసం శాఖలోని సీనియర్ అధికారులను ఇతర రాష్ట్రాలలోని విధివిధానాల పరిశీలనకు పంపించనున్నట్లు తెలిపారు. మార్కెటింగ్‌శాఖ అధికారుల బృందం దేశంలోని వివిధ రాష్ట్రాలలో పర్యటిం చి కనీస మద్దతు ధరలపై అధ్యయనం చేస్తుందని చెప్పారు. ఈ మేరకు ఆదివారం నాడు బి.ఆర్.కె.భవన్‌లోని మార్కెటింగ్ డైరెక్టర్ కార్యాలయంలో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, గుజరాత్, హరియాణ తదితర రాష్ట్రాలలో ఈ బృందం పర్యటిస్తుందని మంత్రి వివరించారు. ఆయా రాష్ట్రాలలో వివిధ వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలను, రైతులకు ప్రభుత్వాల నుంచి లభిస్తున్న కనీస మద్దతు ధరలపై అధ్యయనం చేస్తుందని చెప్పారు. అలాగే పంటల దిగుబడి, వాటి కొనుగోలు విధివిధానాలను, అక్కడ అవలంభిస్తున్న పద్ధతులను పరిశీలించాలని అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా కొత్త విధానాలను ప్రవేశ పెట్టడానికి వీలుగా ఈ నెల 13వ తేదిలోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలంటూ వారిని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని రైస్ మిల్లుల, జిన్నింగ్, పప్పు, ఆయిల్ మిల్లుల వివరాలు, వాటి సామర్థ్యం, ఆయా ప్రదేశాలలో అంచనావేసిన వివిధ పంటల ఉత్పత్తులు తదితర వివరాలను ప్రధాన కార్యాలయానికి సమర్పించాలని హరీశ్ రావు సూచించారు.

ఖాళీలను భర్తీ చేయండి

మార్కెటింగ్ శాఖలో చాలాకాలంగా వివిధ హోదాలలో ఉన్న ఖాళీలను త్వరతగతిన భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న పనిభారం అలాగే, రాబోయే రోజులలో కోటి ఎకరాల సాగు, ఫలితంగా వచ్చే ఉత్పత్తి, ఆధారంగా పనిభారం అంచనా వేయాలని సూచించారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో అవసరమైన మేరకు నూతన పోస్టుల మంజూరు కోసం ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మిబాయి, సంయుక్త సంచాలకులు, లక్ష్మణుడు, రవికుమార్, మార్కెట్ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మార్చిలోగా గోదాములు..

మన కూరగాయల విక్రయ కేంద్రాలను జీహెచ్ఎంసీ సమీకృత మార్కెట్‌లలో అనువైన మెట్రో రైల్వే స్టేషన్‌లలో త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కేంద్రాలలో ఆర్గానిక్ కూరగాయలు, సేంద్రీయ బియ్యం అమ్మే రైతులను ప్రోత్సహించాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. మొత్తం 330 నాబార్డు గోదాములలో మిగిలిన 18 గోదాములను ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి 18లోగా నిర్మించాలన్నారు. మూడోదశలో నిర్మిస్తున్న 34 గోదాముల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు.

స్థల వివాదం ఉన్న గోదాములకు సంబంధించి సంబంధిత జిల్లా కలెక్టర్లతో మాట్లాడి ప్రత్యామ్నాయాలను చూసి నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. సూర్యపేట, చివ్వెంల తదితర ప్రదేశాలలో గోదాముల నిర్మాణానికి స్థల విషయంలో ఉన్న సమస్యలపై మంత్రి జగదీశ్వర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సమస్యను తొందరగా పరిష్కరించి స్థలం కేటాయించేలా చూడాలని కోరారు. కొత్తగా నిర్మించిన నాబార్డు గోదాములను సంబంధిత జిల్లా జాయింట్ కలెక్టర్లతో మాట్లడి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, కాటన్ కార్పొరేషన్, భారత అహార సంస్థ తదితర ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. ప్రభుత్వరంగ సంస్థలు మార్కెటింగ్ శాఖ గోదాములను అద్దెకు తీసుకొని పూర్తి వినియోగంలోనికి తేవాలని ఆదేశించారు.

మాకు న్యాయం చేయండి

- హరీశ్‌ను కలిసిన 1998 డీఎస్సీ అభ్యర్థులు

హైదరాబాద్, జనవరి 7(మనం ప్రతినిధి): మాకు న్యాయం చేయండి అంటూ 1998 డీఎస్సీ అభ్యర్థులు మంత్రి హరీశ్‌రావ్‌ను కలిసి విన్నవించారు. ఆదివారం నాడు మంత్రి నివాస గృహంలో అభ్యర్థులు కలిశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన 1998 డీఎస్సీ పరీక్షలో క్వాలిఫైడ్ అభ్యర్థులు తమకు ఉద్యోగాలు ఇప్పించాలని మంత్రిని వేడుకున్నారు. రెండేండ్ల కిందట తమకు ఉద్యోగాలిస్తామంటూ సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హరీశ్ రావు హామీ ఇచ్చినట్టుగా తెలిసింది.

పోటీ పెంచి ధర వచ్చేలా చూడండి..

కేంద్ర ప్రభుత్వ 'మోడల్ చట్టం' ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా వ్యాపారస్థులను, కమిషన్ ఏజెంట్లకు కొత్తగా జారీచేసే లైసెన్సుల విషయంలో, అలాగే ప్రస్తుతం అమలులో ఉన్న లైసెన్స్‌లకు సంబంధిత వర్తకులు, కమిషన్ ఎజంట్లు ఇవ్వవలసిన బ్యాంక్ పూచికత్తు విషయంలో అవగాహన కల్పించి నూతన లైసెన్స్‌లు జారిచేయాలని ఆదేశించారు. వ్యాపారంలో పోటి పెంచి, పంటకు ఎక్కువ ధర వచ్చేటట్లు చూడాలని కోరారు. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వారికి కూడ వ్యాపార లైసెన్స్‌లు జారిచేయాలని ఆదేశించారు. తెలంగాణలోని వివిధ వ్యవసాయ మార్కెట్‌ల నియంత్రణలో నడుస్తున్న పశువుల మార్కెట్ల ద్వారా మార్కెట్ ఫీజు వసూలు సక్రమంగా లేవన్నారు. గ్రామపంచాయితీలలో నిర్వహించే పశువుల మార్కెట్లలో సంవత్సరానికి కోట్ల రూపాయలలో ఆదాయాలు వస్తుంటే మార్కెట్ కమిటీల పశువుల మార్కెట్ల ద్వార లక్షలలో ఆదాయం వస్తోందని అసంతృప్తి వ్యక్తంచేశారు. 2018 మార్చిలోగా పశువుల మార్కెట్లను ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీ చేయించాలని ఆదేశించారు. మార్కెట్ ఫీజ్ వసూలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇక విలీనం షురూ..!

- విద్యార్థుల్లేని బడుల హేతుబద్ధీకరణ
- విద్యాశాఖకు చేరిన స్కూళ్ల జాబితా
- 4 వేలకు పైగా మూతపడే అవకాశం
- ఫిబ్రవరిలోనే విలీన ప్రకియ పూర్తి?
- ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన
- ఏటేటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- గురుకులాల ప్రభావం.. ఉపాధ్యాయులు

హైదరాబాద్, జనవరి 7(మనం ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. విద్యార్థుల చేరికల్లేని పాఠశాలలను, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న బడులను హేతుబద్ధీకరించే చర్యలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో 2024 నాటికి 90 శాతం అక్షరాస్యత సాధించాలని విద్యాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో భాగంగానే ప్రభుత్వ బడులను హేతుబద్ధీకరించి విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని నిర్ణయించింది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ జిల్లాలోని బడుల వారీగా పంపించిన వివరాల ఆధారంగా విద్యార్థుల్లేని, తక్కువ విద్యార్థులున్న పాఠశాలలను గుర్తించింది. రాష్ట్రవ్యాప్తంగా మారుమూల, గిరిజన ప్రాంతాలు, పట్టణాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల



చేరికలు ఆగిపోయాయి. హేతుబద్దీకరణ చర్చ వచ్చిన ప్రతి సందర్భంలోనూ జిల్లా విద్యాశాఖల నుంచి వచ్చే వివరాలు కాస్త అటు ఇటూగా మారుతున్నాయే తప్ప పాఠశాలల్లో మాత్రం విద్యార్థులు చేరడంలేదు. ఉన్నత పాఠశాలలను మినహాయిస్తే.. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య దారుణంగా పడిపోతోంది. విద్యార్థులు లేకుండా పోతున్న పాఠశాల జాబితాలో పీఎస్‌లతో పాటు యూపీఎస్‌లు కూడా చేరడం గమనార్హం!

2016-17 లెక్కల ప్రకారం..

పాఠశాల విద్యాశాఖ చేపట్టిన 2016-17 యూడైస్ లెక్కల ప్రకారం 460 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి చేరిన దాఖలాల్లేవు. ఈ సంఖ్య ఈ సంవత్సరం పెరిగే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటు న్నాయి. గతేడాది లెక్కల ప్రకారం 20 మంది లోపు ఉన్న పాఠశాలలు 4,137 ఉన్నాయి. పది మంది లోపు ఉన్న పాఠశాలలు 1,285 కాగా, 11 నుంచి 20 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 2,892. నిజానికి ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేర్చేందుకు ఉపాధ్యాయులు, ఆయా జిల్లాల విద్యాశాఖలు తీవ్రంగానే కృషి చేశాయి. కానీ రాష్ట్రంలో ఎక్కువగా గురుకుల పాఠశాలలు ప్రారంభించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు తగ్గాయి.

ఉపాధ్యాయుల్లో గుబులు


రాష్ట్రవ్యాప్తంగా 4 వేలకు పైగా ప్రభుత్వ బడులు మూతపడనుండడంతో ఉపాధ్యాయుల్లో గుబులు పుడు తోంది. ఉపాధ్యాయ నియమాకాలపై ఇప్పటి కే నీలినీడ లు కమ్ముకుంటున్నాయి. ఈ దశలో పాఠశాలల సంఖ్య కూడా తగ్గితే.. ఉపాధ్యాయుల భవిష్యత్ ఏంటనే పరి స్థితి నెలకొంది. ఓవైపు ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్.. మరోవైపు ప్రభుత్వం కేజీ టు పీజీ విద్యలో భాగంగా చేపడుతున్న గురుకులాలతో భవిష్యత్‌లోనూ ప్రవేశాలు పెరిగే సూచనలు లేకపోగా.. ఇప్పటికే ఉన్న విద్యార్థులు తరలిపోయే అవకాశం ఉంది. ఈ క్రమంలో విద్యార్థుల సంఖ్యకు మించి ఉపాధ్యాయులు ఉన్నచోట పరిస్థితి ఏంటి? ఆ టీచర్లను ఏం చేస్తారు? ఇతర పనులకు ఉపయోగిస్తే ఉపాధ్యాయులు ఉరుకుంటారా? అనే ప్రశ్నలు ప్రస్తుతం అందరిలోనూ తలెత్తుతున్నాయి. దీనిపై ఉపాధ్యాయవర్గాలతో సమావేశం కావాలని విద్యాశాఖ భావిస్తోంది. ఫిబ్రవరిలోనే విలీన ప్రక్రియను పూర్తి అవుతుందన్న తరుణంలో ఏం జరుగుతుందో వేచిచూడాల్సిందే.

ఒకందుకు మంచిదే..

ఇన్నాళ్లూ మారుమూల, గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థులు లేకున్నా.. ప్రవేశాల సంఖ్యను చూపుతూ కాలం నెట్టుకొచ్చారు. ఎక్కువ దూరం వెళ్లడం ఇష్టం లేకపోవడమో.. వ్యాపారాలపై ఉన్న శ్రద్ధ వల్లనో కానీ కొంతమంది ఉపాధ్యాయులు మారుమూల ప్రాంతాల్లోని బడుల్లో కొలువులు చేసేందుకు ఇష్టపడేవారు. ఏకోపాధ్యాయ బడులు కావడం, మారుమూల ప్రాంతాలు కావడంతో ఉపాధ్యాయులదే రాజ్యం అన్నట్టుగా నడిచింది. తాజాగా ప్రభుత్వ విలీన ప్రక్రియ నిర్ణయంతో ఇలాంటి వాటన్నింటికీ చెక్ పడనుంది.

ఇదీ పరిస్థితి..

విద్యార్థులు లేని, కొత్తగా విద్యార్థుల చేరికలు లేని పాఠశాలలను మరోచోటికి తరలించాలని, 20 మంది కంటే తక్కువ ఉన్న వాటిని సమీప పాఠశాలల్లో విలీ నం చేయాలని విద్యాశాఖ భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 25,991 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిల్లో దాదాపు 21లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. హేతుబద్ధీకరణలో భాగంగా పదిమంది లోపు విద్యార్థులున్న ప్రాథమిక, 20 మంది విద్యార్థులలోపు ఉన్న ప్రాథమికోన్నత, 30 మంది విద్యార్థుల లోపు ఉన్న ఉన్నత పాఠశాలల వివరాలను సేకరించింది. తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలకు సమీపంలోని బడుల వివరాలను సైతం జిల్లా కార్యాలయాల నుంచి తీసుకుంది. ఒకటి, రెండు జిల్లాలు మినహా మిగతా వాటి వివరాలు ఇప్పటికే అందాయి. ఈ నెలాఖరు నాటికి పూర్తి వివరాలు రాష్ట్ర విద్యాశాఖకు చేరతాయి. అనంతరం విలీన ప్రక్రియను ఫిబ్రవరి నెలలోనే పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.



పవన్ కల్యాణ్ ఓ బ్రోకర్

- అభిమానుల్లో ఉన్మాదం పెంచుతున్నారు
- పవన్ మోసం తట్టుకోలేక.. పూనమ్ ఆత్మహత్య ప్రయత్నం
- త్రివిక్రమ్, పూనమ్‌తో క్షుద్రపూజలు
- డిసెంబర్ వరకూ అభిమానులతో.. ఇప్పుడు పవన్‌కు నాకు మధ్యే గొడవ
- జనసేనానిపై కత్తి మహేశ్ తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్, జనవరి 7(మనం న్యూస్): 'పవన్ కల్యాణ్ ఓ బ్రోకర్.. తన స్వార్థం కోసం అభిమానులలో ఉన్మాదాన్ని పెంచిపోషిస్తున్నాడు' అంటూ సినీ క్రిటిక్ కత్తి మహేశ్.. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై సంచలన ఆరోపణలు చేశారు. తన రాజకీయ, సినీ భవిష్యత్తు కోసం అభిమానులను ఇతరుల మీదికి పవన్ ఉసిగొల్పుతున్నాడని మహేశ్ ఆరోపించారు. తనను విమర్శించిన వారిపై కక్ష్య సాధింపునకు పవన్ తన అభిమానుల్లో ఉన్మాదాన్ని పెంచి పోషిస్తున్నాడని తీవ్రంగా వ్యాఖ్యానించారు. కొంతకాలంగా కత్తి మహేశ్, పవన్ అభిమానుల మధ్య జరుగుతున్న మాటల యుద్ధం ఆదివారం నాడు తీవ్రరూపం దాల్చింది. కత్తి మహేశ్ తన ఆరోపణల పదును పెంచుతూ.. పవన్, నటి పూనమ్‌కౌర్, త్రివిక్రమ్‌తో కలిసి క్షుద్ర పూజలు చేశారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఆధారాలు కూడా తన వద్ద ఉన్నాయని అన్నారు. పూనమ్‌తో పవన్‌కు బయటికి వెళ్లడించలేని సంబంధాలు ఉన్నాయనే అర్థం స్ఫురించేలా విమర్శలు చేశారు. ఇటీవల పవన్‌కు మద్దతుగా 'మహేశ్ కంటే బిచ్చగాళ్లే నయమని' సినీ నటి, ఏపీ ప్రభుత్వ చేనేత బ్రాండ్ అంబాసిడర్ పూనమ్‌కౌర్ ట్వీట్ చేశారు. దీంతో రెచ్చిపోయిన కత్తి.. పూనమ్‌కు ఏపీ చేనేత బ్రాండ్ అంబాసిడర్ పదవి ఇప్పించింది పవనే అని ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో పవన్‌కు, పూనమ్‌కు దమ్ముంటే ఆదివారంనాడు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు రావాలని సవాల్ విసిరారు. చెప్పిన ట్టుగానే మహేశ్ ఆదివారం ప్రెస్‌క్లబ్‌కు వచ్చి, మీడియాతో మాట్లాడుతుండగానే.. పవన్ అభిమానులు వచ్చి మహేశ్ కారును ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.



పూనమ్‌కు కత్తి సంధించిన ప్రశ్నలు..

- మీకు ఏపీ బ్రాండ్ అంబాసిడర్ ఎవరి వల్ల వచ్చింది..?
- తిరుమలలో పవన్ పక్కన నిలబడి ఒకే గోత్ర నామాలతో పూజ ఎందుకు చేయించుకున్నారు?
- పవన్ మోసం చేశాడని ఆత్మహత్యకు యత్నించిన మిమ్మల్ని కాపాడిందెవరు? ఏ ఆస్పత్రిలో చేర్చారు? బిల్ ఎవరు కట్టారు?
- పవన్ మీ అమ్మకు ఏంప్రామిస్ చేశారు? అవి నెరవేరాయా.?
- డైరెక్టర్ త్రివిక్రమ్ అంటే మీకంత కోపమెందుకు..?
- మాంత్రికుడు నరసింహ చేసిన క్షుద్ర పూజలో పవన్, త్రివిక్రమ్ పక్కన మీరు ఏంచేశారో చెప్పగలరా.?

పూనమ్‌ను అవమానించడానికో, అగౌరవపర్చడానికో తను ఈ ఆరోపణలు చేయలేదంటూనే సమాధానం చెప్పాలని పూనమ్‌కు మహేశ్ సవాల్ విసిరారు. ఈ సందర్భంగా కత్తి తనపై పవన్ అభిమానులు చేస్తున్న వ్యక్తిగత ఆరోపణలపై ఆవేదన చెందారు. తన భార్య, తల్లి, చెల్లిపై సోషల్ మీడియా వేదికగా పవన్ అభిమానులు బూతుల వర్షం కురిపిస్తున్నారని ఆరోపించారు. ఇంతటి విపత్కర పరిస్థితిలోకూడా పవన్ నోరు మెదపకపోవడంవల్లే తాను విమర్శలకు దిగాల్సి వచ్చిందని వివరణ ఇచ్చారు. ఆ తర్వాత మహేశ్ టీవీ9 ఆఫీసుకు వెళ్లి లైవ్‌లో కూర్చున్నారు. ఆ సమయంలో పవన్ అభిమానులు అక్కడికి భారీగా చేరుకోగా, ఆఫీసు చుట్టూ పోలీసులు రక్షణ వలయం ఏర్పాటు చేశారు.

పవన్ క్షుద్ర పూజలు..

పవన్ కళ్యాణ్, త్రివిక్రమ్, పూనమ్‌కౌర్ నరసింహ అనే పూజారి చేత క్షుద్ర పూజ చేయించారని, అందుకు సంబంధించి వీడియోలు తన వద్ద ఉన్నాయని మహేశ్ తెలిపారు. వాటి ఫోరెన్సిక్ రిపోర్టుల ఆధారాలు కూడా తన వద్ద ఉన్నాయన్నారు.

దైవ పూజే..

కత్తి మహేశ్ ఆరోపించినట్టు అవి క్షుద్ర పూజలు కావని, జల్సా సినిమా(2008) సమయంలో పశ్చిమ గోదావరి జిల్లా ద్వారక తిరుమల ఐఎస్ జగన్నాథపురం నరసింహ స్వామి ఆలయంలోచేసిన దైవపూజ మాత్రమేనని తాడేపల్లిగూడెం మాజీ ఎమ్మెల్యే ఈలి నాని తెలిపారు. ఇతర భక్తులకు ఇబ్బంది కలగకూడదన్న పూజారి సూచనతో రాత్రిపూట పూజ చేశారని చెప్పారు. ఆ ఆలయంలో 24 గంటలూ పూజలు జరుగుతాయని అవి క్షుద్ర పూజలు కాదని నరసింహ స్వామి యాగమని పలువురు తెలుపుతున్నారు. ఇక పవన్ అభిమానుల వాదన మరోలా ఉంది. కత్తి మహేశ్ వైఎస్సార్‌సీపీ నేతల నుంచి డబ్బు తీసుకుని పవన్ కల్యాణ్‌ను డీ ఫేమ్ చేసే ఉద్దేశంతోనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు.



'మనం' ప్రభంజనం

- ప్రజా సమస్యలు ఎలుగెత్తడంతో ముందంజ
- ఎంపీ పొంగులేటి, ఎమ్మెల్యే పువ్వాడ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు భట్టి,
- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి ప్రశంసలు
- మనం పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ

ఖమ్మం, జనవరి 7(మనం న్యూస్): 'మనం' దినపత్రిక దినదనాభివృద్ధి చెందాలని పలువురు నేతలు ఆకాంక్షించారు. ప్రజా సమస్యలను ముందుకు తేవడంలో 'మనం' పత్రిక ముందుంటోందని ప్రశంసించారు. ఖమ్మంలో ఆదివారం జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో ఖమ్మం ఎంపీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి తదితరులు 'మనం' దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొంగులేటి సుధాకర్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో 'మనం' పత్రిక ప్రభంజనం సృష్టిస్తోందని, నూతన ఒరవడితో ప్రజల పక్షాల నిలుస్తోందని ప్రశంసించారు. జనం తరపున నిలబడిన 'మనం' పత్రిక నిలబడి వారి సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకపోతూ ప్రజాహితమే లక్ష్యంగా పత్రిక పనిచేస్తోందని మల్లు భట్టివిక్రమార్క కొనియాడారు. భవిష్యత్తులో 'మనం' పత్రిక మరింత జనాదరణ పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో 'మనం' ఖమ్మం బ్యూరో రిపోర్టర్ నామ పురుషోత్తం, స్టాఫ్ రిపోర్టర్ నూకల మూర్తి, యాడ్స్ ఇన్‌చార్జ్ మాలోత్ దేవేందర్, టౌన్ రిపోర్టర్ తంగిరాల శ్రీకాంత్, అర్బన్ రిపోర్టర్ నాగేంద్రబాబు, కార్పొరేటర్ కమర్తపు మురళి తదితరులు పాల్గొన్నారు.







'మనం' దూసుకుపోవాలి

- మూష్ణం హరిప్రసాదచార్యుల ఆశీర్వాదం
- మనం పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ

చిగురుమామిడి, జనవరి 7 (మనం న్యూస్): ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర ఎంతో కీలకమని, సమాజ ప్రగతిలో 'మనం' దినపత్రిక కీలకపాత్ర పోషించాలని త్రిదండి చినజీయర్ స్వామి శిష్యులు మూష్ణం హరిప్రసాదచార్యులు అభిప్రాయపడ్డారు. ఆదివారం చిగురుమామిడిలోని వేదపాఠశాలలో 'మనం' పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరిప్రసాదచార్యులు మాట్లాడుతూ.. అనతి కాలంలోనే 'మనం' దినపత్రిక తెలుగు మీడియా రంగంలో ప్రభంజనం సృష్టించాలని ఆశీర్వదించారు. ప్రజా సమస్యలే ఎజెండాగా ముందుకు నడవాలని సూచించారు. 'మనం' క్యాలెండర్ అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శి దాసరి ప్రవీణ్‌కుమార్ స్వామి, మరంగంటి రాఘవాచార్యులు, సుధీర్ కుమార్ చార్యులు, నవీన్ కుమార్ చార్యులు, గట్టు వేణుగోపాలాచార్యులు, మధుసూదనాచార్యులు, శ్రీనివాసాచార్యులు, రంగాచార్యులు, 'మనం' సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలు ఎడారి బాటసారులు!

- ఎటు వెళ్లాలో వారికి అర్థంకావట్లేదు
- అందుకే రైతులను మభ్యపెట్టే హామీలు
- టీఆర్ఎస్ ఎమ్మెల్సీ భాను ప్రసాద్



హైదరాబాద్, జనవరి 7 (మనం ప్రతినిధి): ఆర్మూర్ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ నేతలు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ భానుప్రసాద్ మండిపడ్డారు. రాష్ట్రాన్ని, దేశాన్ని 60 ఏళ్లకుపైగా పాలించిన ఆ పార్టీ ఇప్పుడు రైతులపై మొసలి కన్నీరు కారుస్తోందని ఎద్దేవా చేశారు. అప్పట్లో స్వామినాథన్ కమిటీ సిఫారసులను పెడచెవినపెట్టిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు వాటి గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఆదివారం ఆయన టీఆర్ఎస్ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఎడారిలో ఉన్న బాటసారులని ఎద్దేవాచేశారు. ఎటు వెళ్లాలో వారికి అర్థం కావడం లేదని అన్నారు. . కాంగ్రెస్ తీరు ఇలానే ఉంటే...వచ్చే ఎన్నికల్లో ప్రతి పక్ష హోదా కూడా దక్కదని హితవు పలికారు. రైతుల బతుకులను చిన్నాభిన్నం చేసింది కాంగ్రెస్ నేతలు కదా? అని భానుప్రసాద్ ప్రశ్నించారు. 2009 ఎన్నికల మేనిఫెస్టోలో జలయజ్ఞం కింద ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నేతలు వాటిని పెండింగ్‌లోనే పెట్టారన్నారు. పసుపు బోర్డు గురించి మాట్లాడుతున్న మధుయాష్కీ.. తాను ఎంపీగా ఉండగా సొంత ప్రభుత్వాన్ని ఒప్పించి ఎందుకు సాధించలేక పోయా రని? నిలదీశారు.



జూబ్లిహిల్స్‌లో కోడి పందాలు

హైదరాబాద్, జనవరి 7 (మనం ప్రతినిధి): సంక్రాంతి సందర్భంగా గోదావరి జిల్లాల్లో భారీగా నిర్వహించే కోడిపందేల సంస్కృతి హైదరాబాద్‌కు కూడా విస్తరించింది. జూబ్లీహిల్స్‌లో అక్రమంగా కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 20 పందెం కోళ్లను, ఆటలో పాల్గొంటున్న 29 మందిని అదుపులోకి తీసుకున్నారు. 25 సెల్‌ఫోన్లు, రూ. 70వేలు నగదు స్వాదీనం చేసుకున్నారు.

బాయిపని.. దిగిపోతే అంతేనా?

అనారోగ్యాలతో ఆస్పత్రుల పాలు.. రిటైర్డ్ కార్మికుల దుస్థితి

- యాజమాన్యం పట్టించుకోదా?
- వేతన ఒప్పందంలో కొత్త పాలసీ
- కోల్ ఇండియాలో అమలు..
- ఉత్తర్వులే ఇవ్వని సింగరేణి
- మండిపడుతున్న కార్మికులు
- సీఎం కలగజేసుకోవాలని డిమాండ్

హైదరాబాద్, జనవరి 7(మనం ప్రతినిధి): ''భూగర్భంలోకి దిగి చెమటోడ్చాం.. గాలాడని పరిస్థితుల్లో బొగ్గు తవ్వి తీశాం.. వయసులో ఉన్నపుడు ఆ కష్టాన్ని లెక్కచేయలేదు, వయసుడిగి ఉద్యోగం నుంచి దిగిపోయాక దాని ఫలితం అనుభవిస్తున్నాం.. మా ఆరోగ్యాన్ని బొగ్గు బాయి తినేసింది. ఇప్పుడు అనారోగ్యాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం. దిగిపోయినపుడు వచ్చిన సొమ్ము అప్పులు తీర్చి సొంత గూడును ఏర్పరుచుకోవడానికే సరిపోలేదు. ఇప్పుడు పనీ లేదు.. ఆస్పత్రిలో చూయించుకునే అవకాశమూ లేదు! ముఖ్యమంత్రి కలుగజేసుకుని మాకు వైద్య సేవలందించే మార్గం చూడాలి'' ఇదీ సింగరేణి రిటైర్డ్ కార్మికుల ఆవేదన!

నిత్యం ప్రమాదాలతో సావాసం చేస్తూ గనుల్లో పనిచేసిన కార్మికులు దిగిపోయాక ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. దశాబ్దాలుగా తమ శక్తినంతా ధార పోసి జాతీయ సంపదను వెలికి తీసిన నల్ల సూర్యుళ్ల ఉద్యోగ విరమణానంతరం అనారోగ్యాలతో బాధపడుతున్నారు. పెద్దమొత్తాల్లో వ్యయాన్ని భరించలేక చికిత్సకే దూరమవుతున్నారు. అయితే, పదవీ విరమణ చేసిన కార్మికులు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా ఉండేలా ఉన్నతమైన వైద్య పథకానికి తొమ్మిదో వేతన ఒప్పందంలో పునాది పడింది. కానీ సింగరేణిలో ఈ పథకం అమలు త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడు తోంది. కోల్ ఇండియాలో అమలవుతున్న ఈ పథకం సింగరేణిలో అమలు కాకపోవటం పట్ల కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యం తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోస్ట్ రిటైర్మెంట్ మెడికేర్ స్కీం..

బొగ్గు గనుల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వేజ్ బోర్డు పరిధిలోని కార్మికులకు వైద్య సదుపాయం కల్పించేందుకు కార్మిక సంఘాల పోరాటంతో మెరుగైన పథకం అమల్లోకి వచ్చింది. కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికేర్ స్కీం-నాన్ ఎగ్జిక్యూటివ్స్(సీపీఆర్ఎంఎస్-ఎన్ఈ) తాత్కాలికంగా అమలు చేయాలని జేబీసీసీఐలో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఉద్యోగ విరమణ పొం దిన కార్మికుడు, అతని జీవిత భాగస్వామికి నగదు రహిత వైద్య సేవలు అందుతాయి. ఈ పథకాన్ని కోల్ ఇండియాలో అమలు చేయాలని 2014 నవంబరు 26న ఉత్తర్వులు వెలువడ్డాయి. సింగరేణిలో 2015 డిసెంబరులో ఈ పథకంలో చేరడానికి యాజమాన్యం దరఖాస్తులు ఆహ్వానించింది. ఇదే క్రమంలో అందిన దరఖాస్తుల ఆధారంగా పదో వేతన ఒప్పందం మేరకు తుది నిర్ణయం తీసుకుంటామని సింగరేణి యాజమాన్యం ప్రకటించింది. 2016 మార్చి వరకు దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయింది. తొమ్మిదో వేతన ఒప్పంద కాలపరిమితి ముగిసింది. పదో వేతన ఒప్పందంలో పలు సవరణలతో ఈ పథకం తుది మెరుగులు దిద్దుకుని ఆమోదం పొందింది. కోల్ ఇండియాలో అమలవుతున్నా.. సింగరేణిలో మాత్రం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. పదవీ విరమణ తర్వాత ఆదాయం లేక కుటుంబ పోషణే భారంగా మారిన నేపథ్యంలో వృద్ధాప్యం కారణంగా వచ్చే అనారోగ్యాలకు చికిత్స వ్యయాన్ని భరించలేక ఇబ్బందులు పడుతున్నారు.

విధి విధానాలివే..


ఈ పథకం (సీపీఆర్ఎంఎస్-ఎన్ఈ)లో చేరడానికి కోల్ ఇండియా అనుబంధ సంస్థలు, సింగరేణి కార్మికులు అర్హులు. ఆరో వేతన ఒప్పంద కాలం నుంచి తొమ్మిదో వేతన ఒప్పంద కాలం మధ్య లో ఉద్యోగ విమరణ పొందినవారు ఈ పథకంలో చేరాలంటే రూ.40 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉద్యోగంలో ఉన్నవారు, కొత్తగా చేరేవారంతా ఈ పథకంలో తప్పనిసరి భాగ స్వాములు అవుతారు. ఉద్యోగంలో ఉన్నవారి వేతనాల నుంచి కూడా వాయిదా పద్ధతిలో రూ.40 వేల చొప్పున కోత విధిస్తారు. యాజమాన్యం తన వాటా కింద రూ.18 వేలు చెల్లిస్తుంది. ఉద్యోగ విరమణ పొందిన వారు ఈ పథకంలో చేరడానికి నోటీసు జారీ చేసిన ఆరు మాసాల్లోగా రూ.40 వేలు చెల్లించాలి. ఒకవేళ ఉద్యోగ విరమణ పొందిన, సర్వీసులో ఉన్న ఉద్యోగి మరణించిన కార్మికుడు మరణిస్తే, అతని జీవిత భాగస్వామి ఈ పథకంలో చేరవచ్చు. మెడికల్ అన్‌ఫిట్, స్వచ్ఛంద పదవీ విరమణ పొందినవారు, 57 ఏండ్లు నిండిన తర్వాత రాజీనామా చేసిన వారు ఈ పథకంలో సభ్యత్వం పొందవచ్చు. ఉద్యోగిపై ఆర్థికంగా ఆధారపడి అంగవైకల్యం ఉన్న పిల్లలకూ ఈ పథకం వర్తిస్తుంది.

ప్రయోజనాలు..

ఈ పథకంలో చేరినవారికి యాజమాన్యం ఆరోగ్య కార్డులు అందించి, వాటి ద్వారా నగదురహిత వైద్య సదుపాయాన్ని అందిస్తుంది. నిర్దేశించిన ఆసుపత్రుల్లో వైద్య చికిత్స తీసుకునే వెసులుబాటు ఉంది. భార్యాభర్తలకు కలిపి జీవిత కాలంలో గరిష్ఠంగా రూ.8 లక్షల వరకు ఈ పథకం కింద వైద్య ఖర్చులు చెల్లిస్తారు. భార్యాభర్తల్లో ఒకరు మధ్యలో మరణిస్తే మిగతా సొమ్మును జీవించి ఉన్న భాగస్వామి వైద్య ఖర్చుకి చెల్లిస్తారు. దివ్యాంగులైన పిల్లలకు వారి జీవిత కాలంలో గరిష్ఠంగా రూ.2.5 లక్షలు భరిస్తారు. ఈ గరిష్ఠ వైద్య పరిమితులు సాధారణ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు మాత్రమే. శస్త్రచికిత్స అవసరమైన గుండె జబ్బులు, కేన్సర్, మూత్రపిండాల వ్యాధులు, హెచ్ఐవీ/ఎయిడ్స్, పక్షవాతం, మెదడువాపు, కుష్ఠు, అడ్రినల్ హైలో ప్లాస్మాసిస్, మోకాలిచిప్ప, తుంటి ఎముక మార్పిడి లాంటి ప్రాణాంతక వ్యాధులకు గరిష్ఠ వ్యయ పరిమితి ఏమీలేదు. అవుట్ పేషంట్‌గా చికిత్స తీసుకుంటే వైద్య ఖర్చులు ఏడాదికి రూ. పదివేల చొప్పున లభిస్తాయి.

యాజమాన్యం నిర్లక్ష్యం...

ఈ పథకం అమలులో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు మిర్యాల రంగయ్య, మందా నర్సింహ్మారావు ఆరోపించారు. వైద్య పథకంపై కుదిరిన ఒప్పందం సింగరేణిలో అమలుకు నోచుకోవడంలేదని ప్రస్తావించినప్పుడు యాజమాన్యం పదో వేతన ఒప్పందంలో తీసుకునే నిర్ణయం ఆధారంగా అమలు చేస్తామని హామీ ఇచ్చింది. కోల్ ఇండియాలో ఇది 2014 నవంబరు నుంచే అమలు అవుతోంది. యాజమాన్యం జాప్యం చేయడం వల్ల ఉద్యోగ విరమణ పొందినవారు అనేక మంది ఆర్థికంగా నష్టపోతున్నారు. తొమ్మిదో వేతన ఒప్పందంలో కుదిరిన అంగీకారం మేరకు ఆరో వేతన ఒప్పంద కాలంలో దిగిపోయిన వారికి రూ.10 వేలు, ఏడో ఒప్పందంలో ఉద్యోగ విరమణ పొందినవారికి రూ.15 వేలు, 8వ వేజ్ బోర్డుపరిధిలో ఉన్నవారికి రూ.20 వేల చొప్పున సభ్యత్వ రుసుము వసూలు చేయాలి. ఈ పథకాన్ని వెంటనే సింగరేణిలో అమలు చేయాలని వారు కోరుతున్నారు.



ఉచితంగా చేర్చుకోవాలి

1996 జులై 1 నుంచి 2011 జూన్ 30 (ఆరు నుంచి ఎనిమిదో వేతన ఒప్పంద కాలం) వరకు పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారికి అప్పట్లో దక్కిన ఆర్థిక ప్రయోజనాలు అతి స్వల్పమని కార్మికులు ఆరోపిస్తున్నారు. పిల్లల పెళ్లిళ్లు, సొంతింటి నిర్మాణాలకు అప్పట్లో వచ్చిన సొమ్ము సరిపోలేదని పేర్కొంటున్నారు. నెలనెలా లభించే పింఛన్ కూడా రూ.3 వేలలోపే ఉంటుందని తెలిపారు. అనేక మంది దిగిపోయిన కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. వైద్యానికి అయ్యే ఖర్చు భరించలేక పలువురు మృతి చెందిన దాఖలాలున్నాయని రిటైర్డ్ సింగరేణి కార్మిక సంఘం నాయకులు వాపోయారు. యాజమాన్యం, కార్మిక సంఘాలు మానవతా దృక్పథంతో ఆలోచించి 8వ వేతన ఒప్పందంలోపు ఉద్యోగ విరమణ పొందిన వారందరికీ ఉచితంగా ఈ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం సార్ న్యాయం చేయాలి..

కోల్ ఇండియాలో స్థాయిలో చేసుకున్న ఒప్పందం ప్రకారం సింగరేణి యాజమాన్యం దిగిపోయిన కార్మికులకు వైద్య పథకాన్ని అమలు చేసేలా ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ చూపాలని కార్మికులు కోరుతున్నారు. సింగరేణి కార్మికులను సైనికులతో పోల్చిన సీఎం ఈ పథకం అమలుకు యాజమాన్యానికి ఆదేశాలిచ్చి తమను ఆదుకోవాలని రిటైర్డ్ కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆత్మగౌరవానికి సమ్మక్క-సారలమ్మ ప్రతీక

వారి పోరాట పటిమ ఈ తరానికి స్ఫూర్తి: కవిత

'సమ్మక్క-సారలమ్మ దివ్యచరిత్ర' సీడీ ఆవిష్కరణ


హైదరాబాద్, జనవరి 7 (మనం ప్రతినిధి): కోట్లాది మంది భక్తులు విశ్వసించే సమ్మక్క-సారలమ్మలు తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, పౌరుషానికి ప్రతీక అని ఎంపీ కవిత పేర్కొన్నారు. వారి స్ఫూర్తితో మహిళలు ముందడుగు వేయాలని సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తన కార్యాలయంలో తెలంగాణ జాగృతి సాంస్కృతి విభాగం రూపొందించిన 'సమ్మక్క-సారలమ్మ దివ్య చరిత్ర' పాటల సీడీని ఎంపీ కవిత ఆవిష్కించారు. ఈ సంర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ మట్టిపొరల్లోంచి మొలకెత్తిన వీర గాథ మేడారం సమ్మక్క-సారలమ్మల దివ్య చరిత్ర అని అన్నారు. వారి పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కరువుతో అల్లాడుతు న్న అడవి బిడ్డలను శిస్తు కట్టమని పీడించడమేగాక.. చిన్న రాజ్యమైన మేడారంపై చతురంగ దళాలతో దాడి చేసిన కాకతీయ సేనను సంప్రదాయ ఆయుధాలతో నిలువరించే ప్రయత్నం చేసిన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, నాగులమ్మల త్యాగాలను ప్రతి ఒక్కరూ మననం చేసుకోవాలని అన్నారు. వారి పోరాట పటిమ అనన్య సామాన్యమని పేర్కొన్నారు. వారి జీవిత విశేషాలను పాటల రూపంలో తీసుకొచ్చిన జాగృతి కన్వీనర్ కోదారి శ్రీనును ఈ సందర్భంగా కవిత అభినందించారు. కార్యక్రమంలో జాగృతి రాష్ట ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఉపాధ్యక్షులు మేడే రాజీవ్ సాగర్, యూత్ వింగ్, స్టుడెంట్ విభాగాల కన్వీనర్లు కోరబోయిన విజయ్ కుమార్, పసుల చరణ్, సాజన్, బబ్బీ, రజీ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



టీఆర్‌వీకేఎస్‌లో చేరిన విద్యుత్ కార్మికులు

గుండెలపై గులాబి జెండా కప్పుకున్నమంటేనే ప్రజల కోసం, కార్మికుల కోసం పనిచేస్తామని ప్రతిజ్ఞ చేసినట్లని ఎంపీ కవిత పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో పలువురు వివిధ విద్యుత్ సంఘాల్లో వివిధ హోదాల్లో ఉన్న నేతలు టీఆర్ఎస్ అనుబంధ టీఆర్‌వీకేఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తమ సంఘం అంటేనే బాధ్యత అని అన్నారు. విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి తమ టీఆర్ఎస్ ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ ముందున్న టీఆర్‌వీకేఎస్ ఉద్యమం తరవాత కూడా అదే స్ఫూర్తితో పనిచేస్తుండటం అభినందనీయమని అన్నారు.

బెయిల్‌పై జనశక్తి సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి విడుదల



చర్లపల్లి, జనవరి 7 (మనం న్యూస్): సీపీఐఎంఎల్ జనశక్తి తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మూర్తి శ్రీనివాస్‌రెడ్డి అలియాస్ యాదన్న ఆదివారం బెయిల్ బెయిల్‌పై విడుదల అయ్యారు. ఆర్నెళ్లుగా చర్లపల్లి జైలులో ఉన్న ఉన్న శ్రీనివాస్‌రెడ్డికి సిద్దిపేట కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో విడుదలయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజలకోసం పోరాడుతున్న విప్లవకారులను ప్రభుత్వం ఎన్‌కౌంటర్ పేరుతో దారుణంగా హత్య చేస్తోందని అభిప్రాయపడ్డారు. ప్రజా సంఘాల నేతలపై ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. జైలులో ఐదేళ్ల శిక్ష అనుభవించిన ఖైదీలను గణతంత్ర దినోత్సవం సందర్భంగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనేకమంది ఖైదీలు బీపీ, షుగర్ సమస్యలతో బాధపడుతున్నారని, వారికి క్షమాభిక్ష ప్రసాదించాలని కోరారు.

చర్లపల్లి జైలులో గుండెపోటుతో ఖైదీ మృతి

చర్లపల్లి, జనవరి 7 (మనం న్యూస్) : చర్లపల్లి సెంట్రల్ జైలులో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న ఖైదీ ఒకరు ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. అధికారుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మద్దూర్ మండలానికి చెందిన గురప్ప(65) ఓ కేసులో జీవిత ఖైదు శిక్ష పడింది. అయితే అతను కొంతకాలంగా హెచ్ఐవీతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం గురప్పకు గుండెపోటు రావడంతో జైలు నుంచి గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు.

కోటి విలువైన విదేశీ మద్యం స్వాధీనం

- విదేశాల నుంచి అక్రమంగా దిగుమతి
- నెలకు రూ.50 లక్షల వరకు బిజినెస్
- 220 మద్యం సీసాలు స్వాధీనం
- ఎనిమిది మంది సభ్యుల ముఠా అరెస్టు
- విదేశీ మద్యం కొంటే జైలే: అకున్ సభర్వాల్



హైదరాబాద్, జనవరి 7(మనం ప్రతినిధి): హైదరాబాద్‌లో భారీగా విదేశీ మద్యం పట్టుబడింది. ఓ వాహనంలో మద్యాన్ని తరలిస్తుండగా హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో అబ్కారీశాఖ అధికారులు పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీటి విలువ రూ. కోటి వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వారిని ఆదివారం సాయంత్రం మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేసుకు సంబంధించిన వివరాలను అబ్కారీ శాఖ డైరెక్టర్ అకున్ సభర్వాల్ ఆదివారం వెల్లడించారు. విదేశీ మద్యాన్ని అక్రమంగా సరఫరా చేస్తున్న ఎనిమిది నిందితులను అరెస్ట్ చేశామని, 220 మద్య సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ముఠా విదేశాల నుంచి మద్యం బాటిళ్లను అక్రమంగా దిగుమతి చేసుకుని నెలకు 600 నుంచి 800 బాటిళ్ల విదేశీ మద్యం విక్రయిస్తోందని తెలిపారు. దీని విలువ రూ. 50 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. విదేశీ మద్యం కొన్నవారికి మూడు నుంచి పదేళ్ల పాటు శిక్ష పడుతుందని, విదేశీ మద్యాన్ని ఎవరూ కొనవద్దని ప్రజలకు ఆయన సూచించారు.


కాంగ్రెస్ అంటేనే.. వంచన

- అదే ధోరణితో దేశాన్ని పాలించింది: కేటీఆర్
- నేడు కరీంనగర్‌లో 'కే సీ ఆర్' ప్రారంభం
- వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



హైదరాబాద్, జనవరి 7(మనం ప్రతినిధి): సాగుకు 24 గంటల విద్యుత్ అందించడం తమ ఘనతేనని కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. ఆ పార్టీ అవకాశవాద పార్టీ అని, 'వంచన- వ్యతిరేక రాజకీయాల కలబోత' అని ఎద్దేవా చేశారు. ఈ మేరకు తన ట్విట్టర్‌లో ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ కేటీఆర్ ఇలా బదులిచ్చారు. ఐదు దశాబ్దాల పాటు ఇదే రీతిలో కాంగ్రెస్ దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిదని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తొలి ఏడాది భారీస్థాయిలో విద్యుత్ సమస్యలు ఎదురయ్యాయని, వాటిని తమ ప్రభుత్వం సమర్థవంతంగా అధిగమించిందని పేర్కొన్నారు. కాగా, సోమవారం కరీంనగర్‌లో రూ.250 కోట్లతో 'కేసీఆర్(కరీంనగర్ సిటీ రెనోవేషన్)' పేరుతో వివిధ అభివృద్ధి పథకాలను ప్రారంభించనున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా.. కరీంనగర్‌లో తలపెట్టిన ఐటీ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్నారు.

ఇక మీరు మా వైపు చూడండి



చలి పులిలా ఘాండ్రిస్తుంది
ముదుసలులు వణుకుతున్నారు
శిశువులు తల్లుల గుండెలకానుకొని నిద్రిస్తున్నారు
హాస్టళ్ళలో పిల్లలు కప్పుకోవడానికి
దుప్పట్లు లేక గజగజలాడుతున్నారు
గుంపులు గుంపులుగా దోమలు
మురికి కూపాల్లో పేదలు
నిద్రలేని రాత్రులు
కొందరికి వేడిపుట్టే మిషన్లు
రగ్గుల్లో వెచ్చని నిద్రలు
ఆ పడతిసాలోచనలో వుంది
దుఃఖానికి సుఖానికి మధ్య
అంతరాన్ని అధిగమించింది
ఒంటరి తనంలో వున్న స్వేచ్ఛ
స్వతంత్రాన్ని సాధించినంత ఉత్సాహం
నిజమే సేవలోనూ ఒక ఉద్విఘ్నత
ఒక రాత్రిని దాటిస్తున్న పుస్తకం తోడు
ఒక మిత్రురాలి సంభాషణ
ఓ వృద్ధురాలికి చేయందించిన స్ఫూర్తి
ఓ దీపానికి నూనె పోసిన తృప్తి
వారిపుడే పాలపుంతల్లోని
విశ్వ సౌందర్యాన్ని చూస్తున్నారు
భూమి దేవత కాదు
అది ఒక గోళమని
ఇప్పుడే తెలుసుకొంటున్నారు
చైనా వీరుడు చూటే జీవితం రాసింది స్త్రీ అని
తెలుసుకుంటున్నారు
అమ్మను చిత్రించింది రచనా శిల్పి గోర్కి
వాస్తవ దృశ్యాలను ఇప్పుడే చూస్తున్నారు
అవును। అక్షరాల్లో ఇన్ని శిల్పాలు దాగున్నాయా!
దుఃఖం, సంతోషం, వేదన, వెన్నల, చీకటి
అన్నింటిని అక్షరాలు మన మనస్సుకు
అనుభూతం చేస్తాయి సుమా!
తాపీ ధర్మారావు ఇనుప కచ్చడాలు
బద్దలౌతున్న చప్పుడు
చలం మైదానంలోని
ఇసుక రేణువులు జడలు విప్పుకుని
చేస్తున్న నృత్య గానాన్ని వీరు వీక్షిస్తున్నారు
శరత్ సృష్టించిన పురుష దౌర్బల్యం
స్త్రీ ధీర శీలతను వీక్షిస్తున్నారు వీరు
అవును, వీరు ఒంటరిగా
ఉన్నారని ఎవరన్నారు ?
వారొక సైన్యంగానే వున్నారు
వారి మాటల్లో కవాతులు వినిపిస్తున్నాయి
భ్రమలు, భ్రాంతులు పోయి
ఆత్మ స్థైర్యంతో వారు నడుస్తున్నారు
'ఆత్మహత్య'కు గురయ్యే వారిని చూసి
ఇది మానసిక దౌర్బల్యం
'మనిషిగా పుట్టాక
పోరాడుతూనే బ్రతకాలి' అంటున్నారు
ఆధిపత్యాలన్నింటికి వీరు
సవాలు విసురుతున్నారు
ఇదేంటి? స్త్రీ సదస్సుల్లో
పురుష ప్రశ్నలు అని నిలదీస్తున్నారు
వారు కళ్ళతో మాట్లాడుతున్నారు
ఆ భాషరాని వారు నిరుత్తరులవుతున్నారు
పురుషులు కనులెత్తి చూడలేనంత
ఎత్తుకు వారు ఎదుగుతూ వున్నారు
నన్ను నేను గుర్తిస్తున్న యుగమిది
'నీ గుర్తింపు కోసం నేను ప్రాకులాడటం లేదు'
అన్నపుడు ఆకాశం నుండి వర్షం కురిసింది
కొత్త పంటలు పండాయి
అవును? ఆలోచనా స్రవంతికి
ఎండ, వాన, చలి ఏముంది?
అధీనం కాని వారెవరైనా
ఆకాశమంత ఎదుగుతున్నారు
ఈ యుగ సంకేతాలం మేము
ఇక మీరు మా వైపు చూడండి.

- డాక్టర్ కత్తి పద్మారావు
9849741695

మన సాహితి

విమర్శకాగ్రణి మల్లినాథ



సంస్కృత సారస్వతంలోని మహాకావ్యాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవడానికి వ్యాఖ్యానాలు ఎంతగానో ఉపకరిస్తాయి. కావ్య పఠనంవల్ల పాఠకులకు రసానందం కలిగితే, వ్యాఖ్యానాలవల్ల పాండిత్యం అలవడుతుంది. మహాకవి కాళిదాసు రచించిన సంస్కృత గ్రంథాలకు మల్లినాథ సూరి వ్యాఖ్యానాలు రచించాడు. రఘువంశం, కుమార సంభవం, మేఘసందేశం, ఈ మూడు కావ్యాలకు 'సంజీవిని' అనే పేరుతో వ్యాఖ్యను రచించినాడు. ఇతడు సుమారు పదిహేను గ్రంథాలకు వేరు వేరు పేర్లతో వ్యాఖ్యను చేసినాడు. భారవి కిరాతార్జునీయమును ''ఘంటాపథం' అనే వ్యాఖ్య తోను, మాఘుని శిశుపాలవధ అనే కావ్యానికి 'సర్వంకష' వ్యాఖ్యతోను, శ్రీహర్షుని నైషధ చరితమునకు 'జీవాతువు' పేరుతోను, బట్టి కావ్యమునకు, 'సర్వపథీన'తోను, ఏకావళికి 'తరళ', ప్రశస్తపాదభాష టీకకు 'నిష్కంటక', తంత్రవార్తికమునకు 'సాసోద్యోతము', కావ్యదర్శమునకు వైమల్య విధాయిని, నవోదయమునకు 'తరళ' అనే వ్యాఖ్యలను రచించినాడు. వీటన్నింటిలో 'సంజీవని' పేరుతో వెలయించిన వ్యాఖ్యలు ప్రపంచ ప్రసిద్ధి పొందినాయి. ఇవికాక మల్లినాథ సూరి 'వైశ్యవంశ సుధాకరము' 'రఘువీరచరితమ్', 'ఉదారకావ్యమ్', 'భక్తిరహస్యమ్', 'నక్షత్ర పాతాధ్యయనము' అనే ఐదు గ్రంథములను స్వతంత్రముగా రచించినాడు.

'విశేషణ ఆఖ్యానమ్ ఇతి వ్యాఖ్యానమ్' అని వ్యాఖ్యానమునకు గల నిర్వచనం. కవి మనస్తత్త్వాన్ని, పాండిత్యాన్ని, ఆలోచనలను, గుణాలను వెలికితీసి కొత్తకోణములో పాఠకులకు అందించు ప్రక్రియనే వ్యాఖ్యానం అంటారు. పుస్తకరచనకన్నా వ్యాఖ్యానం కష్టం. ఇందులో పదప్రయోగాన్ని అనేక కోణములలో నిశిత పరిశీలన చేసి, పరిశోధించి, విశేషములను గ్రహించి, సాహిత్య పదకోశమును క్షుణ్ణంగా అవలోకించి, వ్యాకరణ, సమాస, శబ్ద, అలంకారాలను అన్వయిస్తూ, పద, అర్థములను వివరించి పాఠకులకు తెలియజేయడమే దీని ఉద్దేశం. ఈ విధంగా చూచినప్పుడు ప్రధాన గ్రంథరచనకన్న ఈ వ్యాఖ్యాన ప్రక్రియ కఠినతరముగా భాసించుచున్నది. పంచ మహాకావ్యములను, తనలో జీర్ణించుకొని పాండిత్యప్రక్రియలను అవలోకించి, ఆలోచించి మహాకవి కావ్యాలను వ్యాఖ్యానము వ్రాయుటకు పూనుకున్న మహాకవి పండితుడు శ్రీమల్లినాథసూరి. ప్రపంచ వ్యాఖ్యాన చరిత్రలోనే గొప్పస్థానం సంపాదించుకున్న మల్లినాథసూరి మన తెలంగాణ ప్రాంతము వాడు.

మెదక్ జిల్లాలోని కొల్చారం మండలం ఒకప్పుడు కుగ్రామం. ఈ గ్రామంలో వైదిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన మన మల్లినాథసూరి తండ్రి కపర్ది సోమయాజి. తాతగారు మహాశతావధాని వీరిది పండితవంశం. కాకతీయుల ద్వారా అనేక సన్మానాలు పొందినారు.

ఇంతటి మహాపండితుని బాల్యం. ఆటపాటలతో గడిచింది. విద్యలో ఏ మాత్రము శ్రద్ధ చూపక సోమరిగా తిరిగేవాడు. తల్లిదండ్రులు ఈ విషయంలో ఎప్పుడూ విచారించేవారు. ఉపనయన సంస్కారం వలననైనా విద్యపట్ల శ్రద్ధాసక్తులు కలుగుతాయని తండ్రి కపర్ది బ్రహ్మోపదేశం చేసినా ఫలితం శూన్యం. పరిసరప్రాంతంలోని మల్లన్న గుట్టపై మహాయోగి ఒకరున్నారని, వారిని సందర్శిస్తే కుమారునిలో మార్పురావచ్చని ఆశించి, ఆ సాధు దర్శనార్థం మల్లినాథుని తీసుకొని వెళ్ళినారు. అప్పుడా సాధువు 'నీ కుమారుడు సత్పురుషుల సేవతోనే విద్యావంతుడై మహాపండితుడుగా ప్రసిద్ధి నొందగల'డని ఆశీర్వదించినాడు. మల్లినాథుడు అకుంఠిత దీక్షతో, సేవాభావంతో ఆ సాధువుని ఆరాధించి, సేవించాడు. కొంతకాలమునకు ఆ సాధువునకు అవసానదశ ప్రాప్తించగా చేరదీసి, సరస్వతీ మంత్రోపదేశం చేసి, నాలుకపై బీజాక్షరములను రాసినాడు. ఆ అనుష్ఠాన బలంతో సకల విద్యాపారంగతుడై వ్యాఖ్యానకర్తగా, మహాపండితునిగా ప్రసిద్ధినొందినాడు. వ్యాఖ్యాన చరిత్రలో ప్రప్రథముడు మల్లినాథసూరి సామాన్యులకు మహాగ్రంథములు అర్థము కావలెనంటే వ్యాఖ్యానమెంతో అవసరము. ఇంతకుముందు వచ్చిన వ్యాఖ్యానములన్నీ శబ్దార్థములకు మాత్రమే ప్రాధాన్యమిచ్చి, టీకా తాత్పర్యములతో మాత్రమే ఉండేడివి. కాని, మల్లినాథసూరి వ్యాఖ్యానములు మాత్రము సంజీవినివలె భాషా యోషకలంకారములై ఎంతో ప్రాచుర్యాన్ని పొందినవి. '.... కు వ్యాఖ్యావిషమూర్ఛితా ఏషా సంజీవినీ వ్యాఖ్యాపునర్జీవైష్యతి' అని ఘంటాపథంగా నిర్ణయించి, భాషాయోష విషమూర్ఛిత కాకుండా తన వ్యాఖ్యానాలతో పండితులకు అందించినాడు. ఈ వ్యాఖ్యానం వలన కలిగే గొప్ప ప్రయోజనం ఏమిటంటే, మహాకవులు రచించిన కావ్యాలు పాఠకులకు విజ్ఞానశాస్త్ర విషయాలను స్ఫురింపజేసి, వాటి లోతులను, కవిభావనను వారు ప్రబోధించిన మార్గములను, గ్రంథములోని సొగసులను, రచనా శైలిని తెలియజేయడమే ప్రధాన ఉద్దేశము. మల్లినాథుడు తాతగారి ధారణాపటిమను, తండ్రిగారి ధర్మశాస్త్ర పరిజ్ఞానమును, పరంపరాగతమైన విద్యాసంపదను, కుటుంబీకుల ఔన్నత్యమును, పుణికి పుచ్చుకొనుటలో సమర్థుడైనాడు. ఇంతటి విషయ పరిజ్ఞానము కలిగిన మహాపండితుడీ మల్లినాథసూరి కావుననే వీరి వ్యాఖ్యానములు బహుళ ప్రచారమును పొందినాయి.

విజయవాడకు చెందిన ఒక మహాపండితుడు విమర్శించిన విధము ఇట్లున్నది. కాళిదాసు రసజ్ఞతను గూర్చి వివరిస్తూ మల్లినాథుని వ్యాఖ్యను కించపరిచే విధంగా చేసిన విమర్శ సహృదయులను ఎంతోగానో బాధించుచున్నది. 'ఇట్టి కావ్యములకు వ్యాఖ్యానము చేయువాడు కూడ అనేక విషయములను తెలిసినవాడై వుండవలయును. దీని వ్యాఖ్యాత మల్లినాథుడగుట చేత ఆయా సందర్భములను సరిగా చెప్పలేకపోవుటయేకాక, తనకు తెలియని విషయములను గూర్చి ఊరుకొనక తెలిసినట్లు వ్రాసెను. అతడు చదువుకొన్నది వ్యాకరణము మాత్రమేనని, ఇతర శాస్త్ర విషయములు వచ్చినచోట అసందర్భముగా వ్యాఖ్యానించెను. ఈ కాలములో పండితులు చాలా మంది మల్లినాథుని వ్యాఖ్యానములు ఇట్లు అసందర్భముగా ఉన్నవంటే, మనమీదికి యుద్ధానికి దిగేవారున్నారు. వారికి ఆ మల్లినాథుని వ్యాఖ్యానమే నచ్చివుంటుంది. మిగతావిషయములు వారికీ తెలియవు. ఇది కాళిదాసు యొక్క ప్రతిభకు మల్లినాథుని వ్యాఖ్యానము తీరు' అని విమర్శించినాడు.

ఇంకా మల్లినాథునికి, ఊర్ధ్వముఖ కిరణములు, సూర్యుడు, కింద తిరుగుట అనే విషయములు అర్థముకాక తనకుతోచినట్లు అసందర్భపు వ్యాఖ్యానము చేసెను. హిమవత్పర్వత శిఖరములు సూర్యమండలము దాటి ఉండుట చేతను, అని వ్రాసెను. పరమాణువంత భూమి పర్వతమంత సూర్యుని దాటి ఉండుటయేమి? అని తోచలేదు. మల్లినాథుడు తలకాయకు రోకలిని చుట్టినట్లు అర్థములేని వ్యాఖ్యానములు చేసెను. ఇట్లే మేఘసందేశంలోని రామగిరి ఆశ్రమము మొదలగు సందర్భములందు మల్లినాథసూరి యొక్క పొరపాట్లను విమర్శించి చూపినప్పుడు కదా కాళిదాసుని సర్వజ్ఞత్వము తెలిసేది. 'కాళిదాసు సర్వజ్ఞుడని నిరూపించినచో మల్లినాథ సూరి అల్పజ్ఞుడని చెప్పకయే తెలియుచున్నదిగాని, మల్లినాథుని వ్యాఖ్యానము ప్రకారమే చదువుకుని కాళిదాసుని అర్థం చేసుకుంటే కాళిదాసుని కించిజ్ఞత్వమే తెలియును గదా! కావున పండితులైన వారు చక్కగా విమర్శించినప్పుడు గదా కాళిదాసు, మల్లినాథుల సర్వజ్ఞతాల్పజ్ఞతా భేద జ్ఞానము కల్గును. కావున విజ్ఞులు తాము పట్టిన కుందేటికి మూడేకాళ్ళని పట్టుబట్టరాదు.

''మల్లినాథ పండితుని విమర్శనా విధానము ఈ తీరున కొనసాగినది. కాళిదాసుని సర్వజ్ఞత్వమును తెలియజేయు ఉద్దేశముతో తద్వ్యాఖ్యాతయైన మల్లినాథుని అల్పజ్ఞుడని చెప్పుట దీని ప్రధానోద్దేశ్యమై యున్నది. ఇందులో పాండిత్య ప్రకర్షతోపాటు మల్లినాథ సూరి తెలంగాణ వాడనే ఏహ్యాభావము ద్యోతకమవుతున్నది.

◆ డాక్టర్ పైడిమర్రి మాణిక్ ప్రభు
ఆచార్యులు (విశ్రాంత)
8499980212

సౌందరనంద ధర్మావిష్కృతి



అద్యతనాంధ్ర సాహితీ చరిత్రలో కొత్తపాతల మేలుకలయికతో సంప్రదాయబద్ధ మైన కవితా శిల్పముతో నవీన భావ రీతులను సుకుమారముగా, సుందరముగా, సుమధురముగా ప్రస్ఫురింపజేసిన జంటకవుల సృష్టి సౌందరనందన కావ్యం. శ్రీ పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావు తిరుపతి వేంకట కవుల శిష్యులు. వారి దీవెనలు, ప్రభావముతో సౌందరనందన కావ్యమును రచించిరి. ఈ కావ్యమును గురుదక్షిణగా తిరుపతి వేంకట కవులకు అంకితమొనర్చినారు. ఈ కావ్యము ప్రసాద గుణం కలిగి మాధుర్యభావ సమంచితమై కుసుమ పేశలమైన రచనావిధానంతో అలరారుతుంది. ఈ శతాబ్దంలో-జాతీయోద్యమకాలంలో ఆంధ్రసాహిత్యంలో బౌద్ధగాథాలలితేతివృత్తములతో శాంత శృంగార రసప్రపూర్ణములై వెలగొందిన కావ్యములెన్నియో వెలువడినవి. ఇట్టి కావ్యములలో బుద్ధుని శాంతమూర్తిమత్వము వలె తాత్త్విక భూమికతో బౌద్ధ ధర్మ ప్రచారము విరాజిల్లినది. సౌందరనందం కావ్యంలో బౌద్ధమే ఇతివృత్తము. పింగళి, కాటూరిల ప్రతిభావ్యుత్పత్తులు పరిపుష్టముగా కలవారు. ఈ కావ్యం వారి కవితా పరిణితికి చక్కని నికషోపలమైనది. మధుర భావనా విలసితమై కవితా చమత్కృతితోనొప్పారుచు నవతా స్ఫూర్తితో పూర్వాధునిక కవితా సంగమముగా ప్రసిద్ధి చెందినదీ కావ్యం. ఇందులో పునరాగమనము, బిక్షాగమనము, పరివ్రాజము, నిరీక్షణము, అనుతాపము, ఉపదేశము, ధనర్మసంవాదము, అనుజ్ఞ, సహధర్మచర్యము అను తొమ్మిది సర్గలు గలవు. ప్రతి సర్గాదియందును సర్గార్థ సూచనము చేయు ఒక్కొక్క పద్యము నాంది-ప్రస్తావన వలె రూపక ధర్మమును స్ఫురించజేయుచున్నది.

'కలడు మహితాత్ముడైన శాక్యర్థికొక్క
సవతి తమ్ముండు కాంతినిస్తంద్రుడతడు
నందుడను కోడెప్రాయపుటందగాడు
సార్థకాఖ్యసుందరి వాని యతివ మిన్న''

ఈ సుందరీ నందుల జీవనవిధానపరిణామము మహత్వపూర్ణముగా చిత్రితమైనది. ప్రతి పద్యం తేనెల వాకవోలె, మాధురీ గుణ శోభితమై భావ ప్రసన్నతను వెలార్చును. పునరాగమనంలో బుద్ధుడు సిద్ధార్థుడై 'పల్లెలు బట్టణమ్ముల నవారిగ నీగతి ధర్మబీజముల్/చల్లుచు నేగుచో నడుగు సాగగనీయక మాకు మాకటం/చెల్లరు జట్టువారుదురటే! తిను బండము చేతనుండగా/తల్లిని జేరు పిల్లల విధంబున- నా పలుకెంత తీపియో!' బుద్ధుని ధర్మప్రచారము శ్రోతృజనసమ్మోనము. అతని ధర్మప్రచారము వినుటకు ప్రజలు గుంపులు గుంపులుగా వచ్చి వినువారే... ఆయన ధర్మప్రచారము తల్లి చేతిలో ఉండే తినుబండారము లాంటిది. బుద్ధుడు చూపించిన దారి అందిరికీ అనసరణీయము,యోగ్యమైజీవిత పరమార్థగమ్యాన్ని చేర్చేది కూడా. పండితులు, పామరులు,ధీరులు, భీరువులు అందరూ సంఘీభావంతో పోదగిన దారిని సంఘం శరణం గచ్ఛామి, ధర్మ శరణం గచ్ఛామి, బుద్ధం శరణం గచ్ఛామి అని విడమర్చి చెప్పిన మహనీయుడు గౌతమ బుద్ధుడు. ఇదియే సౌందరనందం కావ్య ప్రయోజనం. రచనలో ప్రసన్నమైన భావము, మాధురీ గుణము...పలుకుబడులలో సుకుమారత స్పష్టమగుచున్నది. శాంతరసోపస్కారముగా మంద్రగతితో స్వాదుమధురముగా సాగిన తత్త్వోపదేశికమైన రచన. వివాహ సమయంలో వధూవరులతో ధర్మేచ, అర్థేచ, కామేచ నాతిచరామి/నాతిచరితవ్య అనే ప్రమాణం చేయించుదురు. దీని వలన వివాహబంధం ఈ ప్రమాణం వలన దృఢానుబంధమగుచున్నది. ఇది భారతీయ వివాహ సంస్కారము యొక్క శోభను వెలార్చుచున్నది. మానవులు వయోభేదము లేకుండా ధర్మక్షతి జరుగకుండా అర్థకామములను అనుభవించెను ధర్మావిరుద్ధమైన అర్థకామములు దంపతులకు శ్రేయోనిధానములు.

> శ్రీ పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావు తిరుపతి వేంకట కవుల శిష్యులు. వారి దీవెనలు, ప్రభావముతో సౌందర నందన కావ్యమును రచించిరి. ఈ కావ్యమును గురుదక్షిణగా తిరుపతి వేంకట కవులకు అంకితమొనర్చినారు. ఈ కావ్యము ప్రసాద గుణం కలిగి మాధుర్యభావ సమంచితమై కుసుమ పేశల మైన రచనా విధానంతో అలరారుతుంది.




శృంగారరసస్ఫూర్తి గల నాయకా నాయకుల చిత్రణం మనోజ్ఞం - మనోహరం నడవుల రాజహంస/ తెలినవ్వుల వెన్నెల వాక / ప్రేమలు రెడి నునుబల్కు తేనెపెర - రెమ్మలు వైచు విలాసవల్లి ప్రేల్మిడి హృదయమ్మునచ్చిచను మేలిమి చూపు సుమాస్త్రమైన యా పడతుక నంద భాస్కరుని బాయగనోర్వదు ఛాయయుంబలెన్।।

సడలని కౌగిలింతలతో సీమమీరెడి ప్రణ
యాంబురాశి విహరించుచు ప్రొద్దుపోరు
పులుందెలియకుండా మన్మథ సామ్రాజ్యము నేలుచున్నారు.
ఇక్కడి పద్యములు సుకుమారభావశిల్పాలకు
కాణాచి మాధురీగుణభరితమై, మృదు
ఎదఘటితమై యొప్పారుచున్నవి. సురాపగ
నోలాడి తెచ్చిన పద్యములు హృద్యములు
అనపద్యములు, శృంగారరసం పరిపూర్ణంగా పోషింపబడినది.
అతివేలమైన కామముధర్మమునకు
విరుద్ధమైనది. కులీనుడైన యువరాజు
జగత్కల్యాణకరముగా ధర్మపరిపాలన
మొనర్చుట అతని విధి. రాజే కామాంధు
డైతే ప్రజలందరు కామాంధుతాదురు కదా!
యథారాజా తథాప్రజా అనికదా ఆర్యోక్తి!
అతని జీవనవిధానంలో మార్పు రావాలి
శృంగార రసభంగము జరగాలి!
సాత్వికమైన ప్రశాంతవాతావరణం కల్పించాలి.
హితము సహితమ్ము, సుచితానుచితములనెది
హద్దుల నతిక్రమించి, ఫలానుమేయ
ములగు నార్యశుభారంభములకు స్వస్తి
యగుత! విశ్వమ్మునకు శ్రేయమగునుగాత!
గౌతమమునీశ్వరుడు నివాత దీపకళిక
పోలిక నిశ్చల కాంతిరాశియైవెలింగుచు
శాంతరసస్ఫోరకములైన సుకుమారపద
బంధాతతో ధర్మనిష్ఠామహిత్వము విశ్వజనీనం
గా సార్వకాలికమనోజ్ఞంగా విశదీకరింపబడింది.
కవిజంట మహనీయ భావకవితాహరివిల్లును
శ్రోతృమనోగగనసేతులందు దృశ్యమానం జేశారు.
ఇలాగా ధర్మోపన్యాసం విశ్వ కళ్యాణం కొరకు చేసి
ప్రజావళిని తరింపజేసినాడు మహాత్యాగమూర్తి
శాంతమూర్తియైన గౌతమబుద్ధుడు
బుద్ధం శరణం గచ్ఛామి!

◆ తాడూరు మోహనాచార్యులు
9177378768

సరళి


స్పానిష్ భాషా సాహిత్యానికి కాణాచి
కార్లోస్ ఫ్యూయిన్‌టెస్ మాసియస్



'నా పుస్తకాలే అణు బాంబులు, నేను కాదు' అంటాడు కార్లోస్ ఫ్యూయిన్‌టెస్ మాసియస్. 1963లో న్యూయార్క్ సిటీలో పుస్తక ఆవిష్కరణ సభకు ఆయన రాకుండా అమెరికా మోకాలు అడ్డుపెట్టినప్పుడు ఫ్యూయిన్‌టెస్ అలా వ్యాఖ్యానించాడు. 'అమెరికా తనని తాను అర్థం చేసుకోటంలో దిట్ట; కానీ ఇతర దేశాలని అర్థం చేస్కోటంలో మహా చెడ్డది సుమా!' అని హెచ్చరిస్తాడు. ఫ్యూయిన్‌టెస్ గొప్ప నవలా రచయిత, విశ్లేషకుడు. లాటిన్ అమెరికన్ సాహిత్య సంచలనాల వెల్లువకి ప్రధాన కారకుల్లో ప్రముఖుడు. ప్రతిసారీ నోబెల్ బహుమతి ఆయన్ని వూరించినా అందుకోలేకపోయిన దురదృష్టవంతుడు. ఫ్యూయిన్‌టెస్ పనామా సిటీలో 11 నవంబర్ 1928లో జన్మించాడు. మెక్సికన్ జాతీయుడు. బెర్టా మాసియస్, రాఫెల్ ఫ్యూయిన్‌టెస్ దంపతులు అతని తల్లిదండ్రులు. తండ్రి విదేశీ వ్యవహారాల్లో నిపుణుడు. దాంతో అనేక లాటిన్ అమెరికన్ దేశాల్లో తండ్రి వుద్యోగ బదిలీల రీత్యా ఫ్యూయిన్‌టెస్ బాల్యం గడిచింది. ఆ అనుభవమే ఆయనకి లాటిన్ అమెరికన్ దేశాల గురించి బైటవాడిగా దర్శించే అనుభవాలను ప్రసాదించింది. 1934 నుంచి 1940 వరకు ఫ్యూయిన్ టెస్ తండ్రి వాషింగ్టన్‌లోని మెక్సికన్ రాయబార కార్యాలయంలో పనిచేశాడు. ఫలితంగా ఫ్యూయిన్‌టెస్ ఆంగ్లంలో నిష్ణాతుడయ్యాడు. ఆ సమయంలోనే కలం పట్టి చిన్న పత్రికలు నడిపి తన రచనలు, గుభాళింపులు చుట్టుపక్కల వారికి పంచేవాడు. కాని సాటి విద్యార్థుల యీసడింపులతో తనని తాను మెక్సికన్‌గా గ్రహించుకున్నాడు.

1940 తర్వాత ఫ్యూయిన్‌టెస్ తండ్రి చిలీ దేశపు శాంటియాగో నగరానికి ఉద్యోగరీత్యా బదిలీ అయ్యాడు. అక్కడే ఫ్యూయిన్‌టెస్ సోషలిజానికి, పాబ్లోనెరూడా కవిత్వానికీ జీవితాంతం దాసోహం అయినాడు. తన 16వ యేట మెక్సికన్ సిటీలోని స్వయంపాలిత జాతీయ విశ్వవిద్యాలయంలో విదేశీ వ్యవహారాల్లో నిపుణత కోసం చదువుకున్నాడు. ఆ కాలంలోనే చిన్న కథలు రాస్తూ హాయ్ దిన పత్రికలో పనిచేశాడు. 1957లో ఆయన విదేశీ వ్యవహారాల సాంస్కృతిక శాఖ అధిపతిగా నియమించబడ్డాడు. ఆ మరుసటి యేడే ''వేర్ ది ఎయిర్ ఈజ్ క్లియర్'' నవల వెలువరించాడు. దాంతో జాతీయ ప్రముఖుడిగా కీర్తి గడించాడు. పూర్తి సమయం రచనలు చేసేందుకు అవకాశం వరించింది. 1959 క్యూబా విప్లవ కాలంలో హవానాకు వచ్చి క్యాస్ట్రోకి అనుకూలంగా వ్యాసాలు రాశాడు. మెక్సికన్ సినీనటి రీటా మార్సిడోని పెళ్లియాడి; అనేక సినీతారలతో శృంగార జీవితం నెరిపాడు. ఆ అనుభవాల పరంపరలో 'ది గాడెసెసేహూ హంట్స్‌యలోన్' నవల రాశాడు. ఆయన యింకా కేంబ్రిడ్జ్, బ్రౌన్, ప్రిన్స్‌టన్, హార్వర్డ్, కొలంబియా, పెన్సిల్వేనియా మున్నగు విశ్వవిద్యాలయాల్లో బోధించాడు. ఆయన రెండో వివాహం జర్నలిస్ట్ సిల్వియా లెమూస్‌తో చేసుకొని జీవితాంతం ఆ బంధాన్ని కొనసాగించాడు.

ఫ్యూయిన్‌టెస్‌కి అక్టోవియో పాజ్ మంచి మిత్రుడు. కానీ పాజ్ తన పత్రికలో ఫ్యూయిన్‌టెస్‌కి, మెక్సికన్ జాతీయత అసంగతం, దాన్ని అడ్డంపెట్టుకొని రచనలు చేస్తున్నాడని తన పత్రికలో వ్యాసం రాయించటంతో ఆ బంధానికి గండిపడింది. ది డెత్ ఆఫ్ ఆర్టేమియో క్రూజ్ (1962), ఆరా (1962), ధిర్రానోస్ట్రా (1975), ది ఓల్డ్ గ్రింగో (1985), క్రిస్టఫర్ అన్‌బార్న్ (1987) నవలలు ఆయనకి అపార కీర్తిని మోసుకొచ్చి ఓ సెలబ్రిటీగా జీవితాంతం గడిపాడు. కానీ ఆయన మార్క్సిజాన్ని అభిమానించినా మోడెరేట్ లిబరల్‌గా కుడి - ఎడమల రాజకీయాల్ని, వాటి అతివాదాన్ని ఎండగట్టేవాడు. అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించాడు. ఫలితంగా అమెరికా ఆయనకు 1967 దాకా వీసా ప్రసాదించలేదు. అంతే కాదు క్యూబాలో క్యాస్ట్రో నియంతృత్వాన్ని తీవ్రంగా జీవితాంతం విమర్శించాడు.



ఆయన నవలలు ప్రపంచంలో 24 భాషల్లోకి అనువాదానికి నోచుకున్నాయి. అవి లాటిన్ అమెరికన్ల జీవితాలను, అవినీతిని, విప్లవాలను, అండర్‌గ్రౌండ్ డ్రగ్ కార్యకలాపాలను ఎత్తిచూపేవి. 15 మే 2012లో మెక్సికో సిటీలో తలపోటుతో మరణించాడు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు మెక్సికో సిటీలో జరిగాయి. మెక్సికో దేశ అధ్యక్షుడు హాజరై, ఒక ప్రపంచ రచయితని, విశ్వమానవ మెక్సికన్ పౌరుడ్ని కోల్పోయామని వాపోయాడు. ఫ్రెంచ్ దేశపు అధ్యక్షుడు తమ దేశపు గొప్ప మిత్రుడ్ని యిక చూడలేమని సంతాపం ప్రకటించాడు. ల్లోసా ప్రపంచ సాహిత్యంపై గాఢముద్ర వేసిన రచయిత ఫ్యూయిన్‌టెస్ అని శ్లాఘించాడు. ఫ్యూయిన్‌టెస్ మరణించేముందు ఇచ్చిన ఆఖరి సందేశంలో మానవాళి అస్తిత్వం కోసం హింసకు, అనాగరికతకు ఆవల వున్నదేదో వెతకాలని ట్విట్ చేశాడు.

◆ సాగర్ శ్రీరామకవచం

భావ ప్రకటన స్వేచ్ఛపై
దాడి తగదు

విజయవాడలో జరుగుతున్న పుస్తక ప్రదర్శనలో కొంతమంది దుండగులు ప్రముఖ కథా రచయిత, కవి స్కైబాబపై దాడికి దిగడాన్ని ఖండిస్తున్నాము. జల్‌జలా, ముఖామి పుస్తకాలను 'హర్యాలి ముస్లిం రచయితల వేదిక' తరపున ఆవిష్కరించాల్సి ఉన్నది. ఈ సభకు అధ్యక్షుడిగా విజయవాడ వెళ్ళిన స్కైబాబను పుస్తక ప్రదర్శన జరుగుతున్న ప్రదేశం నుంచి బయటికి తరిమేయడం గర్హించాల్సిన విషయం. ఒక ముస్లింగా, తెలంగాణ వాదిగా ఆంధ్రా పాలకుల దురంతాలను నిలదీసినందుకు ప్రతిగా ఈ దాడి జరిగింది. 'తెలంగాణ ఉద్యమ సమయంలో నువ్వు ఆంధ్రాపై విషంగక్కినవ్. ఈ గడ్డమీద నువ్వెట్లా అడుగుపెడతవ్, ఇక్కడి నుంచి వెంటనే వెళ్ళిపో' అంటూ దుర్భాషలాడడం అవాంఛనీయం.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి ఆంధ్రా ప్రాంతం వారికి కూడా సగౌరవ మైన ఆహ్వానం పలికింది. దీనికి ప్రతిగా ఆంధ్రప్రదేశ్‌లో ఆఖరు నిమిషంలో ముఖ్యమంత్రి పేషీ నుంచి వత్తిడి వస్తోంది అంటూ సభ నిర్వహణకు ఇచ్చిన అనుమతిని రద్దు చేసుకున్నారు. పోలీసు వాళ్ళు జోక్యం చేసుకుంటూ 'లోపలేస్తే ఆర్నెల్ల వరకు బైటికి రావు' అని బెదిరించడాన్ని కూడా ఖండిస్తున్నాం. ఎప్పుడో ఉద్యమ సమయంలో రాసిన కవితను ఉదాహరిస్తూ ఇప్పుడు దాడికి దిగడం వారి దివాళాకోరుతనానికి నిదర్శనం. రాతలను రాతలతోనే ఎదుర్కోవాలనే ఇంగితం లేకుండా భౌతికంగా దాడికి దిగడం, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడం వారి గుండాగిరికి నిదర్శనం. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ఇవ్వాళ ముస్లిం రచయిత, తెలంగాణవాది స్కైబాబపై దాడికి దిగడాన్ని ప్రజాస్వామిక, లౌకికవాదులందరూ ఖండించాలి.

ఈ సంఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేయడమే గాకుండా ఇలాంటి సంఘటనలు పునరావృతం గాకుండా చర్యలు తీసుకోవాలని కవులు, రచయితలుగా డిమాండ్ చేస్తున్నాం.

- నందిని సిధారెడ్డి, జూలూరు గౌరీశంకర్, దేశపతి శ్రీనివాస్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, పసునూరి రవీందర్, కాసుల ప్రతాప రెడ్డి, అంబటి సురేంద్రరాజు, ఖాజా, సూర్యపల్లి సుజాత, సంగిశెట్టి శ్రీనివాస్, షాజహాన, మోహన్ రుషి, నలిమెల భాస్కర్, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, జూపాక సుభద్ర, గుడిపల్లి నిరంజన్ , అన్వర్, సయ్యద్ ఖుర్షీద్, వహీద్ మహమ్మద్, అక్బర్ ఖాన్, అజీద్, సయ్యద్ గఫార్, పెన్నా శివరామకృష్ణ, పర్స్‌పెక్టివ్ ఆర్కె, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, ఎకె ప్రభాకర్, జుగాష్ విలీ, తుమ్మల దేవరావు, ఎం.నారాయణశర్మ ఆశారాజు, గాజుల శ్రీధర్, అన్వర్, పగడాల నాగేందర్, దాసరాజు రామారావు, కార్టూనిస్టు శంకర్, ఆర్టిస్టు అక్బర్.

హరిత క్రాంతి దర్శి గ్రీన్‌పీస్



విశ్వాంతర పర్యావరణ పరిరక్షణ సంస్థలో గ్రీన్‌పీస్ సంస్థకు అంతర్భాగంగా ఉన్న ప్రభుత్వేతరతర లాభాపేక్షలేని సంస్థ. 55 దేశాల్లో శాఖలున్న ఈ సంస్థ అమెరికా, ఆసియా, పసిఫిక్, యూరప్ దేశాల్లో పనిచేస్తోంది. మనదేశంలో ఈ సంస్థ నాలుగు నగరాల నుంచి కార్యకలాపాలు సాగిస్తోంది. బెంగళూరు ప్రధాన కేంద్రంగా, ఢిల్లీ, చెన్నై, పాట్నా నగరాల్లో ఈ సంస్థకు శాఖలున్నాయి. మనదేశం లోని దాతల నుంచి దాదాపు 60 శాతం నిధులు ఈ గ్రీన్‌పీస్‌కు అందుతాయి. 38 శాతం నిధులు నెదర్లాండ్‌లోని గ్రీన్‌పీస్ అంతర్జాతీయ సంస్థ నుంచి, ఒక శాతం అమెరికాకు చెందిన వాతావరణ పనుల ఫౌండేషన్ నుంచి అందుకుంటోంది. 2014 జూన్ తరువాత ఈ సంస్థకు విదేశాల నుంచి ఎటువంటి విరాళాలు అందలేదని తెలుస్తోంది. ప్రభుత్వం, అంతర్ ప్రభుత్వాల సంస్థలు, రాజకీయ పార్టీలు, కార్పొరేషన్ల నుంచి గ్రీన్‌పీస్ విరాళాలు స్వీకరించదని సంస్థ స్పష్టంచేస్తోంది. ఆయా సంస్థలు, ప్రభుత్వాల ఒత్తిళ్లు, జోక్యాలను నివారించేందుకు పై వాటి నుంచి విరాళాలను సంస్థ నిరాకరిస్తోంది. మనదేశంలోని గ్రీన్‌పీస్ కార్యాలయంలో మానభంగాలు, లైంగిక వేధింపులు చోటుచేసుకుంటున్నాయని 2015లో అనేక మహిళా సంఘులు ఆరోపణలు చేశాయి. 1970 నుంచి ఆరంభమైన గ్రీన్‌పీస్ ఈ కింది కార్యకలాపాలను నిర్వర్తిస్తోంది.

అభివృద్ధి వ్యతిరేక కార్యకలాపాల ఆరోపణ

భారత్‌లో అణుశక్తి, థర్మల్, బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలను, అల్యూమినయం గనుల తవ్వకాలను గ్రీన్‌పీస్ తీవ్రంగా వ్యతిరేకించింది. బీహార్‌లో అమెరికాకు చెందిన జెమ్లిన్ సర్ఫేస్ ఆప్టికల్ కార్పొరేషన్ పరికరాలతో సౌరశక్తి ఇంధనాన్ని ప్రోత్సహించడం గ్రీన్‌పీస్ వ్యతిరేకించింది. జాతీయ ఆర్థిక భద్రతకు గ్రీన్‌పీస్ సంస్థ హానికారిగా మారిందని నిఘా విభాగం ఆరోపించింది.


ఆర్థిక ఉల్లంఘనలు

ఫెరా నిబంధనలను గ్రీన్ పీస్ సంస్థ అనేక ఆర్థిక ఉల్లంఘనలకు పాల్పడిందని 2013 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం కేసులు నమోదుచేసింది. ఈ మేరకు సీబీఐ చార్జిషీటు కూడా దాఖలుచేసింది. విదేశీ నిధుల్ని ఆదాయపు శాఖకు తెలియజేయకుండా నిధుల్ని దుర్వినియోగం చేసిందనే ఆరోపణలపై గ్రీన్‌పీస్ సంస్థకు దేశవ్యాప్తంగా గల బ్యాంకు ఖాతాలను కేంద్రం స్తంభింపజేసింది. పన్ను ఎగగొట్టేందుకు పాలనాపరమైన ఖర్చులకు 60 శాతానికి మించి ఖర్చుచేసినట్లు సంస్థ తెలియజేసిందని ఆరోపణ. ఎఫ్‌సీఆర్ఏ నిబంధనల ప్రకారం 50 శాతానికి మించి విదేశీ నిధులను ప్రభుత్వేతర సంస్థలు నిర్వహణా సంబంధమైన వాటికి ఖర్చుచేయకూడదు. 2015 ఏప్రిల్ 28న గ్రీన్‌పీస్ ఖాతాలను స్తంభింపచేసి సంస్థ లైసెన్స్‌ను కేంద్రం సస్పెండ్ చేసింది. అయితే, గ్రీన్‌పీస్ ఉద్యోగులు జీతభత్యాలు లేకుండానే పనిచేయాలని నిర్ణయించారు. సంస్థ తన రోజువారీ కార్యకలాపాలను నిర్వర్తించేందుకు వీలుగా 2015 మే నెలలో హైకోర్టు ఉపశమనం కలిగించే ఉత్తర్వులు జారీచేసింది. విచారణ తుది తీర్పు వెలువడే వరకు కేంద్రం స్తంభింపజేసిన ఖాతాలపై స్టే మంజూరు చేయలేదు.

– మహి డెస్క్

చేపట్టిన కార్యక్రమాలు

- 2001 – బంగాళాదుంప చిప్స్, ఐసోమిల్ పిల్లల ఆహారంలో జన్యుపరమైన సమ్మిళత పదార్థాలు కలిగివున్నాయని గ్రీన్‌పీస్ సంస్థ బయటపెట్టడమే కాకుండా ఈ ఆహార పదార్థాలకు జీఎంఓ సర్టిఫికెట్‌ను స్వేచ్ఛగా మంజూరు చేయడాన్ని ప్రశ్నించింది.
- 2002 – జన్యుపరంగా మార్పుచేసిన ఆహారపదార్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రీన్‌పీస్ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. జన్యుపరంగా మార్పుచేసిన ఆవాల ఉత్పత్తిని నిరోధించగలిగింది.
- 2004 – గ్రీన్‌పీస్ వల్ల భారత్‌లో జన్యుపరమైన ఇంజినీరింగ్ పరిశోధనను బేయర్ సంస్థ విరమించుకున్నది.
- 2005 – తెలంగాణ వరంగల్ జిల్లా నరసంపేట మండలంలో బీటీ కాటన్ పేరుతో రైతులను అధికారుల సహకారంతో దాదాపు రెండు కోట్ల రూపాయలకు మోన్‌సాంటో సంస్థ మోసం చేసిందని ఢిల్లీలో గ్రీన్‌పీస్ ప్రకటించింది. ఫలితంగా బీటీ కాటన్‌కు చెందిన మూడు రకాల విత్తనాలపై నిషేధం విధించి దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. వరంగల్ జిల్లా వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ (జేడీఏ)ను సస్పెండ్ చేశారు. రైతులకు తగిన నష్టపరిహారాన్ని అప్పటి అవిభక్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించింది.
- 2006 – భారత్‌కు ప్రమాదకర వ్యర్థపదార్థాలను నౌక ద్వారా ఫ్రాన్స్ తరలించడానికి భారత ప్రభుత్వం అనుమతించడం పట్ల ఈ సంస్థ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది.
- 2010 – అణు సరఫరా బిల్లులో 'సంపూర్ణ సరఫరా బాధ్యత'ను చేర్చడంలో గ్రీన్‌పీస్ విజయం సాధించింది.
- 2014 – గ్రీన్‌పీస్ నేతృత్వంలో రూపొందిన సౌరశక్తి ఆధారితమైన సూక్ష్మ గ్రిడ్ ద్వారా బీహార్‌లోని ధర్నయ్ గ్రామాన్ని సంపూర్ణ విద్యుత్ గల గ్రామంగా తయారుచేసింది.
- 2015 ఏప్రిల్ – విదేశీ విరాళాల (క్రమబద్ధీకరణ) నియంత్రణ నిబంధనల (ఎఫ్‌సీఆర్ఏ)ను పాటించడంలో విఫలమైనందున సంస్థ బ్యాంక్ ఖాతాలను కేంద్రప్రభుత్వం స్తంభింపచేసింది.
- 2015 నవంబర్ 6 – ఆర్థిక అవకతవకల కారణంగా తమిళనాడులోని గ్రీన్‌పీస్ సంస్థను మళ్లీ రిజిస్టర్ చేయించుకోవాలని రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీ (ఆర్ఓఎస్) ఆదేశించారు.
- 2015 నవంబర్ 21 – తమిళనాడు ఆర్ఓఎస్ సహజ న్యాయసూత్రాలను అనుసరించలేదనే కారణంతో గ్రీన్‌పీస్ సంస్థ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేయడాన్ని మద్రాసు హైకోర్టు రద్దుచేంది.



భారీ నీటి ప్రాజెక్టులతో పొంచివున్న

జలగండం!

దేశంలో భారీ నీటి ప్రాజెక్టులన్నీ వివాదాస్పదంగా మారాయనడంలో అతిశయోక్తి లేదు. భూసేకరణ, నిర్వాసితుల సమస్య, పర్యావరణ సమస్య, భూకంపం వల్ల వేలాది ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిన చైనా తరహా ప్రాజెక్టు విధ్వంసాలే కాకుండా నిర్దేశిత ప్రయోజనాలు లబ్ధిదారులకు చేకూరే అవకాశాలూ లేకపోవడం సైతం పర్యావరణ వేత్త లకు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వాలు నిర్మిస్తున్న భారీ నీటి ప్రాజెక్టులపై ఆర్థిక, సామాజిక, పర్యావరణ వివాదాలు ఇప్పటికీ కొన సాగుతూనే ఉన్నాయి. నర్మదా నదిపై నిర్మించిన అతి పెద్ద సాగునీటి ప్రాజెక్టుకు వ్యతిరేకంగా 1985 నుంచి నర్మదా బచావో ఆందోళన్ కొన సాగుతూనే ఉంది. ముంపునకు గురైన ఆదివాసీ ప్రజలు గోలపెడు తున్నా ఆంధ్ర ప్రదేశ్ నాగరిక ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని కొనసాగిస్తుండగా, తెలంగాణ ప్రభుత్వం ఆదివాసీ ప్రజల గోడు ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ ప్రాజెక్టు వల్ల తెలం గాణ ప్రాంతంలో పెద్ద ఎత్తున పర్యావరణ విధ్వంసం జరుగుతుంది. ప్రాజెక్టు ఆధారిత సాగునీటి విధానం ఎంత విచిత్రంగా మారిందంటే ప్రధాన నదికి నీటి వనరుగా ఉన్న ఉపనదులు, సెలయేర్లు తదితర పరివాహక ప్రాంత నీటి ఆకరాలన్నిటిపై ఎగువ రాష్ట్రాలు చెక్ డ్యాంలు, చిన్న, పెద్ద ప్రాజెక్టులు నిర్మిస్తూ ప్రధాననదిలో నీటి లభ్యతను అడ్డు కుంటున్నాయి. పశ్చిమ కనుమల్లో పుట్టి అరేబియా సముద్రంలో కలిసే కాళినదిపై కర్ణాటక ప్రభుత్వం ఆరు పెద్ద డ్యాంలు, అనేక రిజర్వాయర్లు నిర్మించడంతో, 183 కిలోమీటర్లు ప్రహిస్తున్న కాళీ నది ప్రస్తుతం కేవ లం 8 కిలోమీటర్లు మాత్రమే స్వతసిద్ధంగా ప్రవహిస్తోంది. భారతదేశంలో ఈనాటి వరకు పర్యావరణ ప్రవాహాలపై (నదుల నిరంతరాయ ప్రవా హాలు) ఎలాంటి చట్టం రూపొందలేదు. 'అవిరళ ధార' అంటే నిరంతరాయంగా నదీజలాలు ప్రవహించాల్సిన అవసరాన్ని గుర్తించిన మొట్టమొదటి దేశాలలో భారత్ ఒకటిగా నిలుస్తుండడం ఆశ్చర్యకరమైన విషయం. 1916లో గంగా నదీ జలాల నిరంతరాయ ప్రవాహంపై మొట్టమొదటిసారి బ్రిటీష్ వాళ్ళతో పండిట్ మదన్ మోహన్ మాలవ్యా ఒప్పందం చేసుకున్నారన్న విషయం దాదాపు మరుగున పడింది. అయితే ప్రాజెక్టు నిర్మాణాలను రాజకీయ పక్షాలు, ప్రభుత్వాలు నీటి న్యాయం పేరుతో ప్రజలను స్వార్థపూరితంగా రెచ్చగొడుతున్నాయి.

ఒండ్రు మేట – పోషకాలు హుళక్కి

నీటి ప్రాజెక్టులు నీటి నిల్వ సమస్యను ఎంత మాత్రమూ పరిష్కారం చేయకపోగా, పేరుడు వల్ల నదిలో నీటినిల్వ సామర్థ్యం 75 శాతా నికి క్షీణిస్తోందని అధ్యయనాలు చెబుతున్నాయి. భారీ ప్రాజెక్టులలో రోజులు, నెలల తరబడి భారీ మొత్తంలో నీటిని నిల్వ చేయడం వల్ల ఆ నీటిలో పంటలకు ఉపకరించే పోషకాలు క్రమంగా ఒక తెట్టుగా/ పేరు డుగా జలాశయాల అడుగున పేరుకు పోతాయి. మొక్కకు అవసరమైన పోషకాలులేని నీటివల్ల రైతులు కృత్రిమ ఎరువులను అధికంగా వినియో గించవలసి వస్తుంది. దాంతో ఉత్పత్తి ఖర్చు విపరీతంగా పెరిగిపోయి, వ్యవసాయం నష్ట దాయకంగా మారుతుంది. కాలం చెల్లిన డ్యాం మన దేశంలో 115 ఉండగా, మన రాష్ట్రంలో 13 దాకా ఉన్నాయి. నది ఎగువ నుంచి దిగువ దాకా వరద స్థాయి (ఫ్లెడ్ లెవెల్) డ్యాంల నిర్మాణం చేప డితే, భారీ ప్రాజెక్టు కింద రూపొందే పారుదల విస్తీర్ణం (అయకట్టు) కం టే అదనంగా సాగునీటిని విస్తార ప్రాంతాలకు అందింవచ్చని, వేలాది ఏళ్లుగా పరిఢవిల్లుతున్న నదీప్రాంత నాగరికత, సంస్కృతుల పరిరక్షణ జరుగుతుందని పర్యావరణవేత్తల అభిప్రాయం. నాగార్జునసాగర్, పోలవరం, కాళేశ్వరం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నుంచి సరఫరా అవు తున్న సాగునీరు పోషకాలు లేని సారహీనమైన నీటి వల్ల తెలుగు ప్రజ లకు ఆశించిన ప్రయోజనం చేకూరదు సరికదా, ఇన్‌పుట్స్ ఖర్చు పెరి గి, గిట్టుబాటు ధరలేక అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం దాపురిస్తుంది. అదీ కాక పోలవరం నీళ్లు వ్యవసాయం కంటే పారిశ్రామిక అవసరాలే లక్ష్యంగా నిర్మిస్తున్నారని పర్యావరణవేత్తల విమర్శ.

తరిగిన నీటి నిల్వలు

మన దేశంలో 5 వేలకు పైగా డ్యాంలున్నాయి. నీటి లభ్యత తగినంతగా ఉన్నప్పటికీ, సరైన నీటి నియంత్రణ మనకు కొరవడింది. మనం అమలు చేస్తున్న డ్యాం నిర్మాణ నీటినిల్వ విధానం లోపభూయిష్టంగా మారింది. జపాన్‌లో భూ ఉపరితల డ్యాంలు కాకుండా, భూగర్భ డ్యాంలు కట్టడం వలన నీరు ఆవిరయ్యే ప్రమాదం ఉండదు. భారత దేశం లాంటి ఉష్ణ మండల ప్రాంతాలలో నీరు ఆవిరయ్యే రేటు అధికంగా ఉంటుంది కాబట్టి, భూగర్భ డ్యాంలు నిర్మించడం ఇక్కడ అత్యవసరం. సబ్ సర్ఫేస్ డ్యాం (భూగర్భ నీటి ప్రాజెక్టు)ల నిర్మాణం వల్ల నీరు ఆవిరయ్యే పరిమాణాన్ని తగ్గించడమే కాకుండా, అవి భూ ఉపరితల ప్రవాహాలకు అంతరాయం కలిగించకుండా భూగర్భ జలాల నిల్వ సామర్థ్యాన్ని పెంచుతాయి. ఈ నీటిని డ్యాం నుంచి బావులకు ఎగువునుంచి నీటిని పొందవచ్చు.

ప్రత్యామ్నాయ ప్రాజెక్టులే పరిష్కారం

భూగర్భ జలాశయంలో నీటిని నిల్వ ఉంచే పద్ధతి కనుక అమలు చేస్తే, ఆ డ్యాం వల్ల సారవంతమైన నేల ముంపుకు గురయ్యే ప్రమా దం ఉండదు. భూ గర్భ రిజర్వాయర్ నుంచి నీరు అవిరయ్యే అవకాశమే ఉండదు. రిజర్వాయర్లలో బురద పేరుకు పోవడం వంటి సమస్యలు తలెత్తి, అంతిమంగా డ్యాం కూలిపోవడం వంటి ప్రమాదాలను నివా రించవచ్చు. ఈ మధ్యకాలంలో 'కోస్టల్ రిజర్వాయర్స్' (తీర ప్రాంత రిజ ర్వాయర్లు) నిర్మాణం అనే భావనను శాస్త్రవేత్తలు ముందుకు తెస్తున్నారు. వర్షాకాలంలో ఈ కోస్టల్ రిజర్వాయర్ల సహాయంతో వరద నీటిని నిల్వ చేసినట్లయితే నీటి కొరత సమస్యను అధిగమించవచ్చని వారు చెబుతు న్నారు. సముద్రంలో కలుస్తున్న నీటి నిల్వ కోసం నదీ ముఖద్వారం వద్ద రిజర్వాయర్‌ను నిర్మించాల్సి ఉంటుంది. ఈ తీర ప్రాంత రిజర్వాయర్ల ద్వారా వరద నీటిని మాత్రమే సమీకరించి, అదనపు నీటిని సముద్రం లోకి వదిలి వేసే అవకాశం ఉంటుంది. ప్రత్యామ్నాయ సాగునీటి విధా నం, నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఉన్న అవ కాశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకుంటే నీటి వైషమ్యాలు పెరిగిపోవడం ఖాయం.

– వెన్నెలకంటి రామారావు
9550367536

రూటు మారిన రుతురాగాలు


మథనం

కరువుతో అల్లాడుతున్న సమయంలో వరదలు రావడం భారతీయ సమకాలీన ప్రత్యేకతగా మారింది. ఇదెలా సంభవమో చూద్దాం. ప్రతి ఏడాది తీవ్రమైన కరువుకాటకాలు, ఘోరాతిఘోరమైన వరదలు క్రమం తప్ప కుండా మనల్ని వేధిస్తున్నాయి. కొన్ని సార్లు కరువు–వరదల విషమ చక్రం మనల్ని మరింత తీవ్రంగా బాధిసు ్తన్నాయి. అయితే ఇలాంటి వైచిత్రి దేశంలో సర్వసాధారణ ప్రక్రియగా నిలిచింది. మొదట్లో వరదలు, కరవులు ఒకేసారి వచ్చేవి. నేడు దేశంలోని 40 శాతం జిల్లాలు తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొంటే, అదే సమయంలో 25 శాతం జిల్లాల్లో 10 సెంటీమీటర్లకు మించిన అతివృష్టి సంభవిస్తుంది. విషయమేమంటే ఈ వర్షపాతం వైవిధ్య పూరితంగా ఉండటమే కాక, చాలా అతిశయంగా ఉంటుంది. దేశంలో చెన్నై, ముంబాయి, జమ్మూ–కశ్మీర్ రాష్ట్రం లోని పర్వత పట్టణ ప్రాంతాలు సహా వివిధ నగరాలు నేడు వరద బీభత్సంలో కూరుకుపోవడం చూస్తున్నాం. పట్టణ వరదలు అనే స్వయంకృత అపరాధాలుగా పాలకులు గుర్తించాలి. ఒకటి–మన నీటి యాజమాన్య విధానం పూర్తిగా అశాస్త్రీయమైనది. మనం నీటి వనరులను ధ్వంసం చేస్తూ, నీటి ప్రవాహప్రాంతాలను అడ్డగిస్తూ ఆవాస ప్రాంతాలను నిర్మిస్తూ పోతున్నాం. ముంబయి, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, పుణె తదితర నగరాలు పట్టణ ప్రాంత వరదల్లో చిక్కుకుని కకావికలమయ్యాయి.

మరోవైపు భూతాపం కారణంగా ఏర్పడిన వాతావరణ మార్పుల వల్ల మన రుతుపవనాలు దారితప్పు తున్నాయి. వాటి స్వభావం మారిపోయిది. సకాలంలో వర్షాలు కురవకపోవడమే కాక, ఒక్కరోజులో ఆకాశానికి చిల్లిపడినట్లు అకాల అతివృష్టి సంభవిస్తున్నట్లు శాస్త్రవేత్తల అంచనా. దాంతో రుతుకాలమంతా విడతలు విడత లుగా కురవాల్సిన వర్షపాతం ఒకే రోజు పడడం వల్ల నీటి లభ్యత, భూగర్భ జల నిల్వలు అడుగంటిపోతున్నాయి. 2017లో రోజులో 24.4 సెం.మీ.లకు మించిన వర్షం పడే 20కు పైగా అతివృష్టి సంఘటనలు సంభవించాయి. అదే సమయంలో రోజుకు 12.4–24.4 సెం.మీ మధ్య వాన పడే 100 దాకా భారీవర్షం కురిసిన సంఘటనలు సంభవించాయి. ఏడాది వర్షపాతం ఒక్కసారిగా కురవడంతో అది వ్యవసాయానికి ఏ రకంగానూ ఉపకరించదు.

దేశ వాతావరణ పరిస్థితులలో వచ్చిన ఈ మార్పును గుర్తించవలసిన తరుణమిది. ఏకకాలంలో అతి వృష్టి, అనావృష్టిని ఎదొర్కనవలసి వచ్చింది. అయితే ఒకవైపు వరదలు, మరోవైపు కరవు పరిస్థితులతో మనం వ్యవహరించవలసి ఉంటుంది. రెండు విరుద్ధ వైపరీత్యాలు ఏక కాలంలో సంభవిస్తున్న ఒక వైచిత్రి ఇది కనపడుతుంది. అయితే విశేషమేమంటే, ఈ రెండు భిన్న వైపరీత్యాలు ఒకదానికొకటి సహకరిస్తాయి. ఈ వైపరీత్యాలు ఇలా ఎందుకు సంభవిస్తున్నాయో మనకు తెలుసు. వాతావరణ మార్పు క్రమానుగతంగా మారుతున్న కొద్దీ అతివృష్టి, అనావృష్టి అంతే తీవ్రంగా విజృంభిస్తాయి. మరింత తీవ్రతరమవుతాయి. మరింత విధ్వంసకరంగా తయార వుతాయి. అస్సాంలో బ్రహ్మపుత్ర వరదలను అరికట్టేందుకు ఆ నదిలో పేరుడు తవ్వితీయాలని ప్రభుత్వం అనాలోచిత ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ ప్రణాళిక ఖర్చుతో కూడుకున్నదే కాకుండా, నిరర్థకమైనది కూడా. బీహార్ ప్రభు త్వం నదుల చెలయల కట్టలను కాంక్రీట్‌తో నిర్మాంచాలని యోచిస్తోంది. బీహార్ దుఃఖదాయిని కోసి నదిని తల్లిగా, బ్రహ్మరాక్షసిగా ప్రజలు పిలుస్తారు. హిమాలయాల నుంచి దిగి వస్తున్న ఈ నది పెద్ద ఎత్తున బురదను మోసుకొస్తుంది. దీనికితోడు తరచూ తన ప్రవాహమార్గాన్ని మారుస్తుంటుంది. ఈ నది కట్టలను కాంక్రీటుతో నిర్మించినా వరదల్ని నివారించలేకపోయారు. కోసి నది మోసుకొచ్చే బురద కారణంగా కాంక్రీట్ కట్టలు దాటుకుని నీళ్లు మైదానాలపైకి పొర్లి రావడం తరచూ వరదలు సంభవిస్తుంటాయి. ఈ ఏడాది బీహార్‌లో సంభవించిన వరదల కారణంగా 250 మందికి పైగా మరణించారు. కోటి మందికి పైగా నిర్వాసితులయ్యారు. వరద నీటిని ఇతరత్రా కాలువల్లోకి మళ్లించే విధమైన వరద నీటి నియంత్రణ వ్యవస్థలను నిర్మించవలసి ఉంటుంది. నదులను జలాశయాలు, చెరువులు, కుంటలతో అనుసంధానించడం వల్ల వరదలు ఉపశమిస్తాయి. సమీప ప్రాంతమంతా వరద నీటిని పంపిణీ చేయగలం. దాంతో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. దాంతో వర్షపాతం తక్కువగా ఉన్న రోజుల్లో సాగునీటికి, తాగునీటికి కరువు ఏర్పడదు. చేపలు, వృక్ష సంబంధిత ఆహారం అధికంగా లభ్యమయ్యే చిత్తడి నేలలు కరవు సందర్భం లోనూ ఆహారాన్ని అందించగలవు. రుతుపవనాల స్వభావానికి అనుగుణంగా సరైన నీటి యాజమాన్యంతో వరదల్ని, కరువు కాటకాలను సమర్థంగా ఎదుర్కోగలం.

వాయు కాలుష్య పరిష్కార అన్వేషణ



నియాంగిరిలో సమాంతర సమరభేరి



ఒడిశాలోని నియాంగిరి పర్వత ప్రాంతంలో అల్యూమినియం ఖనిజ మైనింగ్‌కు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించడం ద్వారా 'గ్రీన్ నోబెల్'పురస్కారం అందుకున్న ప్రఫుల్ల సమాంతర!

'గ్రీన్ నోబెల్'గా ప్రఖ్యాతిగాంచిన 'గోల్డ్‌మన్ పర్యావరణ పురస్కారం' ఇప్పటివరకు భారత్‌కు నాలుగుసార్లు లభించింది. ప్రఫుల్ల సమాంతర పేరును 2017 ఏప్రిల్ 24న ప్రకటించడంతో ఐదో భారతీయుడిగా ఈ జాబితాలో భారత్‌కు స్థానం లభించినట్లయింది. డోంగ్రియా కోంధ్ భూ హక్కుల పోరాటంలో ఆయన 12 ఏళ్ల పాటు విశేష కృషిచేశారు. ఆ భూముల్లో అల్యూమినియం ఖనిజ మైనింగ్‌ను అడ్డుకోవడం ద్వారా నియాంగిరి పర్వతశ్రేణిని సంరక్షించగలిగారు. నియాంగిరి పర్వతప్రాంతం ఒడిశాలో ఉంది. ఈ ప్రాంత ం అద్భుతమైన జీవవైవిధ్యం కలిగిన ప్రదేశం. ఇక్కడ అల్యూమినియం మైనింగ్‌ను వేదాంత కంపెనీ నిర్మించ తలపెట్టింది. చిక్కని అటవీ ప్రాంతంలో ఈ మైనింగ్ ఫలితంగా అరుదైన బెంగాల్ టైగర్ జాతి నశించే ప్రమాదం ఉంది. ఈ ప్రాంతం ఏనుగుల విశ్రాంతి ప్రదేశంగా అలరారుతోంది. ఈ ప్రాంతంలో దాదాపు ఎనిమిది వేలమంది గిరిజనులు జీవిస్తుండడం గమనార్హం. ఆయన ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికరమైన అంశాలను వెల్లడించారు.

- **ప్ర:** డోంగ్రియా కోంధ్ భూములపై పోరాటానికి, నియాంగిరి కొండల పరిరక్షణకు మిమ్మల్ని ప్రేరేపించిన అంశాలేమిటి ?
- **జ:** నియాంగిరి గిరిజనులకు ప్రాణాధారం, ముఖ్యంగా డంగారియా వర్గానికి! నియాంగిరితో పాటు దాని దాపునే ఉన్న కర్లాపత్ ఎంతో ప్రధానమైనవి. తూర్పు కనుమల్లో ఈ ప్రాంతం ప్రధానమైన పర్యావరణ సమతుల్యత కలిగిన ప్రదేశం. వంశధార, నాగావళి నదులకు ఇది జన్మస్థానం. ఈ రెండు నదులు ఆంధ్రప్రదేశ్, ఒడిశాలకు ఎంతో ముఖ్యమైనవి. నదులకు ప్రధాన వనరులుగా ఉన్న మరో 36 జలపాతాలున్నాయి. జీవవైవిధ్యం, వృక్షసంపదలతో గిరిజనులకు జీవనాధారమైన అటవీసంపదకు ఈ ప్రాంతం జీవగర్ర. ఈ పర్వతశ్రేణిలో బాక్సైట్ ఖనిజం నిల్వలు అధికం. నీటిని బాక్సైట్ ఖనిజం ఎక్కువగా గ్రహిస్తుంది బాక్సైట్ ఆత్మలాంటిది. దాన్ని గనక వెలికితీయడం మొదలుపెడితే ఇక ఆ ప్రాంతంలో నీటి వనరులు, జలపాతాలు అదృశ్యమైపోతాయి.
- **ప్ర:** 12 ఏళ్ల పోరాటంలో ఎదురైన సవాళ్లేమిటి? మిమ్మల్ని పోరాట పంథా నుంచి మళ్లించని అంశాలేమిటి?
- **జ:** నేను ప్రజల దగ్గరకు వెళ్లడం, వ్యాసాలు రాయడం ప్రారంభించిన తొలిదినాల్లో కార్పొరేట్ న్యాయవాదులు నాకు పూర్తి వ్యతిరేకులుగా ఉన్నారు. నియాంగిరికి వెళ్లే రోడ్డులో నా ప్రయాణాన్ని కంపెనీకి చెందిన గూండాలు అడ్డుకున్నారు. స్థానిక ఉద్యమకారులపై దాడులు చేశారు. మూడుసార్లు నాపై దాడులు జరిగాయి. అయితే ప్రజలే నాకు భద్రత కల్పించేవారు. కానీ, ప్రసిద్ధ న్యాయవాదులు సంజయ్ పారిఖ్, ప్రశాంత్ భూషణ్, రిత్విక్ దుత్తా, రాజ్ పుంజవాణి, రాహుల్ చౌదరి తదితరులు ఈ కేసులో ఫీజు తీసుకోకుండా పనిచేశారు.
- **ప్ర:** ఈ విజయం మీ జీవితాన్ని ఏమైనా మార్పులకు కారణమవుతుందా?
- **జ:** రాజ్యాన్ని అణచివేసేందుకు కార్పొరేట్ సంస్థల ప్రయత్నాలపై పోరాటానికి నేను కట్టుబడి ఉన్నాను. మాతృభూమిని రక్షించమని నా అంతరాత్మ చెబుతోంది. ఈ అంశంలో ఎలాంటి రాజీలేని పోరాటం చేస్తాను. ప్రకృతి వనరులను హరించే యత్నాలకు వ్యతిరేకంగా ఈ పురస్కారం అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చింది. ఇది నా ఒక్కడి విజయం కాదు, అందరిదీ! పర్యావరణ పరిరక్షణ కోసమే పురస్కారం ద్వారా లభించే నగదును వినియోగిస్తాం. ఇప్పటిలాగానే నా ప్రయాణం కొనసాగుతుంది.
- **ప్ర:** సమీప కాలంలో మరేదైనా అంశంపై పోరాటానికి సిద్ధపడుతున్నారా? దేశంలో పర్యావరణంపై మీ అభిప్రాయం, ప్రణాళికలు ఏమిటి?
- **జ:** ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే, ఎన్నో థర్మల్ కేంద్రాల నిర్మాణాలు, పెద్దపెద్ద డ్యాంల నిర్మాణాల ఆలోచన చూస్తుంటే ఎంతో మందిని ఖాళీచేయించడం, అడవుల విధ్వంసం, నదులకు జీవన్మరణ సమస్య తలెత్తే ప్రమాదముంది. అందువల్ల జాతీయస్థాయిలో ప్రజా భాగస్వామ్యంతో ఉద్యమాలు చేయాలని మా సంస్థ లోక్ శక్తి అభియాన్ నిర్ణయించింది.

– మహి డెస్క్

పంచాయతీలపై కేబినెట్ సబ్-కమిటీ!

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులుగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కేటీఆర్ (గతంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రులుగా పని చేశారు), ఇంద్రకరణ్‌రెడ్డి (గతంలో జెడ్పీ చైర్మనగా పని చేశారు), ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు, హరీశ్‌రావు నియమితులయ్యారు. పంచాయతీరాజ్ వ్యవస్థపై అవగాహన, అనుభవం కలిగిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంస్థల ప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకుని కొత్త చట్టానికి రూప కల్పన చేయాలని గతంలో సీఎం కేసీఆర్ సూచించిన విషయం తెలిసిందే. కొత్తగా ఏర్పడిన తెలంగాణలో ఇప్పటికే పలు పరిపాలనా సంస్కరణలు తీసుకువచ్చామని, కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేసుకున్నామని సీఎం కేసీఆర్ పలుసార్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో కొత్త గ్రామ పంచాయతీలు కూడా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. ఈ క్రమంలో తాజాగా పంచాయతీరాజ్ చట్టంలో అవసరమైన మార్పులు సూచించేందుకు కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. కాగా, ఈ కమిటీ సహకార సంస్థల ఎన్నికల ప్రక్రియ, పద్ధతులపైనా సిఫారసులు చేయనుంది.



మెడికోలు చలో చైనా!

(మొదటిపేజీ తరువాయి)

చూస్తున్నారు. అందులోనూ వైద్యవిద్యకు చైనా గమ్యంగా మారింది. భారతదేశంలో వైద్యవిద్య ఖరీదైన వ్యవహారం కావడం, నీట్ తదితర ప్రవేశ పరీక్షల గందరగోళం మధ్య విద్యార్థులకు చైనా ఒయాసిస్సులా కన బడుతోంది. తక్కువ ఖర్చుతో వైద్య విద్యను పూర్తిచేసే అవకాశం ఉం డడం, అక్కడ చేసిన డిగ్రీకి మన భారతీయ వైద్య మండలి గుర్తింపు ఉండ డం, ఆంగ్లంలో విద్యాబోధన కూడా దీనికి ఊతమిస్తున్నాయి. దీంతో వైద్య విద్యను అభ్యసించాలనుకునే సామాన్య విద్యార్థులు చైనాకు ఎగిరిపోతు న్నారు. గతంలో లండన్ సహా బ్రిటన్‌లోని ఇతర నగరాలకు వెళ్లిన విద్యా ర్థులు కూడా ప్రస్తుత పరిస్థితికి అనుకూలంగా ఉన్న చైనాకు వెళ్లడమే బెట రని చెబుతున్నారు. దీంతో భారతీయ విద్యార్థులను ఆకర్షిం చడంలో బ్రిటన్ వెనకబడింది.. అదేసమయంలో చైనా ముందడుగు వేసింది. ఇటీవ లి(2016) గణాంకాల ప్రకారం.. యూకేలో చదువుతున్న భారతీయ విద్యా ర్థుల సంఖ్య 18,015 కాగా, చైనాలోని భారతీయ వి ద్యార్థుల సంఖ్య 18,171. అంతకుముందు ఏడాదిలో ఈ సంఖ్య చైనాలో 13,500 మాత్ర మే! ఒక్క భారతీయ విద్యార్థులకు మాత్రమే కాదు.. అంతర్జాతీయంగా వివిధ దేశాల విద్యార్థులకు చైనా గమ్యంగా మారింది. నిన్న మొన్నటి వరకు కేవలం వైద్య విద్య కోసమే చైనా వైపు చూసిన విద్యార్థులు ప్రస్తుతం ఇంజనీరింగ్ కోసం కూడా చైనా విమానం ఎక్కుతున్నారు.

ఖర్చు తక్కువ..

భారత్‌తో పోల్చుకుంటే చైనాలో వైద్యవిద్యకయ్యే వ్యయం తక్కువేనని విదేశీ విద్య నిపుణురాలు ప్రతిభ జైన్ చెబుతున్నారు. చైనా వర్సిటీలలో వైద్యవిద్యకయ్యే ట్యూషన్ ఫీజు ఏడాదికి సగటున 2 వేల నుంచి 3 వేల డాలర్లు ఉంటుందన్నారు. దీనికి అదనంగా మరో వెయ్యి డాలర్లు తిండి, వసతి సౌకర్యాల కోసం ఖర్చవుతుందని వివరించారు. భారత్‌లో మెడిసిన్ చదవాలంటే నీట్‌లో అర్హత సాధించడం తప్పనిసరి! ఈ పరీక్షలో పాస్ కానివారికి చైనా ప్రత్యామ్నాయంగా మారింది. రష్యాలోనూ వైద్య విద్య పూర్తిచేసే అవకాశం ఉన్నా.. భాషా సమస్య విద్యార్థులను బాధిస్తోంది. పైగా రష్యాలో మెడిసిన్ పూర్తిచేసి వచ్చిన మెడికోలకు ఎంసీఐ అర్హత పరీక్ష కొరుకుడు పడడంలేదు. అదే చైనా విద్యార్థులకు ఈ సమస్య లేదని ప్రతిభ తెలిపారు. వారు ఈ పరీక్షను తేలిగ్గా పూర్తిచేయగలుగుతున్నారని, ఆంగ్లంలో బోధించే అవకాశం ఉండడం భారతీయ విద్యార్థులకు అనుకూలంగా మారిందని పేర్కొన్నారు.



యాసంగి యాతన..!

(మొదటిపేజీ తరువాయి)

రూ.60 వేలు అవసరమవుతాయి. ఈ తరుణంలో బ్యాంకుల చుట్టూ రుణం కోసం ప్రదక్షిణలు చేస్తున్నా డు. అధికారులు సరైన కారణం చెప్పకుండా.. రేపు మాపు అంటూ తిప్పుతున్నారు. నాట్లు వేయడం అదును దాటితే దిగుబడి తగ్గుతుంది కాబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో వడ్డీ వ్యాపారిని ఆశ్రయించాడు. పెట్టుబడి కోసం 3 రూపాయల వడ్డీకి అప్పు తెచ్చాడు. ఇది ఒక్క రామ్యానాయక్ పరిస్థితే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి రైతులు ఎందరో బ్యాంకు రుణాల కోసం పడిగాపులు కాస్తున్నారు. రైతులకు సకాలంలో రుణాలు అందజేయాలని ప్రభుత్వం ముందే చెప్పినా.. బ్యాంకులు మాత్రం రైతులకు రుణాలివ్వడా నికి ముందుకు రావట్లేదు.

సాగని సాగు

పండించిన పంట అమ్మినా సొమ్ము చేతికి రాక.. యాసంగి సాగుకు పెట్టుబడి లేక రైతులు నానా ఇబ్బందుల పాలవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా యాసంగి సీజన్ మొదలై.. ఇప్పటికే మూడు నెలలు దాటింది. ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ 15.19 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడతాయని అంచనా వేసింది. కానీ, ఈ మూడు నెలల్లో అందులో 17 శాతం మాత్రమే నాట్లు పడ్డాయి. అలాగే సాధారణ పంటల విస్తీర్ణం 31.55 లక్షల ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 10.37 లక్షల ఎకరాల్లో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి.

రుణ లక్ష్యం రూ.15,900 కోట్లు

యాసంగి సీజన్‌లో పంటల సాగుకు రైతులకు బ్యాంకుల ద్వారా రూ. 15,900 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ డిసెంబర్ చివరి నాటికి రైతులకు అందింది కేవలం రూ.4వేల కోట్లే. అంటే లక్ష్యంలో నాలుగోవంతు మాత్రమే పంట రుణాలు అందాయి. వాస్తవానికి సీఎం కేసీఆర్ తొలి నుంచీ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అందులో భాగంగానే యాసంగి సీజన్ ప్రారంభానికి ముందే పొలం పనుల కోసం రుణాలు ఇవ్వాలని బ్యాంకులకు స్పష్టం చేశారు. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. రుణం కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఏవో కుంటిసాకులు చెబుతూ రేపు మాపని తిప్పుకొంటున్నారు. ఓ వైపు కోసిన రబీ ధాన్యం మార్కెట్‌లో ఉంది. మరోవైపు వ్యవసాయ క్షేత్రంలో నారుమడులను సిద్ధం చేసుకోవాలి. ఇలాంటి సమయంలో ప్రతి రోజూ బ్యాంకుల చుట్టూ తిరగడం రైతులకు తలకు మించిన భారమే. ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని రైతులకు త్వరితగతిన రుణాలందేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.



పంట రుణాలపై బ్యాంకుల విముఖత

రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు విముఖత చూపుతున్నాయి. ఎందుకంటే.. రూ.లక్ష లోపు రుణానికి రైతుల వద్ద నుంచి వడ్డీ వసూలు చేయకూడదనే నిబంధన ఉంది. ఆ వడ్డీని ప్రభుత్వం ఒకేసారి విడుదల చేస్తుంది. కానీ, ప్రభుత్వం నుంచి బ్యాంకులకు వివిధ రూపాల్లో రావాల్సిన మొత్తం దాదాపు రూ.321 కోట్లు పేరుకుపోయింది. ఈ బకాయిని క్లియర్ చేయకపోవడం రైతులను కష్టపెడుతోంది. దీనికితోడు రుణ మాఫీ పథకంలో భాగంగా రైతులు తీసుకున్న రుణాలను రాష్ట్ర ప్రభుత్వం నాలుగు దఫాలుగా.. దాదాపు రెండుమూడేళ్ల కాలంలో బ్యాంకులకు అందించింది. అప్పటికే రైతులకు రుణం ఇచ్చి లావాదేవీల విషయంలో లోటుతో ఉన్న బ్యాంకులు.. తిరిగి కొత్తగా రుణం ఇవ్వడాన్ని భారంగా భావిస్తున్నాయి. రైతులకు రుణంగా ఇవ్వాల్సిన మొత్తాన్ని ఇతర లావాదేవీలకు వాడితే అంతకు రెట్టింపు లాభాలు వస్తాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల మీద కూడా లాభదాయకత విషయంలో ఒత్తిళ్లు ఉన్నాయి. జిల్లా, మండల, గ్రామీణ స్థాయిల్లోని బ్యాంకులకు వార్షిక ఆడిటింగ్ సమయంలో రైతు రుణాలు పెద్ద తలనొప్పిగా మారుతున్నాయి. ఇతర శాఖల కంటే రైతు రుణాలు ఇచ్చిన శాఖలు వెనుకంజలో ఉంటున్నాయి. ఇది ఆ శాఖలోని ఉద్యోగుల పదోన్నతులపై కూడా ప్రభావం చూపుతుంది. అందుకే తాము రైతులకు రుణాలు ఇచ్చేందుకు వెనుకాడుతున్నామని ఓ ప్రధాన బ్యాంకుకు చెందిన జనరల్ మేనేజర్ చెప్పుకొచ్చారు.

రైతుల ఆగ్రహం

మరికొందరు అధికారులైతే రుణాల వ్యవహారాలను బుక్ అడ్జస్ట్‌మెంట్లకే పరిమితం చేస్తున్నారు. ప్రభుత్వం దఫాలుగా రుణాన్ని రీయింబర్స్ చేయడంతో పాత బకాయిలో కొంత మొత్తాన్ని మినహాయించుకుని.. తిరిగి రైతులకు కొత్తగా రుణాలిస్తున్నారు. దీంతో తాత్కాలికంగా రైతులపైనే వడ్డీ భారం పడుతోంది. ఎక్కువ శాతం జనవరి నెలలోనే నాట్లు పడతాయి. ఇప్పటివరకు 21 శాతం నాట్లే పడ్డాయి. మిగిలిన రైతులు నాట్లు వేసుకునే లోపైనా.. బ్యాంకుల నుంచి రుణాలు అందేలా చూడాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

తాగుబోతు డ్రైవింగ్.. రెండు ప్రాణాలు బలి

(మొదటిపేజీ తరువాయి)



పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మస్తానీ అనే యువతి అక్కడికక్కడే మరణించగా, అదే జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన అనూషా రెడ్డి అనే మరో యువతి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. సుమారు 150 మందితో కూడిన కిట్టీ పార్టీ బృందంలోకి కొత్తగా చేరిన అనూషను హైదరాబాద్ పిలిచి, సంబరాలు చేసుకుందామని మస్తానీ, ఆమె స్నేహితురాళ్లు భావించారు. వాళ్లు పిలవగానే ఎంతో సంతోషంగా అనూష కూడా తాడేపల్లిగూడెం నుంచి బయల్దేరి హైదరాబాద్‌కు వచ్చారు. రాత్రి సమయం కావడంతో ఆమెను పికప్ చేసుకుని ఇంటికి తీసుకెళ్లడానికి మస్తానీ.. తన మరో స్నేహితురాలు ప్రియను తోడు తీసుకుని స్కూటీపై వెళ్లింది. అనూషను కూడా ఎక్కించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా.. అప్పటికే బాగా మద్యం మత్తులో ఉన్న విష్ణువర్ధన్‌రెడ్డి.. వీళ్ల వాహనాన్ని తన 'టీఎస్ 09 ఈవీ 7707'నెంబరు కారుతో జూబ్లీహిల్స్ రోడ్‌నెం. 10 సమీపంలో ఢీకొట్టాడు. దాంతో మస్తానీ అక్కడికక్కడే మరణించగా, అనూషను ఆస్పత్రిలో వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రియ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే విష్ణు అక్కడినుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా.. కారు డివైడర్‌ను ఢీకొని ముందు భాగం అంతా తుక్కు తుక్కు అయిపోయి ఆగిపోయింది. దాంతో అతడు పోలీసులకు పట్టుబడ్డాడు. ఆ సమయంలో అతడికి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష చేయగా.. ఏకంగా 200 పాయింట్లు నమోదైంది.

కొండాపూర్‌లో తాగి...

హిమాయత్‌నగర్ ప్రాంతంలో బ్రైట్ స్పార్క్స్ అనే ప్లేస్కూలు నడుపుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి.. ఇంతకుముందు దుబాయ్‌లో ఉండేవాడు. అక్కడినుంచి కొంతకాలం క్రితం హైదరాబాద్ వచ్చాడు. అతడి భార్య ప్రముఖ వైద్యురాలని సమాచారం. కొండాపూర్ ప్రాంతంలో శనివారం రాత్రి బాగా మద్యం తాగిన విష్ణు.. రాత్రి ఒంటిగంట తర్వాత అయితే పోలీసుల డ్రంకెన్ డ్రైవ్ చెకింగు ఉండదని భావించి అప్పుడు కారు తీసుకుని బయల్దేరాడు. ప్రమాదంలో రెండు నిండు ప్రాణాలను బలిగొన్నాడు. నిందితుడు తమ అదుపులోనే ఉన్నాడని, అతడికి కఠిన శిక్ష పడేలా చూస్తామని పోలీసు అధికారులు తెలిపారు. విష్ణువర్ధన్‌ను రిమాండుకు తరలించారు.

మద్యం మత్తులో అమ్మాయిలు

పోలీసులు శనివారం రాత్రి నగరంలోని వేరే ప్రాంతంలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తుండగా.. పూర్తిగా తాగి మద్యం మత్తులో ఉన్న మరికొందరు అమ్మాయిలు పట్టుబడ్డారు. వాళ్లు తమ కారు డోర్లు కూడా తీయకుండా పోలీసులను నానా ఇబ్బంది పెట్టారు. వెనక మరో రెండు కార్లలో మరికొందరు అమ్మాయిలు రాగా.. వారూ పూర్తిగా తాగేసి ఉండి నానా హంగామా సృష్టించారు.



సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి గుట్టపై ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. దాంతో భక్తులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అయితే ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని తెలిసింది.

'జన్మభూమి'ని మరచిన బాబు

- **సొంత ఊరిని గాలికొదిలాడు.. వైఎస్ జగన్**

చిత్తూరు, జనవరి 7: 'సొంత ఊరిని పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు రాజధానిలో సింగపూర్ కడతాడట. గతంలో తొమ్మిదేళ్లు, ఇప్పుడు నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి పదవిలో ఉన్నా సొంత నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేశారు. జన్మభూమి అభివృద్ధిని గాలికొదిలిన ఏ దేశం వెళ్లొస్తే.. ఆ దేశంలా అమరావతి నిర్మాణం చేస్తాననంటారు. ప్రజలకు వెన్నుపోటు పొడవడం ఆయన నైజం' అంటూ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ సీఎం చంద్రబాబుపై ధ్వజమెత్తారు. ప్రజాసంకల్పయాత్ర 55వ రోజు ఆదివారం ఉదయం చిత్తూరు జిల్లా పూడిబట్లబయలు గ్రామంలో ప్రారంభించారు. గుండ్లగుట్లపల్లి, గొట్టాల క్రాస్ రోడ్డు, గుండ్లపల్లి, సవటపల్లి, పొలకల సంతగేట్ మీదుగా మొరవపాటూలలరులో ఆదివారం సాయంత్రం యాత్ర ముగించారు. మార్గ మధ్యంలో దామల చెరువు గ్రామంలో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన ఆయన మాట్లడుతూ.. జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్రమంతా మాఫియా ముఠాలను ఏర్పాటుచేసి చంద్రబాబు ప్రజాధనాన్ని దోచుకుంటోన్నారని ఆరోపించారు. ''సొంత ఊరిని మనందరం కన్నతల్లిలా భావిస్తాం. సీఎం చంద్రబాబు సొంత ఊరు నారావారిపల్లె, ఆయన చదువుకున్న శేషాపురం గ్రామాలను ఆయన పట్టించుకున్నది లేదు. ఆయన చదువుకున్న స్కూలు ఇప్పుడు శిథిలావస్థలో ఉంది. గతంలో 9ఏళ్లు, ఇప్పుడు నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి పదవిలో ఉన్న ఆయన.. సొంత నియోజకవర్గాన్ని కూడా పట్టించుకోలేదు. చంద్రగిరిలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం మహానేత వైఎస్సార్ ఇచ్చిన జీవోను చంద్రబాబు పక్కనపెట్టేశారు. ఇవన్నీ ఇలా ఉంటే చంద్రబాబు ఏ దేశానికి పోతే ఆ దేశంలా ఏపీని మార్చేస్తానని ప్రకటిస్తారు.

గుడిలో 'తంత్రం'!

(మొదటిపేజీ తరువాయి)



ఆలవాలమై, ఆధ్యాత్మిక శోభతో అలరారే ఆలయాలు... అలసిన మనసుల్లో అశాంతిని దూరంచేసి మనశ్శాంతినిస్తాయన్నది లోకవిదితమైన సత్యం. తెలుగు రాష్ట్రాల్లో అటువంటి కొన్ని ప్రసిద్ధ, పవిత్ర దేవాలయాలను కొందరు తమ స్వార్థంతో అపవిత్రం చేసేస్తున్నారు. కొన్నిచోట్ల పూజారులు, మరికొన్ని చోట్ల అధికారులు, ఇంకొన్ని చోట్ల రాజకీయ నాయకులు.. ఇలా 'గుడి వెనుక' వ్యవహారాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అనేక ఆలయాల చుట్టూ సవాలక్ష వివాదాలు ముసురుకుంటున్నాయి. కానీ, ''ఏ అక్రమంలో.. ఎవరి ప్రమేయం... ఎంతవరకూ ఉన్నదీ'' సంపూర్ణ విచారణ తర్వాత కూడా స్పష్టంగా వెల్లడైన దాఖలాలు అతి స్వల్పమే. ఇదంతా చూస్తున్న జనం... దేవుడిపై నమ్మకంతో తాము ఆలయానికి వస్తుంటే.. సాక్షాత్తూ దేవతామూర్తుల సమక్షాన బాధ్యతలు నిర్వర్తించేవారు ఏకంగా దైవాన్నే అమ్మేసే స్థాయికి దిగజారుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానాల మడిమాన్యాల ఆక్రమణ, ఆలయాల్లో అర్చక-సిబ్బంది నియామకాలుసహా అనేక వ్యవహారాల్లో స్వాహా స్వాముల హస్తలాఘవం ఇందులో ఒక కోణం. ఆలయ నిధుల 'కైంకర్యం', పంచలోహ విగ్రహాలు-దేవతల ఆభరణాల చోరీ, హుండీల అపహరణ తదితరాలు మరో కోణం. ఇవన్నీ సకల ప్రజానీకానికి ఎరుకే. అయితే, ఆలయాల్లో తాంత్రిక పూజలు తాజాగా వెలుగుచూసిన మూడో కోణంగా దుమారం రేగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని పలు ఆలయాల్లో ఇటీవల గర్భగుడిలోకి సైతం బయటి వ్యక్తులు ప్రవేశించి తాంత్రిక పూజలు చేశారన్న వార్తలు ఒక్కసారిగా కలకలం రేపాయి. శ్రీకాళహస్తిలోని కాలభైరవ ఆలయంలో ఇలాంటి పూజలు నిర్వహించినట్లు గుప్పుమనడంతో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) భ్రమరాంబ అక్కడి సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేశారు. అలాగే విజయవాడలోని సుప్రసిద్ధ కనకదుర్గ ఆలయంలో సైతం క్షుద్రపూజల వ్యవహారం వెలుగులోకొచ్చింది. అలాంటిదేమీ లేదని తొలుత బుకాయించే ప్రయత్నాలు సాగాయి. కానీ, గర్భగుడిలో బయటి వ్యక్తులు ప్రవేశించినట్లు సీసీ టీవీ కెమెరాలలో రికార్డవడంతో ఈ ఉదంతంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈలోగా వివాదం చినికిచినికి గాలివానగా మారుతుండటంతో పాలనలో వైఫల్యం పేరిట ఆలయ ఈవో సూర్యకుమారిపై బదిలీ వేటు వేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అలాగే ఇక్కడ ప్రసాదాలు, విరాళాల కౌంటర్లలో నిధులు దుర్వినియోగమైనట్లు కూడా ఆరోపణలొచ్చాయి. క్షుద్రపూజల వ్యవహారంలో ఆలయ ప్రధానార్చకుడు బద్రీనాథ్‌తోపాటు మరికొందరు పూజారులపైనా ఆరోపణలు వచ్చాయి. దీని వెనుక కొందరు రాజకీయ నాయకుల హస్తం ఉన్నట్లు వినిపించినా.. చివరకు ఈవో సూర్యకుమారిపై బదిలీ వేటు పడింది. ఉమ్మడి రాష్ట్రంలో వరుసగా తొమ్మిదేళ్లపాటు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏకంగా కనకదుర్గమ్మ కిరీటం కాజేసి, నకిలీ కిరీటం పెట్టిన ఉదంతాన్ని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇప్పుడు తాంత్రిక పూజలు చేయడం అంతకంటే పెద్ద అపచారమని, ఇదంతా ప్రభుత్వ అనుమతి లేకుండానే జరిగిందంటే నమ్మలేకుండా ఉన్నామని వ్యాఖ్యానించారు. కాగా, ఆలయ సొత్తు చోరుడుగా పేరుబడిన ప్రకాష్ కుమార్ సాహూ 1998లో విజయవాడ కనకదుర్గమ్మ బంగారు కిరీటం అపహరించాడు. అయితే, దీని స్థానంలో నకిలీ కిరీటం ఉంచినట్లు ఆ తర్వాత బయటపడటంతో ఈ ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ తర్వాత పట్టుబడిన సాహూ జైలుశిక్ష అనుభవించాడు. కానీ, శిక్షానంతరం విడుదలయ్యాక విజయవాడ సమీపంలోని ప్రసాదంపాడు సాయిబాబా గుడిలో వెండి ఆభరణాలను అపహరించినట్లు అతడిపై కేసు నమోదైంది. అంతేకాదు... ఆలయ సొత్తుల అపహరణ, అరెస్టు-విడుదల అతడికి దాదాపు నిత్యకృత్యమైపోయాయి. తెలంగాణలోనూ కొన్ని వివాదాస్పద, అవినీతి వ్యవహారాలు వెలుగుచూశాయి. భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో రెండేళ్ల కిందట సీతమ్మ తల్లి తాళిబొట్టు మాయమైంది. దీనిపై పలు తర్జనభర్జనల తర్వాత విచారణ చేపట్టడంతో తాళిబొట్టు తిరిగి యథాస్థానంలోకి వచ్చింది. ఆలయంలో అర్చకుల మధ్య విభేదాలే దీనికి కారణమని దర్యాప్తులో తేలింది. వరంగల్ జిల్లాలో విగ్రహాలు మాయమయ్యాయని వార్తలొచ్చాయి. ఇలా చెబుతూపోతే రెండు రాష్ట్రాల్లో చోటు చేసుకున్న ఉదంతాలతో ఈ జాబితా కొండవీటి చాంతాడే అవుతుంది. మరోవైపు ఆలయాల్లో అవినీతితోపాటు అర్చక, అధికార, సిబ్బంది స్థాయి విభేదాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రపంచ ప్రసిద్ధ తిరుమల క్షేత్రంసహా ఏ ఆలయమూ ఇందుకు మినహాయింపు కాబోదు. అవినీతికి ఆనవాళ్లుగా నిలిచే ఇటీవలి, మునుపటి ఉదంతాలు కొన్నిటిని పరిశీలిస్తే... తెలంగాణలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ సూపరింటెండెంట్ రాజేందర్ అక్రమార్జనపై 2017లో ఆరోపణలు వచ్చాయి. దీంతో డిసెంబర్ 21న ఏసీబీ అధికారులు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌లలోని ఆయన ఇల్లుసహా బంధువుల నివాసాల్లో నిశితంగా తనిఖీ చేశారు. ఆయన రూ.కోట్ల విలువైన ఆస్తులు కూడబెట్టినట్లు ఈ సందర్భంగా వారు గుర్తించారు. బాసరలో సరస్వతీ దేవి ఆలయంలో అవినీతి వ్యవహారం 2017 ఆగస్టు 29న బయటపడింది. అమ్మవారి విగ్రహ తరలింపులో ప్రధాన అర్చకుడు సంజీవ్‌కుమార్‌పై ఆరోపణలు రాగా అధికారులు ఆయన బీరువాలో తనిఖీచేశారు. ఈ సోదాలో 434 గ్రాముల వెండి బిస్కెట్లు, విలువైన కానుకలతోపాటు బంగారు ముక్కుపుడక లభ్యమయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ 2017 డిసెంబరులో విజయవాడ దుర్గగుడి అధికారుల అవినీతి బట్టబయలైంది. అభివృద్ధి పాటపాడుతూ కొండపై కొత్త నిర్మాణాలు... ఉన్నవాటి తొలగింపు పేరిట కాకిలెక్కలతో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తాయి. చివరకు అమ్మవారి ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.40 కోట్ల మేర కరిగిపోయినట్లు కూడా ఆరోపణలు వినిపించాయి. తిరుమల ఆలయంలో పలు సందర్భాల్లో అవినీతి వ్యవహారాలు వెలుగుచూశాయి. అటువంటివాటిలో 2009నాటి బహుళ కోట్ల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కుంభకోణం ఒకటి. దీనిపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణ నిర్వహించి అక్రమాల నిగ్గుతేల్చింది. కానీ, ఎవరిపైనా... ఎలాంటి చర్యలూ లేకపోవడమే విచిత్రం!

సచిన్ కుమార్తెకు వేదింపులు

- కిడ్నాప్ చేసి పెళ్లి చేసుకుంటానని బెదిరింపు
- పోలీసులకు ఫిర్యాదు.. నిందితుడి అరెస్ట్
- మానసిక స్థితి సరిలేదన్న బంధువులు

ముంబై, జనవరి 7: సామాన్యుల నుంచి ప్రముఖుల వరకూ, పిల్లల నుంచి వృద్ధుల వరకూ వేదింపులు తప్పడం లేదు. బాధితుల జాబితాలో ప్రఖ్యాత మాజీ క్రికెటర్ సచిన్ టెండ్కూలర్ కుమార్తె సారా చేరారు. ఓ దుండగుడు సచిన్ ఇంటికి డిసెంబరు నుంచి 20 సార్లు ఫోన్ చేసి ప్రేమ, పెళ్లి పేరుతో సారాను వేదించాడు. తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని బెదిరించాడు. కిడ్నాప్ చేసి పెళ్లి చేసుకుంటానని బెదిరిస్తూ అనుచితంగా మాట్లాడాడు. సచిన్ మేనేజర్ ఫిర్యాదు మేరకు బాంద్రా పోలీసులు.. కేసు నమోదు చేసి విచారించారు. నిందితుడిని పశ్చిమబెంగాల్‌లోని మిడ్నాపూర్ జిల్లాకు చెందిన దేవ్‌కుమార్ మైత్రీ (32)గా గుర్తించారు. పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి ముంబై తీసుకువచ్చారు. విచారణ చేయగా వేదింపులకు పాల్పడినట్టు అతను అంగీకరించాడు. ''ఓ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా పెవిలియన్ వద్ద ఉన్న సారాను టీవీలో చూశాను. అప్పుడే ఆమె ప్రేమలో పడ్డాను. పెళ్లి చేసుకోవాలని ఆశపడ్డాను. సచిన్ ఇంటి ల్యాండ్‌లైన్ నెంబర్ సంపాదించి 20 సార్లు ఫోన్ చేశాను. ఆమెను నేరుగా ఎప్పుడూ చూడలేదు'' అని దేవ్‌కుమార్ పోలీసులతో చెప్పాడు. దేవ్‌కుమార్ ఇంట్లో పోలీసులు అతని డైరీని స్వాధీనం చేసుకున్నారు. డైరీలో సచిన్ కుమార్తెను తన భార్యగా అతను రాసుకున్నాడు.



8 ఏళ్లుగా మానసిక వ్యాధికి చికిత్స

దేవ్‌కుమార్ మానసిక స్థితి సరిగా లేదని అతని కుటుంబ సభ్యులు చెప్పారు. కాలేజీ చదువును మధ్యలోనే ఆపేశాడని తెలిపారు. ఇంట్లో కూడా కుటుంబ సభ్యులను వేదించేవాడని, ఇటీవలే అతని తండ్రి చనిపోయాడని బంధువులు చెప్పారు. ఎనిమిదేళ్లుగా మానసిక చికిత్స పొందుతున్నాడని తెలిపారు. అయితే దేవ్‌కుమార్ పెయింట్స్ బాగా వేస్తాడని చెప్పారు.

ప్రపంచ చాంపియన్ దుర్మరణం


- ఢిల్లీ శివారులో రోడ్డు ప్రమాదం
- సక్షమ్, మరో నలుగురు లిఫ్టర్ల మృతి



న్యూఢిల్లీ, జనవరి 7: ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న, దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకువస్తున్న ఐదుగురు క్రీడాకారులను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. దేశ రాజధాని ఢిల్లీ శివారున అలీపూర్ ప్రాంతంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రపంచ చాంపియన్ సక్షమ్ యాదవ్ సహా ఐదుగురు పవర్ లిఫ్టర్లు దుర్మరణం చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఆరుగురిని సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా నలుగురు మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతులను హరీశ్, టింకు, సూరజ్‌గా గుర్తించారు. మరో మృతుడి వివరాలు తెలియరాలేదు. తీవ్రంగా గాయపడిన యాదవ్, సహాయకుడు బాలిలను మెరుగైన వైద్యం కోసం షాలిమర్‌బాగ్‌లోని మ్యాక్స్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యాదవ్ మరణించారు. తెల్లవారుజాము 4 గంటల ప్రాంతంలో ఈ దుర్ఘటన జరిగినట్టు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి అతివేగం, పొగమంచు కారణమని భావిస్తున్నారు.

భద్రత యంత్రాంగం కట్టుదిట్టం కావాలి


- డీజీపీ-ఐజీపీల వార్షిక సదస్సులో ప్రధాని మోదీ



తేకన్‌పూర్, జనవరి 7: దేశంలో భద్రత పరిస్థితులపై వివిధ రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లోతైన సమీక్ష నిర్వహించారు. మధ్యప్రదేశ్‌లోని తేకన్‌పూర్‌లోగల బీఎస్ఎఫ్ అకాడమీ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన డీజీపీ-ఐజీపీల వార్షిక సదస్సులో వివిధ అంశాలపై ఆయన రోజంతా వారితో చర్చించారు. భద్రత యంత్రాంగాన్ని మరింత పటిష్ఠం చేయడంపై సదస్సులో దార్శనికతతో కూడిన ప్రతిపాదనలు, ఫలవంతమైన చర్చలు సాగినట్లు ట్విట్టర్‌లో స్వయంగా ప్రకటించారు. మూడేళ్లలో తీసుకున్న నిర్ణయాలు, అమలు స్థాయి గురించి ఉన్నతాధికారులు ఈ సందర్భంగా వివరించారని పేర్కొన్నారు. ప్రత్యేకించి జమ్మూకశ్మీర్‌తోపాటు ఈశాన్య రాష్ట్రాలు, వామపక్ష ప్రభావిత ప్రాంతాల్లో భద్రత యంత్రాంగాన్ని కట్టుదిట్టం చేయాల్సిన ఆవశ్యకతను పోలీసు ఉన్నతాధికారులకు ఆయన వివరించినట్లు అధికారవర్గాలు తెలిపాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఈ సదస్సులో కేంద్ర పోలీసు సంస్థలుసహా పలు రాష్ట్రాల అత్యున్నత స్థాయి అధికారులు 250 మంది ఇందులో పాల్గొంటున్నారు. కాగా, జమ్మూకశ్మీర్‌లో యువతను రెచ్చగొట్టేందుకు పొరుగుదేశం చేయని ప్రయత్నమంటూ లేదని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

లేటు వయసులో ఘాటు ప్రపోజల్

- మూడోపెళ్లికి సిద్ధమైన ఇమ్రాన్ ఖాన్





ఇస్లామాబాద్, జనవరి 7: పాకిస్థాన్ ప్రతిపక్ష నాయకుడు, మాజీ క్రికెటర్ ఇమ్రాన్‌ఖాన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. లేటు వయసులో పీకల్లోతు ప్రేమలో మునిగిపోయి.. అవతలి మహిళకు ప్రపోజ్ కూడా చేసేశారు. అయితే తామిద్దరం ఇప్పటికే జనవరి 1వ తేదీన రహస్యంగా పెళ్లి కూడా చేసేసుకున్నాం అంటూ వచ్చిన కథనాలను ఆయన ఖండించారు. ఈ మేరకు ఇమ్రాన్ అధికార ప్రతినిధి ఒక ప్రకటన విడుదల చేశారు. బుష్రా మనేకా అనే మహిళకు ఆయన ప్రపోజ్ చేశారని, అయితే.. ఆమె తన కుటుంబ సభ్యులు, తన పిల్లలతో సంప్రదించి ఒక తుది నిర్ణయం తీసుకోడానికి కొంత సమయం కోరిందని అందులో చెప్పారు. తమ నాయకుడికి సంబంధించిన వ్యక్తిగత వ్యవహారం, అత్యంత సున్నితమైన అంశంపై తప్పుడు కథనాలు ప్రచారం చేయడం చాలా బాధాకరమని కూడా అన్నారు. ప్రజాజీవితంతో ఏమాత్రం సంబంధం లేని ఒక మహిళ గురించి కూడా ఇందులో రాశారని చెప్పారు. దీనివల్ల మనేకా, ఆమె పిల్లలు కూడా చాలా ఇబ్బంది పడతారని అన్నారు. ఒకవేళ ఇమ్రాన్‌ఖాన్ ప్రతిపాదనను మనేకా అంగీకరిస్తే ఆ విషయాన్ని ఇమ్రాన్ స్వయంగానే ప్రకటిస్తారని.. అప్పటివరకు రెండు కుటుంబాలకు, ముఖ్యంగా వాళ్ల పిల్లలకు కాస్తంత గోప్యత ఇవ్వాలని మీడియాను కోరారు.

ఎవరీ మనేకా?

సుమారు 40 ఏళ్ల వయసులో ఉన్న బుష్రా మనేకా... ఇంతకు ముందు ఇస్లామాబాద్‌లో సీనియర్ కస్టమ్స్ అధికారిగా పనిచేస్తున్న ఖవార్ ఫరీద్ మనేకాను పెళ్లి చేసుకున్నారు. జనవరి ఒకటోతేదీ రాత్రి ఈమెకు, ఇమ్రాన్‌కు లాహోర్ నగరంలో పెళ్లయిందని పాక్ పత్రికలలో కథనాలు వచ్చాయి. పెళ్లి తర్వాత అటు నుంచి అటే ఇస్లామాబాద్‌లోని ఉగ్రవాద వ్యతిరేక కోర్టుకు ఇమ్రాన్‌ఖాన్ వెళ్లగా అక్కడ ఆయనకు బెయిల్ వచ్చిందని కూడా ఆ కథనాల్లో ఉంది. పాకిస్థాన్ తెహరీక్ ఎ ఇన్సాఫ్ (పీటీఐ) కోర్ కమిటీ సభ్యుడైన ముఫ్తీ సయీద్ స్వయంగా ఈ పెళ్లి చేయించారని కూడా చెప్పారు. ఇమ్రాన్‌ఖాన్‌కు ఇంతకుముందు 2015 జనవరి 8న ప్రముఖ టీవీ యాంకర్ రేహమ్‌ఖాన్‌తో రెండో పెళ్లి అయ్యింది. అయితే, పది నెలల తర్వాత వీళ్లిద్దరూ విడాకులు తీసుకున్నారు. ఒకవేళ మనేకా అంగీకరించి ఇమ్రాన్‌ను పెళ్లి చేసుకుంటే.. ఇది ఆయనకు మూడో పెళ్లి అవుతుంది.

బీజేపీ కుట్రకు లాలూ బలయ్యారు!

- ఆ పార్టీలో ఉంటే జైలు శిక్ష పడేది కాదు: అఖిలేశ్



లఖ్‌నవ్, జనవరి 7: దాణా కుంభకోణం కేసులో జైలు శిక్ష పడిన ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ అండగా నిలిచారు. ఆయన పట్ల బీజేపీ అన్యాయంగా వ్యవహరించిందని మండిపడ్డారు. ''బీజేపీ కుట్రకు లాలూ బలయ్యారు. ఆయన బీజేపీలో చేరి ఉంటే జైలు శిక్ష పడేది కాదు. ఏదేమైనా.. హైకోర్టులో లాలూకు న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నా'' అని అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. కాగా, లాలూ ఉదంతాన్ని చూసైనా వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు అన్ని పక్షాలు ఏకం కావాల్సిన అవసరాన్ని గుర్తించాలని ఎస్పీ నేత రమాశంకర్ విద్యార్థి పేర్కొన్నారు.


కోర్టు తీర్పు నిరాశ కలిగించింది: శత్రుఘ్న సిన్హా

లాలూ ప్రసాద్ యాదవ్‌కు బీజేపీ తిరుగుబాటు ఎంపీ శత్రుఘ్న సిన్హా కూడా మద్దతుగా నిలిచారు. దాణా కుంభకోణంలో సుప్రీంకోర్టు తీర్పు తనకు తీవ్ర నిరాశ కలిగించిందని ఆదివారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. లాలూ గొప్ప జననేత (మాస్ లీడర్) అని ప్రశంసలు కురిపిస్తూ.. ఎగువ కోర్టులో ఆయన కోరుకున్న తీర్పు వస్తుందని భావిస్తున్నానని పేర్కొన్నారు. లాలూ తమ కుటుంబానికి మంచి మిత్రుడని, ఈ నేపథ్యంలోనే తాను ఈ ట్వీట్ చేస్తున్నానని స్పష్టం చేశారు. అంతేగానీ.. దీనిని రాజకీయ దృక్కోణంలో చూడట్లేదని పేర్కొన్నారు.

ప్రక్షాళనకు ప్రతిపాదనలివ్వండి

రాజకీయ విరాళాలపై ప్రజలకు జైట్లీ పిలుపు.. ఆచరణ సాధ్యంకాని సలహాలు వద్దని సూచన

న్యూఢిల్లీ, జనవరి 7: రాజకీయ పార్టీలకు నిధుల విధానాన్ని మరింత ప్రక్షాళన చేసేందుకు సూచనలివ్వాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ప్రజలకు పిలుపునిచ్చారు. విరాళ ప్రదానంలో ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 'ఎన్నికల బాండ్ల' వ్యవస్థ గణనీయ పారదర్శకతను తెస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే, మరింత మెరుగైన ప్రతిపాదనలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆదివారం తన ఫేస్‌బుక్ ఖాతాలో వెల్లడించారు. ప్రస్తుతం పార్టీలకు విరాళాల రూపేణా నిధులు అందుతుండగా నగదు రూపంలో ఖర్చు చేయడం సంప్రదాయ విధానంగా ఉందని గుర్తుచేశారు. దీనివల్ల 'అనామక లేదా అజ్ఞాత నామక' వనరుల నుంచి విరాళాలు అందుతున్నాయని వివరించారు. అంతేగాక అలా అందుతున్న సొమ్ముకు స్పష్టమైన లెక్కలు ఉండటంలేదని పేర్కొన్నారు. ఫలితంగా గుర్తు తెలియని వనరుల నుంచి అక్రమార్జన విరాళాల రూపంలో ప్రవహిస్తున్నదని తెలిపారు. ''ఇది పూర్తిగా పారదర్శకత లేని వ్యవస్థ. చాలా పార్టీలకు ఈ విధానమే బాగుంది కాబట్టి అది యథాతథంగా ఉండాలని అవి కోరుకుంటాయి. అందువల్ల ప్రత్యామ్నాయ వ్యవస్థను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం'' అని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే గత వారం ఎన్నికల బాండ్ల విధానాన్ని ప్రకటించినట్లు గుర్తుచేశారు. ఈ పద్ధతి కింద స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీచేసే బాండ్లను విరాళ ప్రదాతలు కొనుగోలు చేసి పార్టీలకు అందజేయవచ్చు. వీటి చెల్లుబాటు గడువు 15 రోజులు మాత్రమేగనుక ఆ గడువులోగా పార్టీలు సదరు బాండ్ల రూపంలోని విరాళాన్ని తమ ఖాతాలద్వారా స్వీకరించవచ్చు. ప్రస్తుతం చెక్కులు లేదా ఆన్‌లైన్ బదిలీద్వారా పారదర్శక రీతిలో విరాళాలిచ్చే వెసులుబాటు కూడా ఉంది. తాజాగా ప్రకటించిన బాండ్ల విధానం మూడో పారదర్శక ప్రత్యామ్నాయం అవుతుంది. వీటిలో మొదటి రెండూ సంపూర్ణ పారదర్శకతకు తోడ్పడేవి కాగా, తాజా పద్ధతి ప్రస్తుత నగదు విరాళాల వ్యవస్థకు మెరుగైన రూపం కాగలదని జైట్లీ అభిప్రాయపడ్డారు. దీన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రజల నుంచి సలహాలు కోరుతున్నామని ఆయన పేర్కొన్నారు. అయితే, నగదురహిత వ్యవస్థ ప్రగతికి అవరోధం కల్పించే ఆచరణసాధ్యంకాని పద్ధతులు సూచించవద్దని విజ్ఞప్తి చేశారు. ''ఏడాది పొడవునా సాగే రాజకీయ కార్యకలాపాల కోసం పార్టీలు భారీగా ఖర్చులు చేయాల్సి ఉంటుంది. అంటే ఈ వ్యయం రూ.వందల కోట్ల స్థాయిలో ఉంటుంది. కానీ, మన రాజకీయ వ్యవస్థలో ఏడు దశాబ్దాలుగా పార్టీలకు నిధులపై పారదర్శక విధానం లేకపోవడం శోచనీయం'' అని ఈ సందర్భంగా అరుణ్ జైట్లీ వ్యాఖ్యానించారు.



ఆప్ నేత అశుతోష్‌కు కోర్టు ఫైన్

ఢిల్లీ, జనవరి 7: కోర్టు సమయాన్ని వృథా చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆప్ నేత అశుతోష్‌కు ఢిల్లీ చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు రూ.10 వేల జరిమానా విధించింది. 2015లో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసులో అశుతోష్ సహా ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఆప్ నేతలు కుమార్ విశ్వాస్, సంజయ్ సింగ్, రాఘవ్ చంద్ర, దీపక్ బాజ్‌పాయ్ తదితరులు విచారణను ఎదుర్కొంటున్నారు. అయితే ఈ కేసులో జైట్లీ కోర్టుకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను ఇంగ్లిషు నుంచి హిందీలోకి అనువాదం చేసి ఇవ్వాల్సిందిగా అశుతోష్ న్యాయస్థానాన్ని విజ్ఞప్తి చేశారు. అయితే అశుతోష్‌కు ఇంగ్లిషు బాగా వచ్చని, కోర్టు సమయాన్ని వృథా చేయడానికే ఇటువంటి పనుల చేస్తున్నారని న్యాయమూర్తి దీపక్ షెరావత్ మండిపడ్డారు. రూ.10 వేలు జరిమానా కట్టాలని ఆదేశించారు.

'ఉభయ కొరియా' చర్చలు ఫలిస్తాయ్

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశాభావం
- తన ఒత్తిడితోనే సంభాషణ సాధ్యమైనట్లు వ్యాఖ్య
- కిమ్‌తో ఫోన్‌లో మాట్లాడేందుకు సిద్ధమని ప్రకటన



క్యాంప్ డేవిడ్, జనవరి 7: ఉత్తర-దక్షిణ కొరియాల మధ్య చర్చలు ఫలించగలవని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో ఫోన్ సంభాషణకు సిద్ధమేనని కూడా ప్రకటించారు. దాయాది దక్షిణ కొరియాతో వచ్చేవారం అధికారిక చర్చలకు ఉత్తర కొరియా శుక్రవారం నాడు సుముఖత వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. కిమ్ నిర్వహిస్తున్న అణు, క్షిపణి పరీక్షల నిలిపివేతపై ప్రతిష్టంభన కొనసాగుతున్నప్పటికీ అమెరికా-దక్షిణ కొరియా నిర్వహించ తలపెట్టిన సంయుక్త సైనిక విన్యాసాలను వాయిదా వేశాయి. ఈ నిర్ణయం వెలువడిన కొద్ది గంటల్లోనే చర్చల దిశగా ఉత్తరకొరియా సానుకూల స్పందన తెలపడం గమనార్హం. ఈ నేపథ్యంలో మేరీలాండ్ రాష్ట్రంలోని క్యాంప్ డేవిడ్‌లో ట్రంప్ మీడియా ప్రశ్నలకు బదులిస్తూ- కిమ్‌తో బేషరతు సంభాషణకు సుముఖత వెలిబుచ్చారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక కిమ్‌తో పరస్పర నిందాపూర్వక వాగ్యుద్ధం కొనసాగుతోంది. ఇందులో భాగంగా తన బల్లమీద అణ్వాయుధ ప్రయోగ బటన్ సదా సిద్ధంగా ఉంటుందని కిమ్ హెచ్చరించగా... 'నా బల్లమీద అంతకన్నా పెద్ద బటన్ ఉంద'ంటూ ట్రంప్ వెక్కిరించడం ఇందుకు తాజా ఉదాహరణ. ఈ పరిస్థితుల నడుమ ట్రంప్ ఓ మెట్టు దిగడం ఆశ్చర్యకరమేనని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా, దాయాదుల మధ్య రెండేళ్ల తర్వాత తొలిసారి జరుగుతున్న భేటీలో దక్షిణ కొరియాలో నిర్వహించనున్న వింటర్ ఒలింపిక్స్‌తోపాటు పరస్పర సంబంధాలపై ప్రధానంగా చర్చ సాగే అవకాశం ఉంది. ఉత్తరకొరియాపై తాను నిరంతర ఒత్తిడి తెచ్చినందువల్లే తాజా పరిణామానికి దారులుపడ్డాయని ట్రంప్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

కశ్మీర్‌లో ఇంకా కల్లోలమే!

- శాంతి స్థాపనలో మోదీ సర్కారు విఫలం: చిదంబరం



న్యూఢిల్లీ, జనవరి 7: కశ్మీర్‌లో కల్లోల పరిస్థితులు ఇంకా తొలగిపోలేదని, శాంతి స్థాపనలో ప్రధాని మోదీ నేతృత్వంలోని సర్కారు విఫలమైందని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని సోపూర్ జిల్లాల్లో ఉగ్రవాదులు మందుపాతర పేల్చి నలుగురు పోలీసులను బలిగొన్న నేపథ్యంలో ఆయన ఈ మేరకు స్పందించారు. ఉగ్రవాదంతో ఉడికిపోతున్న ఆ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కఠిన, సైనిక, బలప్రయోగ చర్యలన్నీ నిష్ఫలమెనట్లు ఆదివారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. వీటివల్ల సానుకూల ఫలితాలు రాకపోగా సమస్య మరింత ముదిరిందని ఆరోపించారు. సాక్షాత్తూ కేంద్ర హోంశాఖ గణాంకాలే ఈ వాస్తవాలను వెల్లడిస్తున్నాయని వివరించారు. ఆ మేరకు 2014-17 మధ్య మూడేళ్ల వ్యవధిలో పౌర మరణాలు 28 నుంచి 57కు, కాల్పుల్లో హతమైన ఉగ్రవాదుల సంఖ్య 110 నుంచి 218కి పెరిగినట్లు ఉటంకించారు. అలాగే ఉగ్రవాదంపై పోరులో అమరులైన భద్రత సిబ్బంది సంఖ్య కూడా 47 నుంచి 83కు పెరిగిం దని గుర్తుచేశారు. ఇక కశ్మీర్ సమస్య పరిష్కర్తగా దినేశ్వర్ శర్మ నియామకాన్ని కేవలం ఎన్నికల ఎత్తుగడగా రాష్ట్రంలోని వివిధ భాగస్వామ్య సంస్థలు తిరస్కరించాయని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో 1989 నుంచి సాగుతున్న వేర్పాటువాదం ఫలితంగా వందలాది ప్రాణాలు బలయ్యాయని గుర్తుచేశారు. ఈ సమస్యకు రాజకీయ పరిష్కారం దిశగా పటిష్ఠ కార్యాచరణ ఒక్కటే ప్రభుత్వం ముందున్న మార్గమని సూచించారు.

తమిళనాట స్తంభించిన రవాణా

- జీతాలు పెంపు కోరుతూ కార్మికుల సమ్మె
- 4 రోజులుగా రోడ్డెక్కని బస్సులు
- 15 వేలకు పైగా బస్సులు డిపోల్లోనే
- నానా అవస్థలు పడుతున్న ప్రజలు
- హైకోర్టు ఆదేశాలనూ లెక్కచేయని కార్మికులు
- విధుల్లో చేరేందుకు ససేమిరా



చెన్నై, జనవరి 7: తమిళనాట ప్రజలు ప్రయాణం 'బంద్' అయిపోయింది. బస్సు కదలక ప్రయాణికులు నానాపాట్లు పడుతున్నాయి. తమిళనాడులోని 17 రవాణా కార్మిక సంఘాలు జీతాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారం కోసం గురువారం నుంచి సమ్మెకు దిగాయి. దాదాపు 15 వేలకు పైగా బస్సులు డిపోల్లోనే నిలిపేశాయి. రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు రోడ్డెక్కకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారంతో సమ్మె నాలుగు రోజులకు చేరింది. ప్రభుత్వం, కార్మికులు మంకుపట్టుపట్టడంతో చర్చలు ముందుకు కదలడంలేదు. కార్మికుల జీతాలను 2.44 శాతం పెంచేందుకు సిద్ధమని రవాణా మంత్రి విజయభాస్కర్ చెబుతుండగా.. 2.57 శాతం పెంచితే గానీ తాము విధుల్లో చేరబోమని కార్మికులు తెగేసి చెబుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని విధుల్లో చేరాలని మద్రాసు హైకోర్టు ఆదేశించినా వారు లెక్కచేయలేదు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు స్టీరింగ్ పట్టేదిలేదని చెప్పారు. దీంతో తమిళనాడు నాలుగు రోజులుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారంతంలో చెన్నై నగర వాసులు బయటకు వెళ్లాలన్నా సమస్యగా మారింది. ఇదే అదనుగా ప్రైవేటు వాహన దారులు ప్రజలను ఇష్టానుసారం దోచుకుం టున్నారు. సాధారణ టికెట్టు ధరపై 25 నుంచి 80 శాతం వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. మరోవైపు సంక్రాంతి సమీపిస్తుం డడంతో ఉపాధి కోసం తమిళనాడులో ఉంటు న్న వారంతా స్వస్థలాలకు ఎలా చేరాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. కాగా, రాష్ట్రంలోని అతి కొద్ది ప్రాంతాల్లో మాత్రమే తాత్కాలిక డ్రైవర్లను నియమించి ప్రభుత్వం బస్సులను నడిపిస్తోంది. అన్నాడీఎంకే పార్టీకి అనుబంధంగా ఉన్న కార్మిక సంఘాలు మాత్రం కొన్ని చోట్ల బస్సులు తిప్పేందుకు ముందుకువస్తున్నాయి. అయితే వారినీ బంద్ పాటిస్తున్న యూనియన్లు అడ్డుకుంటున్నాయి. ఇదిలా ఉండగా, తక్షణం ప్రభుత్వం కార్మికులతో చర్చలు జరిపి ప్రజల కష్టాలను తీర్చాలని ప్రతిపక్ష నేత ఎంకే స్టాలిన్, సినీ నటుడు కమల్ హాసన్ డిమాండ్ చేశారు.

స్టీరింగ్ పట్టిన ఎమ్మెల్యే

నాలుగు రోజులగా ప్రయాణికులు పడుతున్న కష్టాలు చూసి ఓ ఎమ్మెల్యే స్టీరింగ్ పట్టి బస్సు డ్రైవర్‌గా మారారు. ఈరోడ్ జిల్లాకు చెందిన అన్నాడీఎంకే ఎమ్మెల్యే కేర్ రాధాకృష్ణన్ ఆదివారం భవాని బస్టాండ్‌లో తనిఖీలు చేసేందుకు వెళ్లారు. ఆ సమయంలో అక్కడ ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులు కాస్తూ ఉండడం ఆయన చూశారు. దీంతో ఆయనే బస్సు ఎక్కి భవాని నుంచి అంధియూర్ వరకు 70 మంది ప్రయాణికులను తీసుకెళ్లారు. అక్కడి నుంచి మళ్లీ భవాని వరకు ప్రయాణికులను ఎక్కించుకుని వచ్చారు. దీంతో ఆయనను ప్రజలు ప్రశంసించారు. తనకు లారీలు ఉండడంతో డ్రైవింగ్ తెలుసని, ప్రజల ఇబ్బందులు చూసి తాను స్టీరింగ్ పట్టానని రాధాకృష్ణన్ చెప్పారు.

రజనీకోసం వేచి చూస్తున్న సొంతూరు

- ఇప్పటివరకూ స్పందించని తలైవా!



పూనే, జనవరి 7: ఎప్పటికైనా తమ విజ్ఞప్తిని సూపర్ స్టార్ మన్నిస్తారంటూ కొండంత ఆశతో ఉన్నారు రజనీకాంత్ గ్రామస్థులు. మహారాష్ట్రలోని పూనెకు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న మవడి కడేపత్తర్ గ్రామస్థులు శివాజీరావ్ గైక్వాడ్ (రజనీకాంత్ అసలు పేరు) కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. 'త్వరలో రాజకీయ పార్టీ ప్రకటించనున్న రజనీకాంత్ సినిమాల్లోలానే రాజకీయాల్లోనూ హిట్ అవుతారు.. మా శివాజీ మీ రజనీకాంత్.. ఆయన ఇక్కడ పుట్టినవారే' అంటూ గుర్తుచేసుకుని గర్విస్తున్నారు హనుమంత్ ఛఛర్ అనే మాజీ గ్రామ సర్పంచ్. రజనీ రాజకీయాల్లోకి అడుగుపెడుతున్న సందర్భంలో ఇక్కడి గ్రామస్థులంతా ఉద్వేగంతో ఉన్నారు. కర్ణాటకలోని విజయపుర తాలూకాలోని బసవన్న బాగేవాడికి రజనీ తాత వలసవెళ్లారు, ఆ తరువాతి కాలంలో వీరంతా బెంగళూరులోనే స్థిరపడ్డారు.

కొన్నేళ్లక్రితం రజనీకాంత్ లోనావాలా పరిసర ప్రాంతాల్లో సాగుతున్న షూటింగ్ కోసం వచ్చిన సందర్భంగా గ్రామస్థులంతా వెళ్లి రజనీని కలిశారు. అప్పుడు వీరు తాము రజనీ తాతల ఊరు నుంచి వచ్చినట్టు హిందీలో చెప్పగా.. విషయం ఏమిటో చెప్పమని రజనీ అనర్గళంగా మరాఠీలో మాట్లాడడం వీరందరినీ ఆకట్టుకుంది. మరోవైపు మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత పురస్కారం 'మహారాష్ట్ర భుషణ్'ను రజనీకి ప్రదానం చేయాలనే డిమాండ్ ఊపందుకుంది. బీజేపీ ఎంఎల్‌ఏ అనిల్ గోటే ఈ దిశగా 2016లో డిమాండ్ చేశారు. కాగా రజనీకి చెందిన గైక్వాడ్ కుటుంబం కొల్హాపూర్‌కు చెందిందని అనిల్ ప్రకటించగా, సూపర్‌స్టార్ తమ ప్రాంతం వారని ఖేద్ తాలూక ప్రజలు వాదిస్తున్నారు.

మా గ్రామాన్ని సందర్శిస్తే సరి

ఓవైపు ఈ వాదులాట తారాస్థాయికి చేరుతుండగా మవడి కడేపత్తర్ గ్రామస్థులు మాత్రం ఒక్కమారు తమ గ్రామాన్ని రజనీ సందర్శిస్తే చాలని కోరుకుంటున్నారు. వీరిలో కొందరు చెన్నైలోని రజనీకాంత్ కార్యాలయంలో, పోయెస్ గార్డెన్‌లోని ఇంటిలో కలిసేందుకు విఫలయత్నం చేశారు. 2013లో జరిగిన మరాఠీ రచయితల సమావేశం ప్రారంభోత్సవానికి విచ్చేయాలని సూపర్‌స్టార్‌ను వీరు ఆహ్వానించినా, ఇందుకు రజనీకాంత్ స్పందించలేదు.

మంగళూరులో ఉద్రిక్తత

- రెండు వర్గాలమధ్య ఘర్షణ

మంగళూరు, జనవరి 7: కర్నాటకలోని మంగళూరు రెండు వర్గాలమధ్య చెలరేగిన ఘర్షణలతో అట్టుడుకుతోంది. ఒక వర్గానికి చెందిన వ్యక్తిపై దాడిచేసి ప్రాణాలు తీసినందుకు ప్రతిగా నలుగురు వ్యక్తులు 47 సంవత్సరాల వ్యక్తిపై చేసిన దాడి ధాటికి అతడు మరణించినట్టు స్థానిక పోలీసులు వెల్లడించారు. జనవరి 3వ తేదీన బజరంగ్‌దళ్, బీజేపీకి చెందిన 28 ఏళ్ల కార్యకర్త దీపక్ రావుపై దాడికి పాల్పడ్డాడన్న కారణంతోనే బషీర్ అనే వ్యక్తిపై దాడి జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. కాగా బషీర్‌పై దాడికి పాల్పడ్డ నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. జిహాదీ శక్తులను అనుమతించేలా కర్నాటక ప్రభుత్వం వ్యవహరిస్తుండడంతో, రాష్ట్రంలో 22 మంది హిందుత్వ కార్యకర్తలు ప్రాణాలు పోగొట్టుకున్నట్టు బీజేపీ ఆరోపిస్తోంది.

62 గెటప్స్‌లో బాలకృష్ణ


బాలకృష్ణ

పూర్తి స్థాయి యాక్షన్ సినిమాలు చేస్తూ ప్రేక్షకుల్ని, అభిమానుల్ని అలరిస్తున్న నందమూరి బాలకృష్ణ తాజా చిత్రం 'జై సింహా'. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మించిన ఈ సినిమా జనవరి 12న సంక్రాంతి సందర్భంగా విడుదల కానుంది. ఈ చిత్రంలో బాలకృష్ణ సరసన నయనతార, నటాషా దోషి, హరిప్రియ హీరోయిన్లుగా నటించారు. ఇదిలా ఉంటే నటరత్న ఎన్.టి.రామారావు జీవిత కథ ఆధారంగా తెరకెక్కనున్న చిత్రాన్ని త్వరలో ప్రారంభించబోతున్నారు బాలకృష్ణ. ఈ సినిమా ఎలా ఉండబోతోందనే విషయాన్ని చెప్పే టీజర్ కోసం ఒకరోజు షూటింగ్ కూడా జరిపారు. ఈ టీజర్‌ను ఎన్.టి.రామారావు వర్ధంతి సందర్భంగా ఈనెల 18న విడుదల చేస్తారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్న ఈ సినిమాకి సంబంధించిన కొన్ని విశేషాలను వెల్లడించారు బాలకృష్ణ. ఈ బయోపిక్‌లో ఎన్టీఆర్ సమగ్రంగా తెరకెక్కిస్తామని, ఇందులో తాను 62 గెటప్స్‌లో కనిపిస్తానని తెలిపారు. తేజ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రాన్ని నందమూరి బాలకృష్ణ స్వయంగా నిర్మించనున్నారు. ఎన్టీఆర్ పుట్టిన దగ్గర నుంచి చివరి వరకు ఈ బయోపిక్‌లో చూపిస్తామంటున్నారు.

అప్పుడు కలకత్తా.. ఇప్పుడు వారణాసి


పవన్ కళ్యాణ్

'చూడాలని ఉంది'.. చిరంజీవి కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్ చిత్రాలలో ఒకటిగా నిలిచిన సినిమా పేరిది. అంతకుముందు ఉన్న చిరు సినిమాల రికార్డులన్నింటిని బద్ధలు కొట్టిన ఘనత ఈ మూవీది. 'ఖుషి'.. పవన్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్ చిత్రాలలో ఒకటిగా నిలిచిన ఫిల్మ్ ఇది. అప్పటివరకు ఉన్న అతని సినిమాల కంటే పెద్ద హిట్‌గా ఈ మూవీ నిలిచింది. ఈ రెండు చిత్రాలకు ఓ కామన్ పాయింట్ ఉంది. అదే.. కలకత్తా నేపథ్యం. అంతేకాకుండా.. ఈ రెండు చిత్రాలకు మణిశర్మ సంగీత దర్శకుడు కావడం విశేషం. కట్ చేస్తే.. 'ఇంద్ర'.. చిరు కెరీర్‌లో మరో ఇండస్ట్రీ హిట్ మూవీ పేరిది. ఈ చిత్రం అంతకుముందు ఉన్న పలు సినిమాల రికార్డులను బద్ధలు కొట్టింది. తెలుగు తెరపై చెరగని సంతకం చేసింది. ఈ సినిమాలో ప్రథమార్థం అంతా వారణాసి నేపథ్యంలో నడుస్తుంది. సరిగ్గా అలాంటి వారణాసి నేపథ్యంతోనే.. ఇప్పుడు పవన్ కొత్త చిత్రం 'అజ్ఞాతవాసి' రాబోతోంది. ఈ రెండు చిత్రాలకి కూడా కొన్ని కామన్ పాయింట్స్ ఉన్నాయి. 'ఇంద్ర'.. చిరంజీవి, దర్శకుడు బి.గోపాల్ కాంబినేషన్‌లో మూడో చిత్రం కాగా.. 'అజ్ఞాతవాసి' ఏమో పవన్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో మూడో సినిమా. 'ఇంద్ర'.. ఆ చిత్ర నిర్మాత సి.అశ్వనీదత్‌కి సిల్వర్ జూబ్లీ ఇయర్ ఫిల్మ్ కాగా, 'అజ్ఞాతవాసి' ఏమో పవన్ కెరీర్‌లో సిల్వర్ జూబ్లీ (25) ఫిల్మ్. అలాగే ఈ రెండు చిత్రాల్లోనూ కథానాయకుడు అజ్ఞాతంలో ఉండడం మరో కామన్ పాయింట్. అదే విధంగా.. ఈ రెండు చిత్రాలకు కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్‌గా వ్యవహరించడం విశేషం. 'చూడాలని ఉంది' బాటలోనే కలకత్తా నేపథ్యంతో తెరకెక్కిన 'ఖుషి' బ్లాక్ బస్టర్ హిట్ అయినట్టే.. వారణాసి నేపథ్యంతో 'ఇంద్ర' బాటలోనే 'అజ్ఞాతవాసి' కూడా వెళ్ళి నయా రికార్డులకు బాట వేస్తాడా? జనవరి 10న ఈ ప్రశ్నకు సమాధానం దొరకబోతోంది.

మూలాలను మరచిపోలేదు

– సూర్య


సూర్య

'గ్యాంగ్' కోసం తెలుగులో తొలిసారిగా డబ్బింగ్ చెప్పాను. చిన్నప్పుడు ఇండియాలోని భాషలన్నింటిలో తెలుగు చాలా మధురమైన భాష అని చదివాను. తెలుగు ఎంత స్వీట్‌గా ఉంటుందో డబ్బింగ్ చెబుతున్నప్పుడు అర్థమైంది. తమిళ డబ్బింగ్‌ను ఎనిమిది రోజుల్లో చెబితే..తెలుగు డబ్బింగ్‌ను ఆరు రోజుల్లో చెప్పేశాను.' అని అన్నారు హీరో సూర్య. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'గ్యాంగ్'.కీర్తి సురేష్ హీరోయిన్. ఈ సినిమా జనవరి 12న విడుదలవుతుంది. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సూర్య సినిమా గురించిన విశేషాలను తెలియజేస్తూ...

- 'గ్యాంగ్'లో నాకు రెండు పేర్లుంటాయి. అవేంటి? అసలు గ్యాంగ్ ఎవరిపై పోరాడుతుందో తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే.
- బాలీవుడ్ సినిమా 'స్పెషల్ 26' కు రీమేకే ఈ 'గ్యాంగ్'. రెండు, మూడు సన్నివేశాలు మాతృకలో ఉన్నట్లే ఉంటాయి. మిగిలిన సినిమాను విఘ్నేశ్ తనదైన శైలిలో కొత్తగా తెరకెక్కించారు. . 1980 దశకంలో జరిగిన నిజమైన ఘటన ఒపెరా రొబరి ఆధారంగానే కథను తయారు చేశారు. ఇంత బలమైన కథను క్యారీ చేసే క్యారెక్టర్స్, ఎమోషన్స్, బ్యాక్‌గ్రౌండ్ ప్రేక్షకులకు కనపడతాయి.
- నేను కెరీర్‌ని 1987లో స్టార్ట్ చేశాను. ఆ సమయంలో నిరుద్యోగ సమస్య చాలా ఎక్కువగా కనపడేది. దర్శకుడు విఘ్నేశ్ శివన్ వచ్చి ఈ సినిమా బ్యాక్‌డ్రాప్ 1985లో ఉంటుందని చెప్పగానే నేను కనెక్ట్ అయ్యాను.
- 'గ్యాంగ్' సినిమాలో నటించడం వల్ల నాకు పాత రోజులు గుర్తుకు వచ్చాయి. ఈ సినిమాలో చాలా కొత్తగా కనపడతాను. ఈ మధ్యలో ఇలాంటి పాత్రను నేనెప్పుడూ చేయలేదు. అందుకు కారణం కెరీర్ ప్రారంభంలో చేసిన విధంగా ఇందులో క్యూట్ ఎమోషన్స్ ఉన్న పాత్రలో నటించడమే. డైరెక్టర్ కథను నెరేట్ చేసినప్పుడు ఓ ఫ్రెష్‌నెస్‌ను ఫీలయ్యాను.
- సినిమాకు అద్భుతమైన టీమ్ కుదిరింది. సీనియర్ నటులు కార్తీక్, రమ్యకృష్ణగారు, సెంథిల్ తదితరులతో పాటు అనిరుధ్ మ్యూజిక్, దినేశ్ సినిమాటోగ్రఫీ సినిమాకు ఎసెట్ అయ్యాయి.
- శ్రీనివాసమూర్తిగారు నా చిత్రాలకు డబ్బింగ్ చెబుతుంటారు. ఆయన డబ్బింగ్ చెప్పిన పాత్రలు చాలా ఎగ్రెసివ్‌గా ఉండేవి. 'గ్యాంగ్' విషయానికి వస్తే..పాత్ర చాలా కూల్‌గా, జోవియల్‌గా ఉంటుంది. ..డైలాగ్ డెలివరీలో అగ్రెసివ్‌గా ఉండాల్సిన అవసరం లేదు. అదే సమయంలో నేనే డబ్బింగ్ చెప్పుకుంటే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. అప్పుడు 'గ్యాంగ్' టీజర్‌లో నేను చెప్పిన వాయిస్ బావుందని ఫీడ్ బ్యాక్ కూడా రావడంతో నాకు కాన్ఫిడెన్స్ వచ్చి డబ్బింగ్ చెప్పాను.
- మేమేదో గొప్ప సినిమా చేశామని చెప్పను కానీ..20 ఏళ్ల సినీ జర్నీ తర్వాత నా మూలాల్లోకి వెళ్లి చేసిన సినిమా ఇది అనే భావన కలిగింది. అందువల్ల నాకు కొత్తగా అనిపించింది..రేపు సినిమా చూసే ఆడియెన్స్‌కు సూర్య కొత్తగా కనపడ్డాడే అనిపిస్తుంది. మూలాలకు వెళ్లి చేశానని చెప్పడానికి కారణం నేను నా మూలాలను మరచిపోలేదు. సినిమాల్లోకి రాక మునుపు ఒక ఎక్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేశాను. నా తొలి సంపాదన 726 రూపాయలు. బస్సులోనే ప్రయాణించేవాడిని. అలా నా తల్లిదండ్రులు నన్ను సాధారణంగానే పెంచారు. కాబట్టి నా మూలాలను నేను మరచిపోలేదు.
- రజనీకాంత్‌గారు, కమల్‌హాసన్‌గారు ఇద్దరూ ఇప్పుడు తమిళ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. వీరి చుట్టూ చాలా రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇద్దరికీ వేర్వేరు అభిప్రాయాలున్నప్పటికీ రీసెంట్‌గా మలేషియాలో జరిగిన కార్యక్రమంలో ఇద్దరూ కలిసి పాల్గొన్నారు. ఎంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్నప్పటికీ రాజకీయాల్లో రాణించడం అంత సులభం కాదు. ఎలక్షన్స్‌కు ఇంకా రెండేళ్ల సమయం ఉంది. చూడాలి మరేం జరుగుతుందో.
- సెల్వరాఘవన్‌గారి దర్శకత్వంలో సినిమా చేస్తున్నాను. అలాగే కె.వి.ఆనంద్‌గారి దర్శకత్వంలో సినిమా చిత్రీకరణ జరగాల్సి ఉంది. హరిగారి దర్శకత్వంలో రెండేళ్లకు ఒక సినిమా చేస్తాను. కానీ ప్రస్తుతానికైతే హరి దర్శకత్వంలో సినిమా చేయడం లేదు. తదుపరి ఆయనతో చేయబోయే సినిమా సింగం సీక్వెల్ మాత్రం కాదు.
- అరవింద్‌గారి ప్రొడక్షన్‌లో స్ట్రయిట్ తెలుగు సినిమా చేయాలని రెండు, మూడు సార్లు అనుకున్నప్పటికీ అప్పటికే ఇద్దరికీ ఉన్న కమిట్‌మెంట్స్ కారణంగా చేయలేకపోయాం. అయితే ఇద్దరం కలిసి సినిమా చేయాలనైతే అనుకుంటున్నాం.

బిగ్‌బాస్‌లో రకుల్


రకుల్ ప్రీత్

హీరోయిన్ రకుల్ ప్రీత్ బిగ్‌బాస్ రియాలిటీ షోలో పాల్గొనబోతోంది. సాధారణంగా సినిమా అవకాశాలు తగ్గిన వారికి ఎక్కువ సమయం దొరుకుతుంది కాబట్టి అలాంటి షోలలో పాల్గొంటారు. మరి రకుల్‌కి కూడా అవకాశాలు తగ్గాయని అనుకుంటే పొరబాటే. వివిధ భాషల్లో సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న రకుల్ బిగ్‌బాస్ షోలో పాల్గొనడానికి కారణం ఆమె చేస్తున్న 'అయ్యారీ' చిత్రమే. సల్మాన్ ఖాన్ వ్యాఖ్యాతగా వ్యవహరించనున్న బిగ్‌బాస్‌లో తాను పాల్గొంటున్నట్టు రకుల్ స్వయంగా ప్రకటించింది. అయితే 'అయ్యారీ' ప్రమోషన్‌లో భాగంగానే రకుల్ ఈ షోకు హాజరవుతోంది. జనవరి 26న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది. సిద్ధర్ మల్హోత్రా, మనోజ్ బాజ్‌పాయ్ నటిస్తున్న ఈ చిత్రంలో రకుల్ ప్రీత్ హీరోయిన్. తమ చిత్రానికి మరింత పబ్లిసిటీ కావాలంటే బిగ్‌బాస్ షోలో సందడి చెయ్యాలని యూనిట్ నిర్ణయించింది.

'ఒక్క క్షణం' థాంక్స్ మీట్



అల్లు శిరీష్, సురభి, అవసరాల శ్రీనివాస్, శీరత్ కపూర్ ప్రధాన తారాగణంగా నటించిన చిత్రం 'ఒక్క క్షణం'. వి.ఐ.ఆనంద్ దర్శకుడు. చక్రి చిగురుపాటి నిర్మాత. ఈ సినిమా డిసెంబర్ 28న విడుదలైంది. శనివారం ఏర్పాటు చేసిన థాంక్స్ మీట్‌లో అల్లు శిరీష్, దర్శకుడు విఐఆనంద్, నిర్మాత చక్రి చిగురుపాటి సహా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. అల్లు శిరీష్ మాట్లాడుతూ '' నా తొలి సినిమా 'గౌరవం' బాక్సాఫీస్ వద్ద పెద్దగా సక్సెస్ సాధించలేదు. దాంతో ఏదైనా కొత్తగా చేద్దామనే ఆలోచన మానుకున్నాను. తర్వాత 'కొత్తజంట', 'శ్రీరస్తు శుభమస్తు' వంటి కమర్షియల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌ను చేశాను. మళ్లీ ధైర్యం తెచ్చుకుని ఏదైనా కొత్తగా చేస్తే ఆడియెన్స్ ఆదరిస్తారనిపించింది. ఆ ప్రయత్నంలో భాగంగా 'ఒక్క క్షణం' సినిమా చేశాను. నా కెరీర్‌లో 2017కి చాలా ప్రత్యేకత ఉంది. 1971 బియాండ్ బోర్డర్ సినిమాలో మోహన్‌లాల్‌గారి పక్కన మంచి సపోర్టింగ్ పాత్రలో నటించాను. ఆ సినిమాలో నా క్యారెక్టర్‌కు చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాగే డిసెంబర్ 28న విడుదలైన 'ఒక్క క్షణం' మంచి సక్సెస్‌ను సాధించింది. ఇంత మంచి సినిమా చేసే అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు థాంక్స్. అలాగే నాతో వర్క్ చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు. భవిష్యత్‌లో కూడా మంచి సినిమాలు చేయాలనే కాన్ఫిడెన్‌ను ప్రేక్షకులు ఇచ్చారు'' అని తెలిపారు.

మంచు లక్ష్మి సినిమాకి చిరంజీవి టైటిల్


లక్ష్మీప్రసన్న

మంచు ఫ్యామిలీ నుంచి వచ్చిన లక్ష్మీప్రసన్న కొన్ని విలక్షణ పాత్రలు చేసి నటిగా తనని తాను నిరూపించుకుంది. నటిగానే కాక నిర్మాతగా కూడా తండ్రి బాటలోనే నడుస్తూ విజయాలు సాధిస్తోంది. ఇప్పుడు డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఓ థ్రిల్లర్‌ను నిర్మించేందుకు సిద్ధమైంది. రాజమౌళి వద్ద దర్శకత్వ శాఖలో పనిచేసిన విజయ్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ నిర్మిస్తున్న చిత్రానికి 'వేట' టైటిల్‌ని పరిశీలిస్తున్నారు. చిరంజీవి హీరోగా రూపొందిన చిత్రం 'వేట'. మంచు లక్ష్మి నిర్మించే చిత్రానికి కథపరంగా 'వేట' అనే టైటిల్ కరెక్ట్‌గా సరిపోతుందని భావిస్తున్నారు. మరి ఈ చిత్రానికి ఇదే టైటిల్ పెడతారా? లేక మరో టైటిల్ అనుకుంటున్నారా? అనే విషయాలు తెలియాలంటే అధికారిక ప్రకటన వెలువడే దాకా ఆగాల్సిందే.

కన్నడ కుమారిగా నిధి


నిధి కుశాలప్ప

రాజ్‌తరుణ్, హెబ్బా పటేల్ జంటగా నటించిన 'కుమారి 21 ఎఫ్' ఎంతటి ఘనవిజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఈ చిత్రంలోని పాటలు, మాటలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా యూత్ ఈ చిత్రానికి బ్రహ్మరథం పట్టింది. సుకుమార్ రైటింగ్స్ నిర్మాణంలో సూర్యప్రతాప్ పల్నాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఇప్పుడీ సినిమా కన్నడంలో అదే టైటిల్‌తో రీమేక్ అయ్యింది. తెలుగులో హెబ్బా చేసిన కుమారి పాత్రను కన్నడలో నిధి కుశలప్ప పోషించారు. రాజ్‌తరుణ్ పాత్రను ప్రణామ్ దేవరాజ్ చేశారు. అవినాష్, మనోజ్, అక్షయ్, రీతేష్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. మణిశర్మ తనయుడు సాగర్ మహతి సంగీతం అందించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. తెలుగులో హెబ్బాకి హీరోయిన్‌గా ఈ సినిమా మంచి పేరు తెచ్చింది. అలాగే తనకు కూడా 'కుమారి 21ఎఫ్' మంచి బ్రేక్ ఇస్తుందని నమ్ముతోంది నిధి. హీరోయిన్‌గా తన రేంజ్ పెరుగుతుందని భావిస్తోంది.

మహాభారతం కన్నా 'బాహుబలి' బెటర్


సైఫ్ అలీ ఖాన్

కొన్ని సినిమాలకు సెన్సార్ కష్టాలు తప్పనిసరి. అయితే ఇటీవలి కాలంలో ఈ కష్టాలు పెరిగాయని చెప్పొచ్చు. ముఖ్యంగా బాలీవుడ్ సినిమాలకు సెన్సార్ పరంగా ఎక్కువ సమస్యలు వస్తున్నాయి. సైఫ్ అలీ ఖాన్ హీరోగా తెరకెక్కిన 'కళాకాండీ' చిత్రానికి 72 కట్స్ సూచించింది సెన్సార్ బోర్డ్. దీంతో రివ్యూ కమిటీని ఆశ్రయించి సింగిల్ కట్‌తో సెన్సార్ సర్టిఫికెట్ తెచ్చుకోగలిగాడు సైఫ్. ఈ సందర్భంగా సైఫ్ అలీఖాన్ కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సెన్సార్ బోర్డ్‌లో రాజకీయ ప్రమేయం ఎక్కువైందని, ఇలాంటి పరిస్థితుల్లో మహాభారతంలాంటి సినిమాను తీయటం కన్నా 'బాహుబలి' లాంటి కల్పిత కథలతో సినిమాలు తీయటం బెటర్ అన్నారు. ప్రేక్షకులు కూడా సున్నితంగా వ్యవహరిస్తున్నారు. ప్రతీ విషయాన్ని మతానికి, నమ్మకాలకు ముడిపెట్టి సినిమా చూస్తున్నారు. దీంతో సెన్సార్ బోర్డ్ సభ్యులకు నిజానికి, కల్పనకు తేడా తెలియడం లేదు అని విమర్శించాడు. 'కళాకాండీ' చిత్రం జనవరి 12న విడుదల కానుంది.



వాస్తవాలకు దగ్గరగా 'మనం'

- **నిజాలు రాయడంలో ముందుండాలి: సునీత**
- **క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి పరిటాల**

అనంతపురం, జనవరి 7 (మనం న్యూస్ బ్యూరో): ప్రస్తుత పరిస్థితుల్లో కొన్ని పత్రికలు ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు కనికట్టు చేస్తున్నాయని, వాస్తవాలు ప్రజలకు తెలియడం లేదని మంత్రి పరిటాల సునీత అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నిజాలను నిర్భయంగా రాయడంలో 'మనం' ముందుండాలని కోరారు. అనంతపురం అరవిందనగర్‌లోని మంత్రి నివాసంలో మనం దినపత్రిక క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తనయుడు పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. క్యాలెండర్ అందరినీ ఆకట్టుకునేలా అద్భుతంగా తయారు చేశారని సునీత ప్రశంసించారు. మనం దినపత్రిక వాస్తవాలకు దగ్గరగా ఉంటోందని కొనియాడారు. ఇదే ఒరవడి కొనసాగించి అందరి పత్రికగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బ్యూరో ఇన్‌చార్జి వెంకటేష్, మస్తాన్ ఖాన్, రిపోర్టర్ భాస్కర్, ఫొటో గ్రాఫర్ హరి పాల్గొన్నారు.



'మనం' దినదినాభివృద్ధి చెందాలి

- **పత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి ఆదినారాయణ రెడ్డి**

కడప, జనవరి 7 (మనం న్యూస్ బ్యూరో): మనం దినపత్రిక దినదినాభివృద్ధి చెందాలని మంత్రి ఆదినారాయణరెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం ముద్దనూరులో జరిగిన కార్యక్రమంలో మంత్రి మనం దినపత్రిక క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మనం దిన పత్రిక కృషి చేయాలన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాలని సూచించారు. కలెక్టర్ బాబురావు నాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేలా 'మనం'లో కథనాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 'మనం' రీజనల్ మేనేజర్ గాంధీ, బ్రాంచి మేనేజర్ రఘురామరాజు, బ్యూరో ఇన్‌చార్జి ఎన్‌ఏ సత్తార్, సర్కులేషన్ ఇన్‌చార్జి శివనారాయణ పాల్గొన్నారు.



'మనం'కు మంచి జరగాలి

- **శుభాకాంక్షలు చెప్పిన సుజయ్ కృష్ణ**
- **క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి**

విజయనగరం, జనవరి 7 (మనం న్యూస్): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మనం దినపత్రిక రూపొందించిన కేలండర్‌ను రాష్ట్ర భూగర్భ గనులశాఖా మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు ఆవిష్కరించారు. ఆదివారం విజయనగరం జిల్లా పరిషత్ అతిథి గృహంలో మంత్రి సుజయ్ తన సహచరుల సమక్షంలో కేలండర్‌ను ఆవిష్కరిస్తూ.. కొత్త ఏడాదిలో మంచి జరగాలంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సీహెచ్ సింహాద్రి (జైరాజ్), విలేకరులు పాల్గొన్నారు.

తప్పుచేస్తే.. వదిలిపెట్టను

పర్యవేక్షణ లేకే దుర్గగుడిలో అపచారం



- ఆలయ ఈవోను బదిలీ చేశాం
- పోలవరానికి ప్రతిపక్షాల అడ్డంకులు
- పట్టిసీమపై కోర్టుకు వెళ్లారు
- ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టే యత్నం
- వర్షాలు తక్కువ పడ్డా వృద్ధి రేటు
- విద్యుత్ చార్జీలను పెంచం: చంద్రబాబు
- సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ప్రారంభం

కర్నూలు, జనవరి 7 (మనం న్యూస్ బ్యూరో): ''తప్పు చేస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తేలేదు. పర్యవేక్షణ లేకే దుర్గగుడిలో నిబంధనలకు విరుద్ధంగా పూజలు జరిగాయి. అందుకే ఈవోను బదిలీ చేశాం'' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నూలు జిల్లా ఆత్మకూరు మండలం సిద్ధాపురం గ్రామ సమీపంలో నిర్మించిన సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని ఆదివారం ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎంతో పాటు ఏపీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, శాసన మండలి చైర్మన్ ఎన్ఎండీ ఫరూక్, మంత్రులు కాలువ శ్రీనివాసులు, భూమా అఖిల ప్రియ, దేవినేని ఉమా, ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, ఎంపీలు టీజీ వెంకటేష్, బుట్టా రేణుక పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సమాజంలో ఉండేది రెండే కులాలని, డబ్బు ఉన్న కులం, డబ్బులేని కులం అన్నారు. తాను ఎప్పుడు డబ్బులేని కులం వైపు నిలబడతానని చెప్పారు. సిద్ధాపురం చెరువు ద్వారా 1922లో బ్రిటీష్ ప్రభుత్వం 100 ఎకరాల లబ్ధికి 4.9కి.మీ మేర ఆయకట్టు నిర్మించిందన్నారు. కానీ నేడు ఎత్తిపోతల పథకం ద్వారా 25వేల ఎకరాలకు లబ్ధికలిగేలా తీర్చిదిద్దామన్నారు. ఈ పథకం వల్ల 13 గ్రామాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. 2016లో 30శాతం, గతేడాది 12శాతం వర్షపాతం తక్కువగా నమోదైందన్నారు. అయినా 25.6 శాతం వృద్ధి రేటును సాధించామన్నారు. గోదావరి, కృష్ణా పుష్కరాల్లో నదీమతల్లికి నమస్కారం చేస్తూ సంవృద్ధిగా నీరు ఏపీ ఇవ్వాలని కోరుకున్నానని చంద్ర బాబు చెప్పారు. ఏడాదిలో గోదావరి నీరు కృష్ణాకు తీసుకువచ్చామన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు జరగకుండా ప్రతిపక్షాలు ఎన్నో అడ్డంకులు చేస్తూ ఇబ్బందులు పెట్టాలని చూశాయన్నారు. గోదావరి నుంచి 3వేల టీఎంసీలు ప్రతి ఏటా సముద్రంలో కలుస్తాయని చెప్పారు. మహారాష్ట్ర,



కర్ణాటకలో పెద్ద పెద్ద ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోందని, ఈ పరిస్థితుల్లో పోలవరం రాష్ట్రానికి జీవనాడి అవుతుందని చెప్పారు. విభజన చట్టంలో పోలవం చేర్చారని, కేంద్రం ఈ ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టుగా గుర్తింపు ఇచ్చిందని అన్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేయకముందు ప్రధాని నరేంద్ర మోదీతో ఏపీ గురించి చర్చించామని, పోలవరంలో ఉన్న 7 మండలాలు ఆంధ్రప్రదేశ్‌కు చెందేలా చూడాలని కోరినట్టు తెలిపారు. మీరు హామి ఇస్తే.. సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని తెలిపానన్నారు. అలాగే పట్టిసీమ రాకుండా, పట్టిసీమలో అవినీతి చోటు చేసుకుందని కొందరు కోర్టుకు వెళ్లారన్నారు. మరికొందరు తూర్పు, పశ్చిమ గోదావరి రైతాంగాన్ని రెచ్చగొట్టారని చెప్పారు. అయితే రైతులు తనపై నమ్మకంతో ఉంచి ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించారన్నారు. రైతులు లేనిదే దేశానికి ఆహారంలేదని, రైతు కంట కన్నీరు రాకూడదని, రైతు ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో రూ.24వేల కోట్లతో రైతు రుణమాఫీ చేశామని చంద్రబాబు తెలిపారు. విభజన సమస్యలు ఉన్నా.. రుణమాఫీ చేశామన్నారు. నీరు, విద్యుత్ ఉంటే ఏదైనా సాధ్యమన్నారు. సహజవనరులను కాపాడుకోవాలన్నారు. రాష్ట్రంలో 40 నదులు, 40,913 చెరువులు, 15.31లక్షల పంపుసెట్లు, 1,196 ఎత్తిపోతల పథకాలు, 59,106 చెక్ డ్యాంలు, 6.32లక్షల పంట సంజీవని కుంటలు ఉన్నాయని, వాటి ద్వారా వర్షపునీటిని నిలువ చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతోందని చెప్పారు. దేశంలో 50 లక్షల పింఛన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ట్రాన్స్‌జెండర్లకు కూడా రూ.1,500 పింఛన్ అందజేస్తున్నామన్నారు. రైతుల కష్టాలను తీర్చేందుకు చెప్పిన మాట ప్రకారం రూ.24వేల కోట్లతో రుణమాఫీ చేశామన్నారు. అలాగే రాయలసీమ రైతుల కష్టాలు తీర్చేందుకు హంద్రీనీవా, తెలుగు గంగ, గాలేరు నగరి ప్రాజెక్టులను రూపకల్పన చేసిన ఘనత దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆదే దారిలో తాము కూడా నడిచి ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం కోసం రూ.50వేల కోట్లు ఖర్చు చేశామని, ఇప్పటికే 27 ప్రాజెక్టులను పూర్తి చేసుకుంటున్నామని చెప్పారు. ఎన్టీఆర్ శంఖుస్థాపన చేసిన ప్రాజెక్టులంటిని పూర్తి చేసే అవకాశాన్ని భగవంతుడు తనకు కల్పించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ప్రపంచంలో అతిపెద్ద సోలార్ పార్క్ కర్నూలు జిల్లాలోనే ఉందన్నారు. ఈ సోలార్ విద్యుత్ ఉత్పత్తి వల్ల విద్యుత్ సమస్యలు తలెత్తవన్నారు. భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెంచబోమని స్పష్టం చేశారు. హంద్రీనీవా నీటిని అనంతపురానికి తీసుకువెళ్లడంతో వ్యవసాయ రంగంతో పాటు పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని, కియా కార్ల పరిశ్రమే ఇందుకు ఉదాహరణ అన్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా ఎర్రచందనం మన రాష్ట్రంలో విరివిగా ఉందని, అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకున్నామన్నారు. శ్రీశైల క్షేత్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కనకదుర్గ ఆలయంలో నిబంధనలు అతిక్రమించారని, తప్పు చేస్తే ఎంతటివారినైనా వదిలిపెట్టేదిలేదని అన్నారు. కొందరు సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, కులాలను, మతాలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.



చదువు పెరిగేకొద్దీ తగ్గుతున్న సంస్కారం

- **విలువలతో కూడిన విద్య అవసరం**
- **తెలంగాణ స్పీకర్ మధుసూదనాచారి**

అమరావతి, జనవరి 7 (మనం ప్రతినిధి): ప్రస్తుత తరంలో చదువు పెరిగేకొద్దీ సంస్కారం తగ్గుతోందని, విలువలతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఉందని తెలంగాణ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో ఆదివారం జరిగిన నందిని ఐఏఎస్ అకాడమీ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో విద్యాభివృద్ధికి విజయవాడ ప్రధాన భూమిక పోషించిందన్నారు. ఏ వృత్తిలో ఉన్నా విలువలతో ముందుకు సాగాలని మధుసూదనాచారి సూచించారు. ప్రస్తుతం మనుషులు, మనసులు కల్తీ అవుతున్నాయని, నేటి తరం పిల్లలకు విలువలతో కూడిన విద్యనందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. గతంలో సరైన సదుపాయాలు లేకపోయినా ఆత్మవిశ్వాసంతో జీవితంలో విజయం సాధించే వాళ్లమని అన్నారు. సీఎం చంద్రబాబు, కేసీఆర్‌లు ఏ కోచింగ్ సెంటర్లలో చదువుకోలేదని, వారు నేడు తెలుగు ప్రాంతాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తాను గ్రూప్-1కి ఎంపిక కాకపోవడంతో రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. అకాడమీలో ఉన్న అభ్యర్థులంతా పట్టుదలతో సివిల్ సర్వీసుల్లో విజయం సాధించి, తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి సహకరించాలని ఆయన సూచించారు.

దేశవ్యాప్తంగా ఒకే రేషన్ విధానానికి కృషి

- **ఆలిండియా రేషన్ డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడిగా ఎంపికైన మాధవరావు**

అమరావతి, జనవరి 7 (మనం ప్రతినిధి): ఆలిండియా రేషన్ డీలర్ల సంక్షేమ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా దివి లీలా మాధవరావు ఎంపి కయ్యారు. ఆయన ప్రస్తుతం ఏపీ రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు. అలాగే ఆలిండియా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.చిట్టిరాజు ఎంపికయ్యారు. వీరి ఎంపికపై ఆలిండియా రేషన్ డీలర్స్ సంఘ ప్రధా న కార్యదర్శి బిస్వంబర్ బసు ప్రకటన విడుదల చేశారు. ఈ సంద ర్భంగా మాధవరావు ఆదివారం మీడియాతో మాట్లాడారు. డీలర్ల సమ స్యల పరిష్కారానికి అహర్నిశలు, శక్తివంచన లేకుండా పోరాటం చేస్తా మని అన్నారు. దేశవ్యాప్తంగా ఒకే రేషన్ విధానం ఉండే విధంగా, కనీ సవేతన చట్టం ప్రకారం డీలర్లకు ఆదాయం కల్పించేలా కృషి చేస్తానని అన్నారు. ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు ఆలిండియా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పుష్పరాజ్ దేశ్‌ముఖ్, ప్రధాన కార్యదర్శి బసుకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో ఆలిండియా రేషన్ డీలర్ల సమాఖ్య సమావేశం రాష్ట్రంలో భారీ ఎత్తున నిర్వహిస్తామన్నారు.

దుర్గ గుడి ఈవోగా అనూరాధ

- **బాధ్యతలు స్వీకరించిన దేవాదాయ కమిషనర్**

విజయవాడ, జనవరి 7: విజయవాడ దుర్గగుడి ఇన్‌చార్జి ఈవోగా దేవాదాయ శాఖ కమిషనర్ అనూరాధ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆలయంలో తాంత్రిక పూజల వ్యవహారంలో ఈవో సూర్యకుమారిని ప్రభుత్వం విధులు నుంచి తొలగించింది. ఆమెను సాధారణ పరిపాలన శాఖ (జీడీఏ)కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. దీంతో ఆమె స్థానంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనూరాధకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆదివారం ఆమె ఆలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు అర్చకులు ప్రసాదాలు అందజేసి.. ఆశీర్వదించారు.

సూరంపల్లి బాధితులకు సీఎం పరామర్శ

- **మృతులకు 11 లక్షల ఎక్స్‌గ్రేషియా**
- **నాలుగుకు చేరిన మృతుల సంఖ్య**

అమరావతి, జనవరి 7 (మనం ప్రతినిధి): విజయవాడ సమీపంలో సూరంపల్లి పారిశ్రామిక వాడలో జరిగిన ప్రమాద బాధితులను సీఎం చంద్రబాబు ఆదివారం పరామర్శించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.11 లక్షల పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. అందుకయ్యే ఖర్చునూ ప్రభుత్వమే భరిస్తుంద న్నారు. శనివారం రాత్రి గన్నవరంలోని సూరంపల్లిలోని జీఎస్ అల్లాయిస్ క్యాస్టింగ్ లిమిటెడ్ యూనిట్-2లో బాయిలర్ పేలి ద్రవ రూపంలో ఉన్న లోహం కార్మికులపై పడింది. ఈ ఘటనలో అక్కడికక్కడే ఇద్దరు కార్మికులు మృతి చెందగా.. మరో ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులకు వెంటనే వియవాడలోని ఆంధ్ర హాస్పిటల్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరో ఇద్దరు మృతిచెందారు. మృతుల్లో శివశంకర్, ముజాహిద్ అహ్మద్, సత్యనారాయణ, అబ్దుల్ ముబారక్ అలీ ఉన్నారు.



ఈ ఘటన వివరాలు తెలుసుకున్న సీఎం చంద్రబాబు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆంధ్రహాస్పటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. చనిపోయిన వారికి కంపెనీ తరపున రూ.6 లక్షలు, ప్రభుత్వం తరపున రూ.5 లక్షలు చొప్పున మొత్తం 11 లక్షల పరిహారం చెల్లిస్తామన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు, గాయాలైన వారికి రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియాను అందిస్తున్నట్లు సీఎం ప్రకటించారు.

ఏడాదిలో ఎయిమ్స్ తాత్కాలిక భవనాలు

- **విజయవాడలో 'సిద్ధార్థ' ప్రాంగణంలో నిర్మాణం**
- **శంకుస్థాపన చేసిన కామినేని, స్పీకర్ కోడెల**



అమరావతి, జనవరి 7 (మనం ప్రతినిధి): రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రకు కేటాయించిన కేంద్ర వైద్య విద్యా సంస్థ ఎయిమ్స్‌కు తాత్కాలిక భవనాలను ఏడాదిలో పూర్తి చేయనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో ఎయిమ్స్ తరగతి గదులు, పరిపాలన భవన నిర్మాణ పనులకు ఆదివారం మంత్రి కామినేని, స్పీకర్ కోడెల శివప్రసాదరావు కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కామినేని మట్లాడుతూ.. రూ.6 కోట్లతో వేగంగా నిర్మాణ పనులు పూర్తి చేస్తామని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఈ తాత్కాలిక భవనాల్లో తరగతులు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తొలిగా 50మంది వైద్య విద్యార్థుల కోసం సౌకర్యాలను కల్పించనున్నామని ఆయన తెలిపారు. సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో చదివే విద్యార్థులు హాస్టల్ నుంచి కళాశాలకు వచ్చేందుకు ప్రత్యేక బస్సును అందుబాటులోకి తీసుకొస్తున్నామని వెల్లడించారు. అలాగే రూ.150 కోట్లతో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌ను త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం స్పీకర్ కోడెల మాట్లాడుతూ.. వైద్య విద్యార్థుల కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.



సీఎం నై.. తమ్ముళ్లు సై

కోడి పందేల నిర్వహణకు మొగ్గు
అడ్డుకునేందుకు పోలీసులు చర్యలు

ఏలూరు, జనవరి 7 (మనం న్యూస్ బ్యూరో): గోదావరి జిల్లాల్లో కొత్త ఏడాది కోడి పందేలతోనే ప్రారంభమవుతుంది. సంక్రాంతి పండగ సందర్భంగా పుంజులను బరిలో దింపి, లక్షల్లో పందేలు కాస్తుంటారు. పనిలోపనిగా పేకాట కూడా ఆడుతుంటారు. సుదీర్ఘకాలంగా సాంప్రదాయం పేరిట ఈ తంతు కొనసాగుతోంది. కాగా కోడిపందేలు నిర్వహించరాదంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా ప్రతినిధులకు హుకుం జారీ చేశారు. వీటిని నిర్వ హించకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులకు ఉత్త ర్వులు జారీ చేసింది. హైకోర్టు కూడా నిర్వహణకు అనుమతి ఇవ్వ లేదు. ఎట్టిపరిస్థితుల్లోనూ కోడి పందేలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని ఏపీ సర్కార్‌ను ఆదేశించింది. అడ్డుకునేందుకు అధికా రులు, పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా కొందరు ప్రజా ప్రతినిధులు మాత్రం పందేలను తప్పక నిర్వహించాలనే కుతూహలంతో ఉన్నారు. అధికార పార్టీ నాయకులతో పాటు ఇతర పార్టీల నేతలూ ఉత్సాహంగా ఉన్నారు. దీంతో పందేలు జరుగు తాయా లేక అధికారులు అడ్డుకుంటారా అన్నదానిపై ఉత్కంఠ ఏర్ప డింది. సంక్రాంతి సందర్భంగా కోట్లల్లో పందేలు కాస్తుంటారు. కొందరు కోటీశ్వరులైతే, మరికొందరు బికార్లు అవుతారు.

డీసీఐ ప్రైవేటీకరణ వద్దు

- **ప్రజా బ్యాలెట్‌కు విశేష స్పందన**
- **ఏకమైన కార్మిక సంఘాలు.. పోరు ఉధృతం**

విశాఖపట్నం, జనవరి 7 (మనం ప్రతినిధి): విశాఖపట్నం కేంద్రంగా నడుస్తున్న కేంద్ర ప్రభుత్వం సంస్థ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ)ను కాపాడుకుందామంటూ కార్మిక సంఘాలన్నీ ఏకమయ్యాయి. డీసీఐ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని పార్టీలకు అనుబంధంగా ఉన్న సంఘాలు అఖిలపక్షంగా ఏర్పడి పోరాడుతున్నాయి. డీసీఐలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులంతా కలిసి వారి ఉద్యమానికి ప్రజల మద్దతు కూడగట్టేందుకు ప్రజా బ్యాలెట్ నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా వివిధ కూడళ్ల వద్ద ఈ కార్యక్రమం జోరుగా సాగుతోంది. ప్రైవేటీకరణ ఒక్క డీసీఐతోనే ఆగదని, మిగిలిన ప్రభుత్వ రంగ సంస్థలకు కూడా విస్తరిస్తుందని ఆయా కార్మిక సంఘాల నేతలు ప్రచారం చేస్తూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. వీరికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కార్మిక సంఘాలకు తామూ మద్దతుగా నిలుస్తామని ప్రజలు చెబుతున్నారు.

ఉద్యోగి ఆత్మహత్యతో కదిలిన నాయకులు

కేంద్ర ప్రభుత్వం డీసీఐని ప్రైవేటీకరిం చబోతున్నట్లు ప్రకటించడంతో దాదాపు రెండు నెలల నుంచి ఉద్యోగులు, కార్మిక సంఘాలు ఆందోళనను ప్రారంభిచాయి. ఆ సమయంలో విజయనగరానికి చెందిన ఒక ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడడంతో ఒక్కసారిగా ఉద్యమం వేడెక్కింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ విశాఖ వచ్చి డీసీఐ ఉద్యోగుల ధర్నాలో పాల్గొనడంతో మిగిలిన పార్టీలూ ముందుకు కదిలాయి. వైఎస్సార్ కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఈ అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావించడంతోపాటు ప్రధాని మోదీకి వినతిపత్రం అందించారు. లాభాల్లో ఉన్న డీసీఐని ప్రైవేటీకరణ చేయవద్దని కోరారు. ఆ తర్వాత కేంద్రమంత్రి సుజనాచౌదరి నేతృత్వంలో టీడీపీ ప్రతినిధి బృందం ఈ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకువెళ్లింది. డీసీఐ ప్రైవేటీకరణ ఆపాలని కోరింది. వామపక్షాలు ఉద్యోగులకు అండగా నిలిచి ఉద్యమాన్ని తారస్థాయి చేర్చాయి. క్రమంగా సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీ అనుబంధ కార్మిక సంఘాలు ఈ ఉద్యమంలో పాల్గొంటున్నాయి.




టూరిజం అభివృద్ధికి పెద్ద పీట

న్యూఢిల్లీ: వచ్చే బడ్జెట్‌లో రవాణా, పర్యాటక రంగాల మీద పన్నులు తగ్గించి, ఈ 12.60 లక్షల కోట్ల రూపాయల రంగాలకు మరిన్ని ప్రోత్సాహకాలు అందించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ రంగాల అభివృద్ధి వల్ల మరిన్ని ఉద్యోగాలను సృష్టించడానికి వీలవుతుందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. ప్రపంచంలో రెండవ అతి పెద్ద జనాభా దేశమైన భారత్‌లో పర్యాటక రంగ అభివృద్ధికి కూడా ఇది సహకరిస్తుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆదాయాలు పెరుగుతూ, నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉన్న భారతదేశంలో జీవనశైలులు చాలా వేగంగా మారిపోతున్న దశలో దేశీయ పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందడానికి అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా ఉన్నాయని పర్యాటక రంగ నిపుణులు కూడా భావిస్తున్నారు. దేశంలోని అనేక కొత్త రూట్లలో కూడా గత విమానయానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ఫలితంగా విమానయానం కూడా ఊపందుకుంది. సెప్టెంబర్‌తో ముగిసే ఆరు నెలల కాలంలో దేశంలో పర్యాటక రంగం పది శాతానికి పైగా వృద్ధి చెందిందని అంచనా. ఇది అంతకు ముందు ఏడాదితో పోలిస్తే రెండు శాతం ఎక్కువ.



ప్రస్తుతం పర్యాటక రంగం నాలుగు కోట్ల మందికి పైగా ఉపాధి కల్పిస్తోంది. వచ్చే దశాబ్దంలో ఇది మరో కోటి మందికి పెరగగలదని అధికారులు ఆశిస్తున్నారు. ఆర్థిక శాఖలోని ఓ ఉన్నతాధికారి చెప్పినదాని ప్రకారం, పర్యాటక రంగంలో పెట్టుబడులను పెంపొందించే విధంగా కేంద్రం ఈ బడ్జెట్‌లో అనేక ప్రోత్సాహకాలను ప్రకటించబోతోంది. హోటల్ టారిఫ్స్ మీద 28 శాతం వరకూ పన్నులు తగ్గించాలని, పెట్టుబడి పెట్టేవారిని ఆకట్టుకునేందుకు మరిన్ని పథకాలతో ముందుకు రావాలని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ భావిస్తున్నట్టు ఆ అధికారి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం గనుక ఈ కొత్త రాయితీలను, పన్ను తగ్గింపులను ప్రకటించే పక్షంలో ఇండిగో, జెట్ ఎయిర్‌వేస్, అగ్రశ్రేణి హోటళ్లు బాగా లబ్ధి పొందుతాయని ఆశిస్తున్నారు. అంతేకాక, కాక్స్ అండ్ కింగ్స్, థామస్ కుక్ వంటి టూర్ ఆపరేటర్లు కూడా లబ్ధి పొందే అవకాశం ఉంది.





భారతదేశంలో పర్యాటకులు హోటల్ రూమ్స్ మీద ఎంత లేదన్నా 30 శాతం వరకూ పన్నులు చెల్లించాల్సి వస్తోంది. సింగపూర్, థాయ్‌లాండ్, ఇండొనీషియాలలో ఇది 10 శాతం మాత్రమే. పర్యాటక రంగంలో ప్రాథమిక సదుపాయాల కల్పనకు కేంద్రం భారీగా కేటాయింపులు జరపబోతోందని కూడా ఆర్థిక శాఖాధికారి చెప్పారు. కొత్త హోటళ్ల మీద పెట్టుబడులు పెట్టే వారికి ఇస్తున్న పన్ను మినహాయింపులను మరింత పెంచే అవకాశం కూడా ఉందని ఆయన తెలియజేశారు. కార్పొరేట్ రంగ లాభాల మీద పన్నులు తగ్గించే అవకాశం ఉందని, హోటళ్ల నిర్మాణాల మీద పన్ను ప్రోత్సాహకాలు ఇవ్వవచ్చని, కొత్త టూరిస్ట్ రైళ్లకు, పర్యాటక ప్రదేశాలకు వేసే కొత్త రోడ్లకు మరిన్ని నిధులు కేటాయించే అవకాశం ఉందని, కొత్త రూట్లలో వెళ్లే విమానాలకు కూడా ప్రోత్సాహకాలు ఇచ్చే వీలుందని ఆ అధికారి వివరించారు.

మొండి బకాయిల్లో ఎస్‌బీఐ టాప్!


న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బ్యాంకుల్లో వంద కోట్ల రూపాయలకు పైగా మొండి బకాయిలున్న ఖాతాలు 1,463కు మించే ఉన్నాయని ఆర్థిక శాఖ తెలియజేసింది. ఇందులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 265 ఖాతాలతో మొదటి స్థానంలో ఉన్నట్టు అది తన సెప్టెంబర్ నివేదికలో తెలిపింది. ఇది 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని ఖాతాలను అధ్యయనం చేసి ఈ వివరాలు అందజేసింది. ఎస్‌బీఐలోని 265 ఖాతాల్లో ఒక్కో ఖాతాలో వంద కోట్లకు పైగా మొండి బకాయిలు ఉన్నాయని, వీటి మొత్తం విలువ 77,538 కోట్ల రూపాయలు పైమాటేనని అది తెలిపింది. ఆ తర్వాతి స్థానంలో 143 నిరర్థక ఆస్తుల ఖాతాలతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ నిలిచి ఉంది. ఈ ఖాతాల మొత్తం విలువ 45,973 కోట్ల రూపాయల పైచిలుకే. మూడవ స్థానంలో ఉన్న కెనరా బ్యాంకులో కూడా వంద కోట్ల రూపాయల మేరకు మొండి బకాయిలు ఉన్న ఖాతాలు అత్యధిక సంఖ్యలోనే ఉన్నాయి. ఇక యూనియన్ బ్యాంకులో 79, ఓరియంటల్ బ్యాంక్ 68, యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్ 62 మొండి బకాయిల ఖాతాలతో ఆ తర్వాతి స్థానాలతో ఉన్నాయని ఆర్థిక శాఖ తెలియజేసింది.



మొత్తం మీద ఈ ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికం ముగిసేనాటికి బ్యాంకుల్లోని నిరర్థక ఆస్తుల విలువ 7.34 లక్షల కోట్ల రూపాయలని తేలింది. కాగా, 5,000 కోట్ల రూపాయలకు పైగా మొండి బకాయిలు ఉన్న 12 ఖాతాల విషయంలో కొన్ని బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ (2016) చట్టం కింద ఈ ఖాతాలపై చర్యలు తీసుకోవాలని అది సూచించింది. నిరర్థక ఆస్తుల ఖాతాలు పెరగడం వల్ల ప్రభుత్వ బ్యాంకుల రుణ సామర్థ్యం బాగా తగ్గిపోయింది. ఈ నిరర్థక ఆస్తులను భర్తీ చేయడంతోనే వాటికి సరిపోతోంది. ఇటువంటి మొండి బకాయిలు లేదా నిరర్థక ఆస్తుల ఖాతాలున్న బ్యాంకులను పటిష్ఠం చేయడానికి కేంద్ర ప్రభుత్వం 2.12 లక్షల కోట్ల రూపాయలతో రీక్యాపిటలైజేషన్ ప్లాన్‌ను రూపొందించింది. 2018 మార్చి లోపల ఇందులో 80,000 కోట్ల రూపాయలు విడుదల చేయడానికి పార్లమెంట్ ఆమోదం పొందడం కూడా జరిగింది.

డిస్కౌంట్ల ఉచ్చులో చిక్కుకోవద్దు!

న్యూఢిల్లీ: వ్యాపార రంగాల్లో ఉగాది, దసరా, దీపావళి, క్రిస్‌మస్, సంక్రాంతి వంటి పండగ సీజన్లలో డిస్కౌంట్ సేల్ ఆఫర్లనేవి సర్వసాధారణం. ఈ విషయంలో ఇ-మార్కెట్ (ఆన్‌లైన్ షాపింగ్ కంపెనీలు) అసలు మార్కెట్ కంటే ముందుంటుంది. 40 శాతం, 60 శాతం డిస్కౌంట్లు అని ఆర్భాటంగా జరిగే ప్రచారాల్లో నిజమెంత, అమ్మే వస్తువుల్లో నాణ్యత ఎంత అనేది పరిశీలించాలి. సాధారణంగా పండగ సీజన్లలో కొత్త ఉత్పత్తులతో పాటే నిల్వ సరుకుకు డిస్కౌంట్ సేల్ పేరుతో అమ్మే ప్రయత్నాలు జరుగుతుంటాయి. నాణ్యతలేని వస్తువుల్ని కూడా అమ్మేసి లాభపడుతుంటాయి. ఇటీవల కాలంలో ప్రముఖ ఇ-కామర్స్ కంపెనీలు డిస్కౌంట్ల ఆఫర్ల ప్రకటనల కోసం కోట్లాది రూపాయల్ని ఖర్చు పెడుతున్నాయంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



ఇ-కామర్స్‌తో కంపెనీలకు లాభమేంటి?

ఆన్‌లైన్ షాపింగ్ అంటే ఉత్పత్తిదారుకి, వినియోగదారుకి మధ్య మధ్యవర్తిత్వం నెరిపే విధానం. ఉత్పత్తి కంపెనీల నుంచి ఆయా వస్తువుల్ని వినియోగదారుకి అమ్మడం, చేర్చడం చేసినందుకుగాను సదరు ఆన్‌లైన్ కంపెనీలు కమీషన్ తీసుకుంటాయి. ఆన్‌లైన్ మార్కెట్ విస్తరించిన నేపథ్యంలో ఇ షాపింగ్ వెబ్‌సైట్లు రోజువారీగా లక్షలాది రూపాయల లాభాన్ని ఆర్జిస్తున్నాయి. అయితే వినియోగదారుకి జవాబుదారీగా ఉండాల్సింది ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్లే. అందుకే గ్యారంటీని ఇవ్వగలిగే కంపెనీలేమిటో అవగాహనకు వచ్చిన తర్వాతే ఆన్‌లైన్ షాపింగ్‌వైపు మొగ్గు చూపడం మంచిది.

కేవైసీ గురించి తెలుసా?!



ముంబై: ఇటీవల కాలంలో బ్యాంకింగ్ రంగం లో మనం తరచూ వినేమాట.. కేవైసీ. బ్యాంక్‌లోని మన ఖాతాతో ముడిపడి ఉన్న ఫోన్ నెంబర్, ఇ-మెయిల్‌కు 'మీ కేవైసీని వీలైనంత తొందరగా పూర్తి చేయండి' అనే సందేశాలు మనకు వస్తూ ఉంటాయి. అలాగే ఇప్పుడు కొత్తగా బ్యాంకుల్లో ఖాతా ప్రారంభించాలన్నా.. మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయాలన్నా.. బీమా పాలసీలు తీసుకోవాలన్నా.. 'మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి (కేవైసీ)' అనే నిబంధనలను తప్పకుండా పూర్తి చేయాల్సి ఉంటుంది.

బ్యాంకింగ్ సంస్థలు ఖాతాదారుకి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవడమే 'కేవైసీ' ముఖ్య ఉద్దేశం. దీనివల్ల ఆయా సంస్థలకుగానీ, ఖాతాదారుకిగానీ సమకూరే ప్రయోజనమేంటి? ఎందుకు కచ్చితంగా ఈ నిబంధన ప్రతి ఖాతాదారు పాటించాలి?

సౌలభ్యం కోసం.. తప్పనిసరి

ఇప్పటికే తీసుకున్న బ్యాంకు ఖాతాలు, బీమా పాలసీల్లో ఈ నిబంధనలు పాటించని వారు ఎందరో ఉన్నారు. చిరునామాలు సరిగ్గా లేకపోవడం, ఫోన్ నెంబర్లు, ఇ-మెయిల్ మారినా వాటి గురించి సంబంధిత సంస్థలకు చెప్పక పోవడంతో బ్యాంకులు, బీమా సంస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఆగస్టు 1, 2016 నుంచి అమల్లోకి వచ్చిన ఈ విధానంతో ఈ సీకేవైసీఆర్‌లో మీ వివరాలు నమోదు చేస్తే మీకు ప్రత్యేక సంఖ్య కేటాయిస్తారు. దీని ఆధారంగా మీరు బ్యాంకు ఖాతాలు ప్రారంభించడం, మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయడం, కొత్త పాలసీలు తీసుకోవడం తదితర ఆర్థిక సేవలను సులభంగా పొందవచ్చు. కొత్త కేవైసీ ఫారంలో 'పాన్' తప్పనిసరిగా పేర్కొనాలి.

సిప్ పథకాలంటే ఏమిటి?

ముంబై: సంప్రదాయ పొదుపు పథకాలు అంటే మొదటగా గుర్తొచ్చేవి ఫిక్స్‌డ్, రికరింగ్ డిపాజిట్లు. పెద్దగా వడ్డీ లెక్కలు తెలియకపోయినా పొదుపు చేయాలనే ఆలోచన ఉన్నవారికి ఇవి బాగా పరిచయమైనవే. ఇంచుమించు ఈ పథకాలను పోలిన మరో పొదుపు పథకమే 'సిప్'. ఇటీవల కాలంలో సిప్ పథకాల్లో పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య అన్ని వర్గాల్లోనూ పెరుగుతుంది. రికరింగ్, ఫిక్స్‌డ్ పథకాలకు సమాంతరంగా 'సిప్' పథకాలూ అంతే ఆదరణ పొందుతున్నాయి. అయితే సిప్‌లలో పెట్టుబడి పెట్టడం, అందుకు తగ్గ లాభాలు పొందడం అంత తేలికైన విషయం కాదు. వాటిపై సరైన అవగాహన ఉండాలి. అప్పుడే సిప్‌లతో లాభసాటి అంటున్నారు ఆర్థిక నిపుణులు. అసలు 'సిప్' పథకాలంటే ఏమిటి? వాటిని ఎలా ప్రారంభించాలి?

ప్రాచుర్యంలో ఉన్న పొదుపు పథకాల్లో మాత్రమే ఎక్కువ మంది పెట్టుబడి పెడుతుంటారు. కొత్తగా వచ్చే పథకాలు, షేర్ ఆధారిత డిపాజిట్స్ వంటి వాటిల్లోకి తొంగి చూడాలంటే కొంతమంది భయపడతారు. కానీ, సంప్రదాయ పథకాల్లో వచ్చే వడ్డీ కంటే కాస్తంత మెరుగ్గా, పెట్టిన పెట్టుబడికి వచ్చే రాబడులూ వేగవంతం కావాలనే ఆలోచన చేసేవారికి కాస్తంత అనుకూలమైనవి సిప్ పథకాలని చెప్పొచ్చు. అయితే అందుకు తగ్గ అవగాహన కావాలి. ఒకవేళ నష్టం వచ్చినా భరించగలిగే శక్తి ఉండాలి.

సిప్ అంటే?: సిప్ అంటే సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్. వీటిని ప్రధానంగా మ్యూచువల్ ఫండ్ సంస్థలు అందిస్తాయి. సిప్ పథకాలన్నీ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా అసోసియేషన్ (యాంఫి) నియంత్రణలో ఉంటాయి. ఒకరకంగా చెప్పాలంటే సిప్ పథకమంటే కొంత రిస్క్ ఉంటుంది. అలాగని పెట్టే పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఏమీ ఉండదు. షేర్లు, బంగారం వంటి సాధనాల్లో ఈ సిప్‌ల ద్వారా ఫండ్ సంస్థలు ఇన్వెస్ట్ చేస్తుంటాయి.

పెట్టుబడి ఎలా పెట్టాలి?: సిప్‌లలో కూడా నెలకి కొంత చొప్పున ఇన్వెస్ట్ చేయొచ్చు. ఆర్‌డీకి, వీటికీ ఉన్న తేడా ఏంటంటే.. సిప్‌లలో మనం నెల నెలా కట్టే డబ్బుకి సరిపడా.. ఫండ్ సంస్థలు యూనిట్లు కేటాయిస్తాయి. ఆయా ఫండ్స్ నికర అసెట్ విలువ (ఎన్ఏవీ-నెట్ ఎస్సెట్ వాల్యూ) ను బట్టి మనకు లభించే యూనిట్ల సంఖ్య ఆధారపడి ఉంటుంది. ఆయా షేర్లు, బంగారం రేట్లలో హెచ్చు తగ్గులను బట్టి ఫండ్ నెట్ ఎస్సెట్ వాల్యూ సిప్ విధానంలో ఎన్ఏవీ తక్కువగా ఉన్నప్పుడు ఎక్కువ యూనిట్లు, అలాగే ఎన్ఏవీ ఎక్కువగా ఉన్నప్పుడు తక్కువ యూనిట్లు చేతికి వస్తాయి. అయితే, సిప్‌లలో నిర్దిష్టంగా ఇంత రాబడి వస్తుందని ఉండదు. కొన్ని సందర్భాల్లో లాభాలు తగ్గనూ వచ్చు.



కాలపరిమితి: జాతీయ బ్యాంకులతో కొన్ని మ్యూచ్‌వల్ ఫండ్ కంపెనీల్లో సిప్ పథకాలు ప్రారంభించవచ్చు. రోజువారీ చెల్లింపులు మొదలుకొని, వీక్లీ, నెలవారీ, మూడునెలలు, ఏడాది, మూడేళ్ళు, ఐదేళ్ళు కాలపరిమితిన చెల్లింపులు ఉంటాయి. సిప్‌లో పెట్టుబడి పెట్టిన డబ్బును ప్రధానంగా ఆయా కంపెనీలు షేర్ మార్కెట్, బంగారం కొనుగోలు వంటి ఇతర లాభసాటి రంగాల్లో యూనిట్లుగా పెట్టుబడి పెట్టడం, కారణంగా వాటిపై వచ్చే రాబడి ఫిక్స్‌డ్, రికరింగ్ డిపాజిట్స్ కంటే మెరుగ్గా ఉండే అవకాశం ఉంది. ఫిక్స్‌డ్, రికరింగ్ సేవింగ్స్ కంటే ఎక్కువ అంటే సాలీనా తొమ్మిది శాతం కంటే 12 నుంచి 15 శాతం వరకూ గ్యారంటీగా లాభాలు రావొచ్చు. ఒక్కొక్కసారి ఇంతకంటే ఊహించని లాభాలు పెరగొచ్చు. అలాగే షేర్‌మార్కెట్, బంగారం, డాలర్ ధరలు పడిపోతే, కనీస రాబడి ఉండక పోవచ్చు. అందుకు సిద్ధపడాలి. యూనిట్లు మెరుగ్గా ఉన్నప్పుడు లాభసాటిగా అమ్ముకోవచ్చు.

సరికొత్త డిస్కవర్ బైక్

ముంబై: దేశీయంగా దిగ్గజ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో తమ డిస్కవర్ శ్రేణి నుంచి విపణిలోకి సరికొత్త డిస్కవర్ 110సీసీ బైకును లాంచ్ చేయడానికి ఏర్పాట్లు సిద్ధం చేసుకుంది. తాజాగా అందిన రిపోర్ట్స్ ప్రకారం, ఈ ఏడాది విపణిలోకి విడుదల చేయనున్న 2018 డామినర్ 400, అవెంజర్ సిరీస్ బైకులతో పాటు డిస్కవర్ సిరీస్ నుండి సరికొత్త 110సీసీ కెపాసిటీ గల బైకును విడుదల చేయనుంది.

డిస్కవర్ 110 బైకు పూర్తి స్థాయిలో విడుదలయితే డిస్కవర్ సిరీస్‌లో రెండవ బైకుగా, కంపెనీ కమ్యూటర్ మోటార్ సైకిళ్ల జాబితాలో ఆరవ మోడల్‌గా నిలవనుంది. ఈ సరికొత్త డిస్కవర్ 110 బైకు డిస్కవర్ 125. ప్లాటినా 100 మధ్య స్థానాన్ని భర్తీ చేస్తుంది. డిస్కవర్ 110 చూడటానికి 125 బైకునే పోలి ఉంటుంది. 2018 వెర్షన్‌లో వచ్చే అవకాశం ఉన్న డిస్కవర్ 125, నూతన డిస్కవర్ 110 రెండింటిలో మ్యాట్ బ్లాక్ అల్లాయ్ వీల్స్, డిజిటల్ అనలాగ్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, బ్లాక్ కలర్ ఫినిషింగ్ గల ఇంజన్, సిల్వర్ సైడ్ ప్యానల్స్, క్రోమ్ మఫ్లర్, సరికొత్త బాడీ గ్రాఫిక్స్‌తో రానున్నాయి.

తక్కువ ఇంజన్ కెపాసిటీతో వస్తున్న డిస్కవర్ 110 బైకు కమ్యూటర్ మోటార్ సైకిల్ కాబట్టి. బజాజ్ ఇందులో ఎలాంటి అదనపు ఫీచర్లనూ అందివ్వడం లేదు. అయినప్పటికీ, ఎలక్ట్రిక్ ఇంజన్ స్టార్, హ్యాండిల్ బార్ చివర్లో అదనపు బరువులున్నాయి. ముందు వెనుక రెండు చక్రాలకు డ్రమ్ బ్రేకులే రానున్నాయి. సస్పెన్షన్ కోసం డ్యూయల్ ఫ్రంట్ ఫోర్క్స్, వెనుక వైపున గ్యాస్‌తో నింపిన డ్యూయల్ షాక్ అబ్జార్బర్లు ఉన్నాయి. అయితే, 2018 డిస్కవర్ 125లో మాత్రం ఫ్రంట్ డిస్క్ బ్రేక్ వస్తోంది.



బజాజ్ డిస్కవర్ 110 బైకులో సాంకేతికంగా 110 సీసీ కెపాసిటీ గల గాలితో చల్లబడే డిటిఎస్-ఐ ఇంజన్ కలదు. 4-స్పీడ్ గేర్‌బాక్స్ అనుసంధానంతో వచ్చే ఇది గరిష్ఠంగా 8.5బిహెచ్‌పి పవర్, 9.5 ఎన్ఎమ్ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. బజాజ్ డిస్కవర్ 110 కమ్యూటర్ మోటార్ సైకిల్ రూ. 50,500 ల ఎక్స్-షోరూమ్ ధరతో విడుదలయ్యే అవకాశం ఉంది. డిస్కవర్ 125 బైకులోనే 125సీసీ ఇంజన్ స్థానంలో 110సీసీ ఇంజన్, పెద్ద టైర్ల స్థానంలో కాస్త చిన్న టైర్లను అందివ్వడం మినహాయిస్తే ఎలాంటి మార్పులూ ఉండవు.

సరికొత్త డిస్కవర్ 110 బైకుతో పాటు కొత్త తరం డామినర్ 400, అవెంజర్ సిరీస్ బైకులను ప్రవేశపెట్టనుంది. 2018 డామినర్ 400 నూతన కలర్ ఆప్షన్స్‌తో వస్తుంటే, అవెంజర్ సిరీస్‌లో 220, 150 బైకుల్లో డిజైన్, ఫీచర్ల పరంగా అప్‌డేట్స్ చోటు చేసుకోనున్నాయి.

ఎయిర్ ఇండియాకు టైమివ్వండి!


పెట్టుబడుల ఉపసంహరణ ఇప్పుడే వద్దు...

న్యూఢిల్లీ: ఎయిరిండియాలో పెట్టుబడులు ఉపసంహరించడానికి ఇది సమయం కాదని, ఇది నిలదొక్కుకోవడానికి కనీసం ఐదు సంవత్సరాల గడువు ఇవ్వాలని, దాని రుణాలను మాఫీ చేయాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయబోతున్నట్టు తెలిసింది. దీని పునరుజ్జీవ పథకం కింద దీనిలో పెట్టుబడులు ఉపసంహరించదలచుకోవడం, దీనిలో ఈక్విటీలను తీసుకోవడం అనేది అరకొర చర్యలు మాత్రమేనని, దీని వల్ల దీని ఆర్థిక, నిర్వహణ సామర్థ్యం మరింతగా దెబ్బ తినే ప్రమాదం ఉందని, ఇటువంటి చర్యల వల్లే ఈ సంస్థ భారీ వడ్డీలకు రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని ఈ సంఘం తెలిపినట్టు తెలిసింది. రవాణా, పర్యాటకం, సాంస్కృతిక వ్యవహారాలపై నియమించిన ఈ పార్లమెంటరీ స్థాయీ సంఘం ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునస్సమీక్షించుకోవాలని కోరింది. దేశానికి గర్వకారణంగా ఉన్న ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపసంహరణకు మరో ప్రత్యామ్నాయాన్ని అన్వేషించాల్సిన అవసరం ఉందని కూడా అది సూచించింది.



దేశ, విదేశాల్లో ఎప్పుడు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా, సామాజిక, రాజకీయ సమస్యలు తలెత్తినా ఎయిరిండియా వెంటనే నడుం బిగించి ప్రభుత్వాన్ని ఆదుకున్న విషయాన్ని ఈ సంఘం ప్రత్యేకంగా గుర్తు చేసింది. కేవలం వాణిజ్య, వ్యాపార పరంగా మాత్రమే ఎయిరిండియా పనితీరును మదింపు చేయడం న్యాయం కాదని అది స్పష్టం చేసింది. ఎయిరిండియాకు సంబంధించిన ప్రతిపాదిత పెట్టుబడుల ఉపసంహరణపై ఈ సంఘం అధ్యయనం చేసింది. అది తన తాత్కాలిక ముసాయిదా నివేదికను ప్రభుత్వానికి అందజేసినట్టు తెలిసింది. 2012-2022 సంవత్సరాలకు ఉద్దేశించిన పునరుజ్జీవన పథకంతో ఎయిరిండియా కొద్దిగా తేరుకుందని, ఇది రుణ సమస్యల నుంచి త్వరలో బయటపడబోతోందన్న ఆశలు చిగురించాయని, ఈ దశలో దీని నుంచి పెట్టుబడులను ఉపసంహరించాలనుకోవడం భావ్యం కాదని సంఘం తెలిపింది.

ఈ పునరుజ్జీవన పథకం గడువు ముగిసిన తర్వాత ప్రభుత్వం దీని పనితీరును మరోసారి మదింపు చేసి, ఆ తర్వాత తగిన నిర్ణయం తీసుకోవచ్చని అది సూచించింది. ఎయిరిండియా లాభాల బాట పడుతున్న ఈ దశలో దాన్ని నిరుత్సాహపరుస్తూ దీని నుంచి పెట్టుబడులను ఉపసంహరించవద్దని అది అభ్యర్థించింది. ఎయిరిండియాపై చర్యలు తీసుకోవడం వల్ల వేలాది మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందన్న వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకోవాలని, ఎయిరిండియాకు చెందిన సబ్సిడియరీ సంస్థలన్నీ లాభాలను ఆర్జిస్తున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం కోరింది. 2017 మార్చి నాటికి ఎయిరిండియా 48,877 కోట్ల రూపాయల మేరకు రుణగ్రస్తురాలై ఉంది. 2017-18లో అది 3,579 కోట్ల నష్టాలను చూపించింది.



మార్కెట్ క్యాపిటలైజేషన్


(రూ. కోట్లలో) — 5 జనవరి / 29 డిసెంబరు — లాభం / నష్టం

మొత్తం లాభం 7633 | మొత్తం నష్టం -26971

కంపెనీ	మార్పు	5 జనవరి	29 డిసెంబరు
రిల్	1235	584582	583347
టీసీఎస్	-3053	513881	516934
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	-3393	481880	485273
ఐటీసీ	-244	320487	320731
హెచ్.యు.ఎల్	-2511	293612	296122
మారుతి	-8981	284984	293965
హెచ్‌డీఎఫ్‌సీ	2484	275736	273252
ఎస్‌బీఐ	-2849	264313	267162
ఓఎన్‌జీసీ	3914	253713	249799
ఇన్ఫోసిస్	-5940	221038	226978

మనం ఆరోగ్యం
సోమవారం, 8 జనవరి 2018
www.manamnews.com

సర్వేంద్రియానాం నయనం ప్రధానం... అన్ని అవయవాలు మంచిగా పనిచేస్తూ కంటి చూపు సరిగా లేకపోతే అదొక పెద్ద అడ్డంకి. అందుకే కళ్లు ఉంటేనే ఏదైనా... జీవితంలో ఏదో ఒక సందర్భంలో కళ్లకు ఏదో ఒక సమస్య ఎదురుకావచ్చు. కొన్ని చిన్న సమస్యలైతే, కొన్ని కంటి చూపును దెబ్బతీసేవీ ఉంటాయి. అందుకే వీటి గురించి తగినంత అవగాహన కలిగి ఉంటే కంటి చూపును పరిరక్షించుకోవచ్చు. అవేంటో చూద్దాం...



నయనారోగ్యం

కళ్లు ఎర్రబారడం

కంటి ఉపరితలం అంతా కూడా రక్తనాళాలతో నిండి ఉంటుంది. కళ్లు చిరాకుకు గురైనా లేక ఇన్ఫెక్షన్ బారిన పడినా ఈ రక్త నాళాల పరిమాణం పెరిగిపోతుంది. దాంతో కళ్లు ఎర్రబారినట్టు కనిపిస్తాయి. మరో ముఖ్య కారణం పైన చెప్పుకున్నట్టు కంటిపై ఒత్తిడి వల్ల కూడా కొన్ని సందర్భాల్లో రక్త నాళాల పరిమాణం పెరిగిపోయి కళ్లు ఎర్రబారతాయి. తగినంత నిద్ర లేకపోవడం, అలెర్జీలు, గాయాలకు గురైనా



ఇలా జరుగుతుంది. కంజెంక్టివైటిస్ అనే మరో సమస్య వల్ల కూడా కళ్లు ఎర్రగా మారిపోవచ్చు. సూర్యకిరణాల తాకిడికి ఎక్కువగా ఏళ్ల పాటు గురైన వారిలోనూ ఈ సమస్య కనిపిస్తుంది. అందుకే సమస్య ఏంటన్నది నిర్ధారించుకునేందుకు వైద్యుల సాయం మంచిది.

నయనాలపై ఒత్తిడి


ఇప్పుడంతా కంప్యూటర్ల యుగం. కనుక నయనాలపై ఒత్తిడి (స్ట్రెయిన్) ఎక్కువైపోతోంది. ఎక్కువ దూరం పాటు లేదా ఎక్కువ సమయం పాటు డ్రైవింగ్ చేయడం కూడా కంటిపై ఒత్తిడి పెంచుతుంది. ఎందుకంటే, అన్నేసి గంటల పాటు విరామం లేకుండా చూస్తూ ఉండడం వల్ల కళ్లు బాగా అలసిపోతాయి. దాంతో వాటికి విశ్రాంతి అవసరం. కానీ, ఎంత మంది ఇలా విశ్రాంతి ఇస్తున్నారు...? చాలా తక్కువ మందే. ఎక్కువ మంది కళ్లు అలసిపోయినా సరే అదే పనిగా చూస్తూ, పనిచేస్తూనే ఉంటుంటారు. కానీ, కళ్లు అలసిపోయినప్పుడు వాటికి విశ్రాంతినివ్వడం అవసరం. ఈ సమస్య ఎదురైతే వైద్యుడిని సంప్రదించాలి.

రేచీకటి వల్ల ప్రమాదం

రాత్రి వేళ తక్కువ వెలుగున్న ప్రాంతాల్లో కొందరు కంటి చూపు పరంగా ఇబ్బంది పడుతుంటారు. మరీ దగ్గరకు వచ్చే వరకూ ఏమీ కనిపించవు. థియేటర్ లో దారి కనిపించకపోవడం కూడా ఈ కోవలోనిదే. ఇది రేచీకటి కావచ్చు. వాస్తవానికి ఇది మయోపియా (దూరం చూపు సమస్య) కావచ్చు. లేదా క్యాటరాక్ట్, కెరోకోనస్, విటమిన్ ఏ లోపం వల్ల ఈ సమస్య ఏర్పడి ఉండొచ్చు. వైద్యులే సమస్యను గుర్తించి చికిత్స ద్వారా సరిచేయగలరు. కొందరిలో పుట్టుకతోనే ఈ సమస్య ఉంటుంది. అలాగే, రెటీనాకు సంబంధించి మాక్యులర్ రీజెనరేటివ్ సమస్యకు చికిత్స లేదు. ఇటువంటి వారు తక్కువ వెలుగులో జాగ్రత్తగా మసలుకోవాల్సిందే.

మెల్లకన్నుతో వచ్చే సమస్య

చూస్తున్న సమయంలో కళ్లు రెండూ ఒకే కోణంలో ఉండవు. ఈ సమస్యను మెల్లకన్నుగా పేర్కొంటారు. ఈ సమస్య దానంతట అదే పోదు. పైగా ఈ సమస్య ఉన్న వారి కళ్లు వారి కంట్రోల్ లో ఉండకుండా కదులుతుంటాయి. కంటి వైద్య నిపుణుడు (ఆప్తాల్ మాలజిస్ట్) ఈ సమస్యను సరిచేయ గలరు. దీనికి చాలా చికిత్సలు ఉన్నాయి. విజన్ థెరపీ ద్వారా కళ్లను బలోపేతం చేస్తారు. సర్జరీ కూడా అవసరం పడొచ్చు.



కలర్ బ్లైండ్ నెస్

కొందరిలో కొన్ని రంగులు గుర్తించలేని పరిస్థితి ఉంటుంది. రంగుల మధ్య భేదాన్ని చెప్పలేరు. ఎరుపు, ఆకుపచ్చ మధ్య తేడాలను గుర్తించలేని పరిస్థితి సాధారణంగా ఉంటుంది. కంట్లోని కలర్ సెల్స్ అచేతనంగా, పనిచేయకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సమస్య తీవ్రంగా ఉన్న వారికి ఆయా రంగులు కేవలం బూడిద రంగులోనే కనపడతాయి. ఈ సమస్య పుట్టుకతో రావచ్చు. లేదా కొన్ని రకాల ఔషధాలు, వ్యాధుల కారణంగానూ దీని బారిన పడొచ్చు. మహిళల్లో కంటే మగవారిలో ఈ సమస్య ఎక్కువ. పుట్టుకతో సమస్య ఉంటే దాన్ని సరిచేయలేరు. ఆ తర్వాత ఏర్పడిన వారికి కొన్ని రకాల గ్లాసెస్‌ను సూచిస్తారు.

కళ్ల వెంట నీరు


కంట్లో నీటి పరిమాణం తగ్గిపోవడం ఒక సమస్య అయితే, పెరిగిపోవడం కూడా సమస్యే. కాంతి, గాలి లేదా ఉష్ణోగ్రత విషయంలో సెన్సిటివ్‌గా ఉండే వారిలో అధికంగా నీరు కారడం కనిపిస్తుంది. అందుకే బయటి అంశాల ప్రభావం కంటిపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దీన్ని నివారించుకోవచ్చు. కళ్లు పొడిబారిపోవడం. తగినంత నీరు కళ్లలో ఉత్పత్తి కానప్పుడు ఈ సమస్య ఎదురవుతుంది. అరుదుగా ఇలా పొడిబారిపోవడం వల్ల కంటి చూపు నష్టపోయే ప్రమాదం ఉంటుంది. ప్రత్యేక ఐ డ్రాప్స్‌ను వాడడం ద్వారా సమస్యను తొలగించుకోవచ్చు. న్యూట్రిషనల్ సప్లిమెంట్లను కూడా సూచిస్తారు.

కెమెరా కళ్లలా..!

కంట్లో ఉండే లెన్స్ ఆరోగ్యంగా ఉంటే అవి కెమెరా కళ్లలా ఉంటాయి. బయటి ద శ్యాల తాలూకు వెలుగు నేరుగా రెటీనాకు వెళ్లిపోవాలి. క్యాటరాక్ట్ సమస్యలో వెలుగు అంత సాఫీగా రెటీనాను చేరదు. దీంతో చూపులో స్పష్టత తగ్గుతుంది. రాత్రి సమయాల్లో బల్బ్‌లను చూస్తున్నప్పుడు చుట్టూ వృత్తం మాదిరిగా కనిపిస్తుంది. క్యాటరాక్ట్ సమస్య ఒక్కసారిగా ఏర్పడదు. కొద్దికొద్దిగా డెవలప్ అవుతుంది. నొప్పి, ఎర్రబారడం, నీరు కారడం తరహా లక్షణాలేవీ ఉండవు. సర్జరీ ద్వారా పూర్తిగా తొలగిపోయే సమస్య ఇది.

కార్నియా సమస్యలు

కంటి ముందు భాగంలో డ్రోమ్ మాదిరిగా కనిపించే భాగమే కార్నియా. ఇన్ఫెక్షన్, వ్యాధులు, గాయాలు, హానికారకాలకు ఎక్స్ పోజ్ అయినా కార్నియా సమస్యలు ఎదురవుతాయి. కళ్లు ఎర్రగా మారడం, నీరు కారడం, నొప్పి, చూపు తగ్గడం వంటి లక్షణాలు కనిపించొచ్చు.



కంటిలోపలి నల్లగుడ్డు

కొన్ని రకాల వ్యాధుల కారణంగా కంటిలోపలి నల్లగుడ్డు వాపునకు దారితీస్తుంది. కంటి మధ్యలోని ఈ భాగం ఎన్నో రక్త నాణాల సమూహం. ఈ వ్యాధులు కంటి కణజాలాన్ని దెబ్బతీస్తాయి. దాంతో కంటి చూపును కోల్పోయే ప్రమాదం ఎదురుకావచ్చు. ఏ వయసు వారికైనా ఇది రావచ్చు. వెంటనే తగ్గిపోవచ్చు లేదా దీర్ఘకాలం పాటు కొనసాగొచ్చు. ఎయిడ్స్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, అల్సరేటివ్ కొలైటిస్ ఎక్కువగా యువెటిస్‌కు కారణం అవుతాయి. ఈ సమస్యలో కంటి చూపు మసకగా మారిపోవడం, కళ్లు నొప్పిగా ఉండడం, ఎర్రబారడం వంటివి కనిపిస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా ఓ సారి వైద్యుడిని సంప్రదించడం మంచిది. ఈ సమస్య వెంటనే తగ్గడం అన్నది ఏ తరహా యువెటిస్ అనే దానిపైనే ఆధారపడి ఉంటుంది.

కంటి చుట్టూ కదులుతూ..



చిన్న సైజులో చుక్కలు, మచ్చలు కంటి చుట్టూ కదులుతూ ఉంటాయి. బాగా వెలుగున్న చోట, మండే ఎండలో దీన్ని గుర్తించొచ్చు. ఇవి సహజమే. అయితే, ఒక్కోసారి తీవ్రమైన సమస్యలకు సంకేతాలుగా భావిస్తుంటారు. రెటీనల్ డీటాచ్ మెంట్ లో కంటి వెనుకనున్న రెటీనా పక్కకు జరగడం ఉంటుంది. ఇలా జరిగినప్పుడు లైట్ ఫ్లాషెస్ కూడా కనిపిస్తుంటాయి. నీడలు కూడా వెళుతున్నట్టు అనిపిస్తుంది. ఇలా తరచుగా చుక్కలు కనిపిస్తూ వాటి సంఖ్య కూడా పెరుగుతుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

కంటిని దెబ్బతీసే సమస్య

కంటి చూపును పూర్తిగా దెబ్బతీసే సమస్య ఇది. కంట్లో కొంత ఒత్తిడి అన్నది సహజంగా ఉంటుంది. రక్తపోటు మాదిరిగా అన్నమాట. అయితే ఈ కంట్లో ఒత్తిడి పెరిగిపోతే ఆప్టిక్ నెర్వ్ దెబ్బతింటుంది. ఈ పరిస్థితిని కల్పించే కొన్ని వ్యాధుల సమూహమే గ్లకోమా. ఈ సమస్య బారిన పడిన వారిలో తొలి నాళ్లలో ఎటువంటి లక్షణాలు బయటపడవు. అందుకే క్రమం తప్పకుండా ఆరు నెలలు లేదా ఏడాదికోసారి కంటి వైద్యుడిని సంప్రదించడం అవసరం. కంటికి గాయం అయినా, కంట్లో రక్తనాళాలు బ్లాక్ అయినా, వాపుకు సంబంధించి సమస్యలున్నా గ్లకోమాకు దారితీయవచ్చు. కంట్లో ఒత్తిడిని నియంత్రణలో ఉంచేందుకు వైద్యులు ఐ డ్రాప్స్‌ను సిఫారసు చేస్తారు. అయినా ఒత్తిడి కంట్రోల్ అవకపోతే సర్జరీ ద్వారా సరిచేస్తారు.

రెటీనా సమస్యలు

కంటి వెనుక భాగంలో అతి పల్చని పొరే రెటీనా. ఇది కణాల కలయికతో ఉంటుంది. కంటి ముందున్న దృశ్యాలను గ్రహించి వాటిని మెదడుకు పంపిస్తుంది. రెటీనాలో సమస్య ఏదైనా ఈ వ్యవస్థకు విఘాతం కలుగుతుంది. వయసు కారణంగా ఏర్పడే మాక్యులర్ డీజనరేషన్‌తో రెటీనా కొంత భాగం క్షీణిస్తుంది. డయాబెటిక్ రెటినోపతితో రెటీనాకు సంబంధించిన రక్తనాళాలను దెబ్బతీయడం మరో కారణం. రెటీనా డీటాచ్ మెంట్ మరొకటి. తొలినాళ్లలో అయితే సమస్యను గుర్తిస్తే దాన్ని నియంత్రించి చూపును కాపాడొచ్చు. చేయి దాటిపోతే చూపును తిరిగి తెప్పించడం అసాధ్యం.



వెనుకనున్న కణజాలం

కంటి రెప్పల వెనుకనున్న కణజాలం వాచిపోతుంది. దీంతో ఎర్రబారడం, దురద, మంట, నీరు కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అన్ని వయసుల వారిలో ఇది రావచ్చు. ఇన్ఫెక్షన్, కెమికల్స్‌కు ఇరిటేషన్‌కు దారితీసేవాటికి గురైనప్పుడు, అలెర్జీల కారణంగా ఈ సమస్య ఎదురవుతుంది. తరచుగా చేతులను శుభ్రం చేసుకోవడం ద్వారా దీన్ని నివారించుకోవచ్చు.

వృద్ధాప్యంలో సమస్యలు

వయసు పెరుగుతున్న కొద్దీ చూపు మందగిస్తుంటుంది. ఇది సహజం. ఈ సమయంలో కళ్లద్దాలు ధరిస్తే సరిపోతుంది. లాసిక్ తరహా సర్జరీని కూడా ఎంచుకోవచ్చు. ఈ సర్జరీలో చూపును చక్కదిద్దుతారు. మాక్యులర్ డీజనరేషన్, గ్లకోమా, క్యాటరాక్ట్ కారణంగా చూపులో సమస్యలు ఏర్పడతాయి. ఈ వయసులో చూపు మందగించడం సహజమే కదా అని ఉపేక్షించకూడదు. ఎందుకంటే ఉన్న కొద్ది చూపును కూడా కోల్పోవాల్సి రావచ్చు.

కంటి అలెర్జీలు

అలెర్జీ కారణంగా తరచూ తుమ్ములు, జలుబు, ముక్కు కారటం వంటి సమస్యలనే అనుకునేరు?. అలెర్జీలు కంటిపైనా ప్రభావం చూపిస్తాయి. అలెర్జీ కారణంగా కళ్లు ఎర్రబారడం, దురదగా ఉండడం, మంట, నీరు కారడం కనురెప్పలు వాచిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కంటికి వచ్చే అలెర్జీలను ఆక్యులర్ అలెర్జీ లేదా అలెర్జిక్ కంజెంక్టివైటిస్‌గా పేర్కొంటారు. వీటి వల్ల కంటి చూపు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఒక్కోసారి కళ్లకు ఇన్ఫెక్షన్ సోకినా ఈ తరహా లక్షణాలే కనిపిస్తాయి. అందుకే సమస్య ఏంటన్నది గుర్తించి, తగిన చికిత్స పొందేందుకు గాను కంటి వైద్య నిపుణుడిని సంప్రదించడం అవసరం. మన శరీరం కొన్ని రకాల వాతావరణం, వస్తువులకు అతిగా స్పందించడం వల్ల అలెర్జీలు ఏర్పడతాయి. ఈ సమయంలో శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ కళ్లలో హిస్టామిన్, ఇతర పదార్థాలను విడుదల చేస్తుంది. దీని వల్ల కళ్లు దురదగా ఉండడం, ఎర్రబడడం, నీరు కారడం వంటి లక్షణాలు ఏర్పడతాయి. కంటికి ఏర్పడే అలెర్జీలను రెండు రకాలుగా చెబుతారు. సీజన్ వారీగా వచ్చేవి సాధారణ అలెర్జీలు. పెరెన్నియల్ అలెర్జీలు మరో రకం. సీజన్ వారీగా వచ్చే వాటి కారకాలు గాలి, గడ్డి, చెట్ల పుప్పొడి. పెరెన్నియల్ అలెర్జీలు ఎప్పుడైనా వచ్చేవి. దుమ్ము పురుగులు, పక్షి రెక్కలు, జంతువుల బొచ్చు, పెర్ ఫ్యూమ్, పొగ, క్లోరిన్, కాస్మెటిక్స్, కొన్ని రకాల మందులు, వాయు కాలుష్యకాలను కారకాలుగా చెప్పొచ్చు. వీటి వల్ల ఏడాది వ్యాప్తంగానూ కంటి అలెర్జీలతో బాధపడాల్సి రావచ్చు. వైద్యుల సూచనలతో కంటి అలెర్జీ కారకాలకు దూరంగా ఉండడం, సమస్యతో బాధపడుతుంటే కంటి డ్రాప్స్ వాడడం పరిష్కార మార్గాలు.

విటమిన్ డితో ఆరోగ్యం!



విటమిన్ డి చేసే మేలు అంతా ఇంతా కాదు. ఇది ఎముకల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. రోగనిరోధకశక్తిని బలోపేతం చేస్తుంది. రక్తనాళాలను కాపాడుతుంది. ఇన్సులిన్ ఉత్పత్తి సరిగా జరిగేలా చూస్తుంది. అందుకే శారీరక శ్రమ తగ్గిపోయి రకరకాల జీవనశైలి సమస్యలు ముంచుకొస్తున్న ప్రస్తుత తరుణంలో విటమిన్ డి ప్రాధాన్యత మరింత పెరిగింది. దీని లోపంతో ఆకలి మందగించటం, బరువు తగ్గటం, నిద్రలేమి, నిస్సత్తువ, నిస్త్రాణ వంటి సమస్యలు వేధిస్తాయి. దీనికి సంబంధించి మరో కొత్త విషయం బయటపడింది. విటమిన్ డి లోపంతో తలనొప్పి తలెత్తుతున్నట్టు వెల్లడ్కెంది. ముఖ్యంగా పురుషుల్లో ఇది స్పష్టంగా కనబడుతుండటం గమనార్హం. విటమిన్ డి స్థాయిలు 20 ఎన్‌జీ/ఎంఎల్ నుంచి 50 ఎన్‌జీ/ఎంఎల్ వరకు ఉండటాన్ని నార్మల్‌గా భావిస్తారు. దీని కన్నా తగ్గితే తలనొప్పి రావటం ఎక్కువవుతున్నట్టు ఫిన్‌లాండ్ అధ్యయనం పేర్కొంటోంది. విటమిన్ డి స్థాయిలు 17.6 ఎన్‌జీ/ఎంల్ గలవారితో పోలిస్తే 15.3 ఎన్‌జీ/ఎంఎల్ గలవారు కనీసం వారానికి ఒకసారి తలనొప్పి బారినపడుతున్నట్టు బయటపడింది. విటమిన్ స్థాయిలు తగ్గుతున్నకొద్దీ తలనొప్పి రావటం కూడా పెరుగుతూ వస్తోంది. తరచుగా తలనొప్పితో బాధపడేవారు బయట అంతగా గడపకపోవటం, శరీరానికి ఎండ సరిగా తగలక పోవటం దీనికి కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. నిజానికి విటమిన్ డి- ఆహారం ద్వారా చాలా తక్కువగా లభిస్తుంది. చర్మానికి ఎండ తగిలినపుడు దీన్ని మన శరీరమే తయారు చేసుకుంటుంది. అందువల్ల రోజూ చర్మానికి కాసేపు ఎండ తగిలేలా చూసుకోవటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో తలనొప్పి ఒక్కటే కాదు. ఇతరత్రా జబ్బులనూ నివారించుకోవచ్చు.

పోషకాలు - ఆహారం



'ఆ.. తిండే కదా..' అని మనం తేలిగ్గా తీసేస్తుంటాంగానీ.. ఆహారమంటే రకరకాల రసాయనాలు, వాటన్నింటి సంక్లిష్ట సమ్మేళనం! వీటిని జీర్ణం చేసుకునేందుకు మన ఒంట్లో తయారయ్యే ఆమ్లాలు, బోలెడన్ని ఎంజైములు.. ఇవన్నీ కలిసి లోపల బోలెడన్ని చర్యలు జరుపుతుంటాయి. మనం ఆహారం రూపంలో తీసుకున్న ఈ రసాయనాలు.. ఒంట్లో ఎక్కడెక్కడికి వెళ్లాలి... వీటిని ఏ కణాల వద్దకు చేర్చాలి? ఎంత చేర్చాలి? ఎప్పుడు చేర్చాలి? వంటివన్నీ నిర్ధారించేందుకు శరీరంలో నిరంతరాయంగా.. పరంపరగా.. బోలెడన్ని ప్రక్రియలు, చర్యలు ప్రతిచర్యలు జరుగుతుంటాయి. దీనికోసం లోపల భారీ యంత్రాంగం పని చేస్తుంటుంది. ఈ ప్రక్రియలన్నింటికీ ప్రకృతి సహజంగా లభ్యమయ్యే, ముఖ్యంగా ముడి పదార్థాలు చాలా అనువైనవి, పరిణామంలో మన శరీరాలు వీటికి బాగా అలవాటుపడి.. వేటిని ఎక్కడికి పంపాలి, వేటిని బయటకు విసర్జించాలన్నది క్షుణ్ణంగా అలవరచుకున్నాయి. 'మంచి పోషకాహారం' అనే దానికి పునాది ఇదే! మనం తీసుకునే ఆహారంలో పిండిపదార్థాలు, పండ్లు, మాంసకృత్తులు, పీచు వంటివే కాదు.. రకరకాల విటమిన్లు, ఖనిజాలు, అమైనో ఆమ్లాల వంటివెన్నో ఉంటాయి, ఉండాలి కూడా! మనం ఎన్ని రకాల విటమిన్ మాత్రలు, టానిక్కులు తాగినా.. అవేవీ కూడా ఈ సహజమైన ఆహార పదార్థాల దరిదాపుల్లోకి కూడా రావు. అందుకే మనం ఏదో దొరికింది తినెయ్యటం కాదు.. పోషకాలు దండిగా ఉండే పోషకాహారం తినాలి!

మందులు వేస్తున్నారా?



పిల్లలకు ఏదైనా జబ్బు చేస్తే ఇంట్లో అంతా కంగారు పడిపోతాం. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్తాం. వీలైనంత త్వరగా జబ్బు తగ్గాలనీ కోరుకుంటాం. అయితే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లటమే కాదు.. మందులను జాగ్రత్త చేయటం, వాటిని సరైన మోతాదులో ఇవ్వటం కూడా చాలా అవసరం. ఎందుకంటే మందుల మోతాదుల్లో తేడాలు, పొరపాట్లు కొన్నిసార్లు పిల్లల ప్రాణాల మీదికీ తేవొచ్చు. తల్లిదండ్రులు తమ పిల్లలకు మందులు ఇవ్వటంలో సుమారు 47% వరకు తప్పులు చేస్తున్నట్టు ఒక అధ్యయనంలో వెల్లడైంది. దీనికి ప్రధాన కారణం మందులను కొలవటంపై తికమక పడటం. ఎలా ఇవ్వాలో సరిగా తెలియకపోవటం.మందులను కొన్నప్పుడు వాటి మీద రాసి ఉండే వివరాలను ఒకసారి చదవటం మంచిది. అవి పిల్లలకు వాడటం సురక్షితమేనా అనేదీ చూసుకోవాలి. సిరప్‌ల వంటి ద్రవరూపంలోని మందులను చాలామంది చెంచాలతో కొలిచి పోస్తుంటారు. ఇది ఎంతమాత్రం మంచిది కాదు. టీ స్పూన్లు, టేబుల్ స్పూన్లు అన్నీ ఒకే సైజులో ఉండవు. వీటితో పోస్తే మందు మోతాదు ఎక్కువ, తక్కువ కావొచ్చు. కాబట్టి కొలత పాత్రలతోనే మందును కొలవాలి. చాలాసార్లు మందు సీసాలతోనే కొలత పాత్రలు కూడా వస్తుంటాయి. వాటి మీద మోతాదుల గుర్తులూ ఉంటాయి. వాటి ప్రకారమే సూచించిన మోతాదు మేరకు మందును ఇవ్వాలి. కొలత పాత్రలు లేకపోతే సూదిలేని సిరంజీలతోనూ కొలవచ్చు. ఒక మోతాదు అంటే ఒకసారికి ఇవ్వాల్సిన మందు అని అర్థం. అయితే కొందరు జబ్బు తగ్గటం లేదని ఎక్కువెక్కువగా పోస్తుంటారు. ఎక్కువసార్లు కూడా ఇస్తుంటారు. ఇలా చేయటం తగదు. సూచించిన మోతాదుకు ఎక్కువగానీ తక్కువగానీ ఇవ్వొద్దు. రోజుకు ఎన్నిసార్లు ఇవ్వమంటే అన్నిసార్లే ఇవ్వాలి.

మనం స్పోర్ట్స్
సోమవారం, 8 జనవరి, 2018
www.manamnews.com

హెచ్‌సీఏ ఏజీఎం రసాభాస

అజారుద్దీన్, వీహెచ్, ఇతర క్లబ్ సభ్యులపై వివేక్ ఆగ్రహం

అర్ధాంతరంగా ముగిసిన సమావేశం

హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) పరిపాలన అస్తవ్యస్తంగా, అయోమయంగా తయారైంది. ఏ పాలక వర్గం వచ్చినా సమస్యలు తీరే జాడే కనిపించడం లేదు. అంతేకాదు సమస్యలు మరింత ఎక్కువవుతున్నాయి. ఏ ఒక్క నిర్ణయమూ ఆచరణకు నోచుకోవడం లేదు. దీంతో తెలంగాణ యువ క్రికెటర్లు ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో పడ్డారు. గత రెండు, మూడు రోజులుగా హెచ్‌సీఏ అధ్యక్షుడు జి. వివేకానంద్‌కు, కార్యదర్శి శేష్ నారాయణ్‌కు మధ్య గొడవ జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఆదివారం రెండు గంటల పాటు జరిగిన ఎస్‌జీఎం (స్పెషల్ జనరల్ మీటింగ్)లో విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఈ సమావేశానికి హెచ్‌సీఏ సభ్యులు మాత్రమే వస్తారని అధ్యక్షుడు వివేక్ భావించారు. కానీ హైదరాబాద్ స్టార్ క్రికెటర్, టీమిండియా మాజీ కెప్టెన్ అజారుద్దీన్, హెచ్‌సీఏ మాజీ అధ్యక్షులు వి. హనుమంత రావ్, శివలాల్ యాదవ్, హైదరాబాద్ మాజీ స్పిన్ బౌలర్, హెచ్‌సీఏ మాజీ సభ్యుడు వెంకటపతి రాజుతో పాటు అనుబంధ సంస్థల సభ్యులు కూడా హాజరు కావడంతో ప్రస్తుత అధ్యక్షుడు వివేక్ ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. మీకందరికి ఏం పనంటూ ఆయన ఒకవిధంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్లను సమావేశానికి వివేక్ అనుమతించలేదు. అయితే తాను హైదరాబాద్ క్రికెటర్‌నని, తనకు కూడా హెచ్‌సీఏతో అనుబంధముందని అజారుద్దీన్ చెప్పారు. అంతేకాదు ఇతర క్లబ్ మెంబర్స్‌ను చూసి దొంగ క్లబ్‌లు ఉన్నాయని వివేక్ అనడంతో ఆ క్లబ్ సభ్యులు కూడా వివేక్ తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో వివేక్, శేష్‌ల మధ్య విభేదాలు ఇప్పుడు తెలంగాణకు ఆపాదించినట్టయింది.

వీహెచ్ నిరసన

అంతకుముందు ఎస్‌జీఎంలో హై డ్రామా నడిచింది. ఈ సమావేశానికి అజారుద్దీన్‌ను అనుమతించేందుకు వివేక్ వర్గం అంగీకరించలేదు. ప్రాక్సీ (ప్రతినిధి) ఓటు ద్వారా వచ్చిన అజార్ అనర్హుడంటూ అడ్డుకున్నారు. అంతేకాకుండా ప్రత్యర్థి క్రికెట్ బాడీ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌కు అజార్ మద్దతిస్తున్నాడని ఆరోపించారు. దీనిపై హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు వి. హనుమంత రావ్ తీవ్ర ఆక్షేపణ వెలిబుచ్చారు. టీమిండియా మాజీ కెప్టెన్‌ను హెచ్‌సీఏ తీవ్రంగా అవమానించిందని వీహెచ్ అన్నారు. ఇది టీఆర్ఎస్ మీటింగా? లేక హెచ్‌సీఏ మీటింగా? అంటూ వివేక్‌పై వీహెచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి శివలాల్ యాదవ్ సర్ది చెప్పడంతో అజారుద్దీన్‌ను వివేక్ సమావేశానికి అనుమతించారు. శివలాల్ విజ్ఞప్తిని అంగీకరిస్తున్నామని వివేక్ అన్నారు.

లోధా కమిటీ సంస్కరణలకు ఆమోదం: వివేక్

ఇదిలావుంటే లోధా కమిటీ సంస్కరణలను అమలు చేసేందుకు ఎస్‌జీఎంలో నిర్ణయం జరిగినట్టు హెచ్‌సీఏ అధ్యక్షుడు జి. వివేకానంద్ చెప్పారు. గతంలో ఆమోదించని 16 సంస్కరణలను కూడా ఈ సమావేశంలో ఆమోదించామని వివేక్ తెలిపారు. 'ఇంతకుముందు అమలుకు నోచుకోని లోధా కమిటీ సంస్కరణలను కూడా ఈ సమావేశంలో ఆమోదించడం జరిగింది. వీటిని హెచ్‌సీఏ-నియమిత పరిపాలకులకు పంపుతాం' అని వివేక్ చెప్పారు.



హైదరాబాద్ క్రికెట్‌కు పట్టిన దుర్గతి: అజారుద్దీన్

వివేక్ చెప్పిన లోధా సంస్కరణలకు ఆమోదం అంశంపై అజారుద్దీన్ మండి పడ్డారు. సమావేశంలో తీర్మాణం అనేది చేయకుండా ఎలా ఆమోదిస్తారని ప్రశ్నించారు. 'హైదరాబాద్ క్రికెట్‌కు పట్టిన దుర్గతి ఇది. ఎటువంటి తీర్మాణం లేకుండా లోధా సంస్కరణలను ఆమోదించడం నేనెక్కడా చూడలేదు. అంతేకాదు రాష్ట్ర ప్రభుత్వానికి సలహాదారుగా ఉన్న డాక్టర్ జి వివేక్ లోధా సంస్కరణలకు విరుద్ధంగా భిన్న ప్రయోజనాలను పొందుతున్నారు. హైదరాబాద్ పట్ల, హెచ్‌సీఏ పట్ల నా విశ్వాసాన్ని ఎవ్వరూ ప్రశ్నించలేరు. నన్ను ఇంతటి వాడిని చేసిన క్రికెట్‌కు తిరిగి ఏదో ఒకటి ఇవ్వాలన్న ఉద్దేశంతోనే నేను ఇక్కడ ఉన్నాను. క్రికెటర్లు ఇబ్బంది పడుతుంటే చూస్తూ ఊరుకోను. జస్టిస్ లోధా కమిటీ సూచనలను హెచ్‌సీఏ ఎక్కడా అమలు చేయడం లేదు. హెచ్‌సీఏలో సంక్షోభాన్ని తొలగించేందుకు నా శాయ శక్తులా కృషి చేస్తాను. ఆరంభంలో నన్ను అడ్డుకున్నప్పటికీ తర్వాత ఈ సమావేశంలో పాల్గొనేందుకు నాకు సహాయపడ్డా వారందరికీ కృతజ్ఞతలు. హెచ్‌సీఏలో ప్రతీదీ అప్రజాస్వామికంగా జరుగుతోంది. ఎటువంటి కారణం లేకుండానే చాలా లీగ్స్ ఆగిపోయాయి. ఇటువంటి వాటిని నివారించేందుకు ఈ సమస్యలన్నింటినీ బీసీసీఐ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాను. పాలక వర్గం చెబుతున్నట్టు లోధా సంస్కరణలను ఆమోదించలేదు. సమావేశంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం, ఒకరిపై ఒకరు అరచుకోవడానికే సరిపోయింది' మ్యాచ్ ఆడాలంటే రూ. 5 లక్షలు ఇవ్వాల్సి వస్తోందని పిల్లలు అంటున్నారు. రెకమెండేషన్లతో లేదా డబ్బులు తీసుకునో పిల్లల్ని మ్యాచ్‌లు ఆడిస్తున్నారు. వీళ్లకు (వివేక్) క్రికెట్‌లో ఏబీసీడీలు కూడా రావు. ఏనాడూ బ్యాట్, బంతి పట్టలేదు. నేను పదేళ్లు టీమిండియాకు కెప్టెన్‌గా చేశాను. హైదరాబాద్‌కు కూడా ఆడాను. ఈ విషయం శివ్ భాయ్ (శివలాల్ యాదవ్)కి కూడా తెలుసు. నన్ను గంట సేపు బయటే నిలబెట్టారు. అసోసియేషన్‌లో ఏదైనా సమస్య ఉంటే చెప్పండి పరిష్కారం దిశగా కృషి చేస్తాను. నేను అందుబాటులో ఉండనని వస్తున్న మాటలు నిజం కాదు. నేను అందుబాటులో లేకపోతే ఈ రోజు ఈ సమావేశానికి ఎలా వస్తాను. ఏది ఏమైనా అసోసియేషన్ చక్కబడాలి' అని అజార్ అన్నారు.

శేష్ నారాయణను అడ్డుకన్న వివేక్

అధ్యక్షుడు జి. వివేకానంద్, కార్యదర్శి శేష్ నారాయణ్ పంచాయితి శనివారం అంబుడ్స్‌మన్ (పరిశీలనాధికారి), పాట్నా హై కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) ఎల్. నరసింహారెడ్డి వద్దకు వెళ్లింది. ఇద్దరి వాదనలు వినిపించారు. ఒక్కో వర్గంతో ప్రత్యేకంగా సమావేశమై వారి ఆరోపణలను అంబుడ్స్‌మన్ విన్నారు. చివరికి ఆదివారం నాటి ఎస్‌జీఎంలో పాల్గొనేందుకు నర్సింహారెడ్డి అనుమతించారు. అయినప్పటికీ ఆదివారం కార్యదర్శి శేష్ నారాయణ సమావేశం సమయానికి రాగా.. ఎందుకు వచ్చారు? మిమ్మల్ని కార్యదర్శి పదవి నుంచి సస్పెండ్ చేశాం. మీకు అనుమతి లేదంటూ వివేక్ అడ్డుకున్నారు. అయితే తనను కార్యదర్శి పదవి నుంచి తొలగించే హక్కు అపెక్స్ కౌన్సిల్‌కు లేదని.. తానిప్పటికీ కార్యదర్శి పదవిలోనే ఉండబట్టి సమావేశానికి వచ్చానని శేష్ చెప్పారు. అయితే వివేక్, శేష్‌ల మధ్య వివాదంపై నిర్ణయం తెలిపేందుకు ఈ విషయాన్ని నర్సింహా రెడ్డి 9వ తేదీకి వాయిదా వేశారు.

హెచ్‌సీఏకు మళ్లీ ఎన్నికలు జరపాలి: శివలాల్ యాదవ్

సమావేశానికి ముందు ప్రశాంతంగా అజారుద్దీన్ కూడా ఈ సమావేశంలో పాల్గొనేలా వివేక్‌కు సర్ది చెప్పిన మాజీ అధ్యక్షుడు, బీసీసీఐ మాజీ తాత్కాలిక అధ్యక్షుడు శివలాల్ యాదవ్.. సమావేశం ముగిసిన తర్వాత బయటికి వచ్చి అజారుద్దీన్‌కు అండగా నిలిచారు. ఈ సమావేశానికి అజారుద్దీన్‌ను అనుమతించకపోవడం దారుణమని శివలాల్ చెప్పారు. అజారుద్దీన్‌ను సమావేశానికి అనుమతించి మాజీ కెప్టెన్‌ను గౌరవించాల్సింది అని అన్నారు. ఆదివారం (7-1-18) జరిగిన సమావేశాన్ని అంగీకరించొద్దని, ప్రస్తుత పరిస్థితుల్లో తాజాగా హెచ్‌సీఏ ఎన్నికలు జరిపితే మంచిదని బీసీసీఐకి శివలాల్ సూచించారు. ఈ ప్రతిపక్ష వర్గానికి శివలాల్ యాదవ్ నేతృత్వం వహించారు. అయితే రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధి పట్ల అజారుద్దీన్‌కు ఏమాత్రం శ్రద్ధ లేదని.. చిల్లర రాజకీయాలు చేస్తున్నారని వివేక్ అన్నారు.

సింగపూర్‌లో ధోనీ అకాడమీ



న్యూఢిల్లీ: టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తన ఆటతో ఇప్పటికీ యువతను ఆకర్షిస్తున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్‌ను విస్తరించే కార్యక్రమంలో భాగంగా ధోనీ మరో అకాడమీని ప్రారంభించబోతున్నాడు. గతేడాది దుబాయ్‌లో తొలి అకాడమీని ప్రారంభించిన ధోనీ నూతనంగా సింగపూర్‌లోనూ అకా డమీని తెరవబోతున్నాడు. ఈ కొత్త అకాడమీని సింగపూ ర్‌లోని సెయింట్ పాట్రిక్ స్కూల్‌లో ప్రారంభించబోతున్నాడు. ఈ సందర్భంగా పెద్దలకు, యువకులకు క్రికెట్‌లోని కొన్ని మెళకు వలను ధోనీ నేర్పించబోతున్నాడు. 'పిల్లల వ్యక్తి త్వాన్ని మెరుగు పరచేందుకు క్రీడలు ఎంతో ఉప యోగపడతాయి. క్రీడల వల్ల ఫిట్‌గా ఉండడంతో పాటు నాయకత్వ లక్షణాలను కూడా నేర్చు కోవచ్చు. ప్రతి ఒక్క చిన్నారి అవుట్‌డోర్ స్పోర్ట్స్ ను ఆడాలి. ఎంఎస్ ధోనీ అకాడమీ ప్రతిభావం తులైన క్రికెటర్లను తయారు చేయడం మాత్రమే కాకుండా జీవితంలోనూ చాంపియను ్లగా నిలిచేలా చిన్నారులను తీర్చిదిద్దుతుంది' అని ధోనీ చెప్పినట్టు ఓ వెబ్‌సైట్ పేర్కొంది. ఈ అకాడమీలో చిన్నారులకు క్రికెట్ ఓనమాలు దిద్దించేందుకు సింగపూర్ క్రికెట వర్గానికి చెందిన చేతన్ సుర్యవంశీ, చమిందా రువాన్, దివియ జీకే ప్రముఖులు ధోనీతో చేతులు కలిపారు.

డేల్ స్టెయిన్ అవుట్



కేప్‌టౌన్: సౌతాఫ్రికా జట్టు సీనియర్ బౌలర్ డేల్ స్టెయిన్ టీమిండి యాతో టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. టీమిం డియాతో తొలి టెస్టు రెండో రోజు ఆటలో స్టెయిన్ ఎడమ కాలి మడమ మీది కణ జాలం దెబ్బతింది. దీంతో బాధపడ్డ స్టెయిన్ తన 18వ ఓవర్లో మూడు బంతులు మాత్రమే వేసి మైదానం విడిచి వెళ్లిపోయాడు. స్టెయిన్ మళ్లీ పూర్తిగా కోలుకునేందుకు నాలుగు నుంచి ఆరు వారాల సమయం పట్టే అవకా శముంది. అంటే టీమిండియాతో జరగనున్న మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు అతను అందుబాటులో ఉండడు. మళ్లీ టెస్టులో చోటు సంపాదించిన స్టెయిన్ ఓపెనర్ శిఖర్ ధావన్, వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా వికెట్లు తీసుకున్నాడు. భుజం నొప్పి గాయానికి శస్త్ర చికిత్స చేయించుకున్న స్టెయిన్ దాదాపు ఏడాది కాలం క్రికెట్‌కు దూరమయ్యాడు. ఇటీవలే అతను మళ్లీ అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు సిద్ధమ య్యాడు. ఇండియాతో సిరీస్‌లో ఆడించేందుకు జింబాబ్వేతో జరిగిన నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌కు స్టెయిన్‌ను ఎంపిక చేయలేదు.

పాండ్యాను అరికట్టేందుకు

మార్గం అన్వేషించాలి

సౌతాఫ్రికా పేస్ బౌలర్ కగిసా రబాడ



కేప్‌టౌన్: టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా నుంచి పొంచివున్న ముప్పును ఎదుర్కొనేందుకు తగిన మార్గం అన్వేషించాలని సౌతాఫ్రికా పేస్ బౌలర్ కగిసా రబాడ అన్నాడు. 'అతను తన సహజ సిద్ధమైన ఆటను ఆడుతున్నాడు. అది కొన్నిసార్లు మనల్ని వెనకడుగు వేసేలా చేస్తుంది లేదా తగిన మూల్యం చెలించుకోవాల్సి వస్తుంది. అతను అలా ఆడాలనుకోవడం.. అది ఫలించడం గొప్ప విషయం. అయితే అతడిని అరికట్టేందుకు ఏదో ఒక మార్గం అన్వేషించాలి' అని రబాడ అన్నాడు. 'నిజానికి ఆ పిచ్‌పై పచ్చి గడ్డినా బాగా పెంచాం. అలా వచ్చి బంతిని బాది పరుగులు తీస్తామంటే కుదరదు. అంటే ఆ బంతిపై నీ పేరు రాసిపెట్టి వుంటేనే నువ్వు షాట్స్ కొట్టగలవు. అటువంటి పిచ్‌పై ఆడాలంటే ఎంతోకొంత అదృష్టముండాలి. హార్దిక్ పాండ్యాకు లైఫ్ లభించింది. అయినప్పటికీ అతను బాగా ఆడాడు. అందుకే చెబుతున్నాను లక్ ఉంటే తప్ప అటువంటి పిచ్‌లపై ఆడలేం' అని రబాడ చెప్పాడు. అయినప్పటికీ ప్రస్తుతం తమదే పైచేయిగా ఉందని ఈ ఫాస్ట్ బౌలర్ అన్నాడు.

మూడో రోజు ఆట

వర్షార్పణం



కేప్‌టౌన్: ఇండియా, సౌతాఫ్రికా మధ్య రసవత్తరంగా సాగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌కు వరుణుడు బ్రేక్ వేశాడు. ఆదివారం కురిసిన భారీ వర్షం కారణంగా మూడో రోజు ఒక్క బంతి కూడా పడకుండానే ఆట రద్దయింది. సోమవారం 98 ఓవర్లతో షెడ్యూల్ ప్రకారం ప్రారంభమవుతుంది. ఆదివారం భారీ వర్షం కురిసే అవకాశముందని స్థానిక వాతావరణ కేంద్రం తెలిపింది. అయినప్పటికీ ఇరు జట్ల క్రికెటర్లు త్వరగానే స్టేడియానికి చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం మ్యాచ్‌ను ప్రారంభించాలని భావించారు. కానీ ఎడతెరిపిలేని వర్షం వల్ల మైదానమంతటీ నీళ్లు నిండుకున్నాయి. నీళ్లను తీసేందుకు సూపర్ సాపర్స్ తీవ్రంగా కృషి చేసినప్పటికీ వర్షం కాసేపు ఆగి, మళ్లీ కురుస్తుండడంతో మొత్తం ఆట రద్దయింది. తొలి రోజు ఆటలో సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 286 పరుగులకు ఆలౌటైంది. భువనేశ్వర్ కుమార్ 4 వికెట్లు తీశాడు. అదే రోజు తొలి ఇన్నింగ్స్‌కు దిగిన టీమిండియా 3 వికెట్లు నష్టపోయి 28 పరుగులు చేసింది. మరుసటి రోజు అంటే శనివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కోహ్లీ సేన 209 పరుగులకు ఆలౌటైంది. తర్వాత సౌతాఫ్రికా జట్టు 2 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. ప్రస్తుతం సౌతాఫ్రికా 142 పరుగుల ఆధిక్యంలో ఉంది. హార్దిక్ పాండ్యా ఒంటి చేత్తో జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. 95 బంతుల్లో 93 పరుగులు చేశాడు. అంతేకాకుండా సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కూడా తీశాడు. భుజానికి శస్త్ర చికిత్స చేసుకుని కోహ్లీ సేనతో సిరీస్‌కు మళ్లీ టెస్టు జట్టులోకి వచ్చిన డేల్ స్టెయిన్ టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో మళ్లీ మడమ గాయానికి గురయ్యాడు. దీంతో టీమిండియాతో సిరీస్‌కు స్టెయిన్ దూరమయ్యాడు.

డీడీసీఏలో అంతర్గత విభేదాలు

కెప్టెన్సీ నుంచి పంత్ తొలగింపు | సంగ్వాన్‌కు పగ్గాలు అప్పజెప్పిన డీడీసీఏ



న్యూఢిల్లీ: ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ)లోని అంతర్గత కుమ్ములాటలు మరోసారి బయటపడ్డాయి. టీమిండియాలో చోటు దిశగా పయనిస్తున్న యువ వికెట్ కీపర్/బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్‌పై వేటు పడింది. మరో వారం రోజుల్లో రంజీ ట్రోఫీ ఫైనల్ ఉండగా ఢిల్లీ జట్టు కెప్టెన్సీ నుంచి పంత్‌ను తొలగించారు. ఈ అసోసియేషన్ పరిస్థితులు ఎంతగా దిగజారాయంటే.. ఐపీఎల్‌లో భాగంగా గతేడాది మేలో గుజరాత్ లయన్స్‌కు ఆడిన ఎడమ చేతి బౌలర్ ప్రదీప్ సంగ్వాన్‌ను జట్టు పగ్గాలు అప్పజెప్పారు. సంగ్వాన్‌కు రంజీ ట్రోఫీ మ్యాచ్ ఆడే ఫిట్‌నెస్ లేదు. అంతేకాదు నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకుని డోపింగ్ టెస్టులో పట్టుబడ్డ భారత తొలి క్రికెటర్ సంగ్వాన్. సంగ్వాన్ తన కెరీర్‌లో 77 టీ20లు ఆడి 71 వికెట్లు తీశాడు. డీడీసీఏ తీసుకున్న మరో దారుణమైన నిర్ణయమేంట ంటే.. సీనియర్ ప్లేయర్స్ ఉన్ముక్త్ చంద్, మన్నన్ శర్మ, మిలింద్ కుమార్‌లను జట్టు నుంచి తొలగించింది. రంజీ సీజన్ ఆరంభంలో ఉన్ముక్త్ చంద్ కెప్టెన్‌గా, మిలింద్ వైస్ కెప్టెన్‌గా ఢిల్లీ జట్టుకు వ్యవహరించారు. 'రిషబ్ పంత్ ఫామ్‌లో లేక ఇబ్బంది పడుతున్నాడు. దీంతో అతనిపైనుంచి కెప్టెన్సీ భారాన్ని తొలగించాలని నిర్ణయించాం. ప్రదీప్ సంగ్వాన్ పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నాడు. అతను సీనియర్ ప్లేయర్. 2008లో గౌతమ్ గంభీర్ కెప్టెన్‌గా ఉన్నప్పటి నుంచి సంగ్వాన్ ఆడుతున్నాడు. దీంతో సంగ్వాన్‌ను కెప్టెన్ చేయాలని భావించాం' అని సెలెక్షన్ కమిటీ చైర్మన్ అతుల్ వాసన్ అన్నారు. అయితే రెండుసార్లు ఐపీఎల్ విన్నింగ్ కెప్టెన్‌గా నిలిచి గౌతమ్ గంభీర్‌కు పగ్గాలు ఎందుకు అప్పజెప్పకూడదు? అన్న ప్రశ్నకు వాసన్ సమాధానమిస్తూ.. 'గౌతమ్ మెంటర్ పాత్రను పోషిస్తే బాగుంటుందని భావించాం. అండర్-23 జట్టులో సత్తా చాటిన తేజాస్ బరోఖా, లలిత్ యాదవ్ వంటి యువకులను పరీక్షించాల్సిన ఫార్మాట్ ఇది. బీహార్ రాజకీయనేత పప్పు యాదవ్ కుమారుడు సర్థాక్ రంజన్ ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. దీనిపై వాసన్ స్పందిస్తూ.. రెండు నెలలు పరిశీలించిన మీదట అతనికి అవకాశం కల్పించామన్నారు. 'సర్థాక్‌కు మానసిక సమస్యలున్నాయి. అందుకే ఈ సీజన్ ఆరంభంలో అతడిని ఆడించలేకపోయాం. అతను పూర్తి ఆరోగ్యవంతుడయ్యాక అండర్-23 జట్టులోకి స్టాండ్ బై క్రికెటర్‌గా తీసుకుంటాం. సర్థాక్‌ను రెండు నెలలు పరిశీలించాం. అతను అద్భుత ప్రతిభ కనబరచడంతో ఇప్పుడు జట్టులోకి తీసుకున్నాం' అని వాసన్ వివరించారు.

రంజీ ట్రోఫీ ఫైనల్‌కు ఢిల్లీ జట్టు: ప్రదీప్ సంగ్వాన్ (కెప్టెన్), గౌతమ్ గంభీర్, రిషబ్ పంత్, హిమ్మత్ సింగ్, ధ్రువ్ షోరే, లలిత్ యాదవ్, క్షితిజ్ శర్మ, నితీస్ రాణా, నవదీప్ సైనీ, పవన్ నేగీ, కుల్వంత్ ఖెజ్రోలియా, ఖిస్తిజ్ శర్మ, తేజాస్ బరోఖా, సుబోధ్ భటి, గౌరవ్ కుమార్.

భారీ లక్ష్యాన్నైనా ఛేదిస్తాం



టీమిండియా ఓపెనర్ చెటేశ్వర్ పుజారా

కేప్‌టౌన్: పేస్ బౌలర్లకు సహకరించిన కేప్‌టౌన్ పిచ్‌పై సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌కు టీమిండియా 77 పరుగులు వెనకబడింది. అయినప్పటికీ తొలి టెస్టులో గెలుపుపై టీమిండియా ఓపెనర్ చెటేశ్వర్ పుజారా ధీమాగా ఉన్నాడు. ప్రత్యర్థి తమకు 350 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించినా తాము సాధిస్తామని పుజారా చెప్పాడు. రెండో రోజు ఆటలో హార్దిక్ పాండ్యా వీరోచిత బ్యాటింగ్ వల్ల పుజారా ఈ ధీమా వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. 'నిజం చెప్పాలంటే మేము భారీ లక్ష్యం ఉండాలని కోరుకోవడం లేదు. కానీ ఒకవేళ సౌతాఫ్రికా జట్టు 350 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించినా చేదించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. తొలి ఇన్నింగ్స్‌లో టాపార్డర్ విఫలమైంది. కానీ రెండో ఇన్నింగ్స్‌లో సత్తా చాటుతామని అనుకుంటున్నాను. ఒకవేళ మేము బాగా బ్యాటింగ్ చేయగలిగితే 350 కంటే ఎక్కువ పరుగులు చేస్తాం' అని పుజారా నమ్మకంగా చెప్పాడు. కానీ తొలి రోజు ఆటలో చివరి పది ఓవర్లలో టీమిండియా 28 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. సౌతాఫ్రికా బౌలర్లను అంతో ఇంతో అడ్డుకన్న పుజారా రెండో రోజు మార్నింగ్ సెషన్‌లోనే వెనుదిరిగాడు. దీంతో స్కోరుబోర్డులో టీమిండియా పెద్దగా పరుగులు నమోదు చేయలేకపోయింది. అయితే తమ ప్లాన్‌ను టీమిండియా సరిగా ఆచరణలో పెట్టలేదన్నది నిరూపితమైంది.

'వాళ్లు (సౌతాఫ్రికా బౌలర్లు) సరైనా ఏరియాలో బౌలింగ్ చేశారు. అయినప్పటికీ మేము ఏం చేయాలో మాకు తెలుసు. దాదాపుగా మేము అనుకున్నది సాధించమని భావిస్తున్నాను. రోహిత్ అవుట్ కాకపోతే మేమిద్దరం కలిసి మంచి భాగస్వామ్యాన్ని అందించేవాళ్లం. ఓవరాల్‌గా బాగానే ఆడాం. అంతకుముందు మూడు వికెట్లు మాత్రమే కోల్పోయాం. ఏది ఏమైనా మేము సుస్థిర స్థానంలోనే ఉన్నామని భావిస్తున్నాను. తర్వాత సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో రెండో రోజు రెండు వికెట్లు కూడా పడగొట్టాం. మేము కూడా గెలుపు బరిలో ఉన్నామని అనుకుంటున్నాను' అని పుజారా అన్నాడు. కానీ మ్యాచ్ గెలవడమనేది వాతావరణంపై ఆధారపడివుంటుందని ఈ ఓపెనర్ చెప్పాడు. ఐదుగురు బౌలర్లతో బరిలోకి దిగాలన్న సౌతాఫ్రికా నిర్ణయంలో డేల్ స్టెయిన్ గాయం కారణంగా దూరమయ్యాడు. 'పిచ్ ఫాస్ట్ బౌలర్లకు ఎక్కువగా సహకరిస్తోంది. దాన్ని మేము నాలుగో రోజు ఆటలో సద్వినియోగం చేసుకుంటాం. మూడో రోజు ఆట వర్షం కారణంగా రద్దు కావడంతో గాలిలోని తేమ స్పిన్నర్లకు కూడా సహకరించే అవకాశముంది. కేప్‌టౌన్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ బౌలర్లకు కూడా బాగానే సహకరిస్తోంది.

మరోవైపు కోహ్లీ సేనకు భారీ లక్ష్యాన్ని నిర్దేశిస్తామని సౌతాఫ్రికా పేస్ బౌలర్ కగిసా రబాడ అంటున్నాడు. 'మేము తొలి ఇన్నింగ్స్‌లోనే 77 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించాం.

ప్రస్తుతం 142 పరుగుల ఆధిక్యంలో ఉన్నాం. నాలుగో రోజు ఆటలో ఆ ఆధిక్యాన్ని మరింత పెంచి భారత్‌కు భారీ ఆధిక్యాన్ని ఇస్తాం. మా పిచ్‌లపై భారత్ భారీ లక్ష్యాన్ని చేదించలేదని అనుకుంటున్నాను. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఓటమిని అంగీకరించం. గెలుపు కోసమే పోరాడతాం. కోహ్లీ సేనకు ఎంత లక్ష్యాన్ని నిర్దేశిస్తామన్నది ఇప్పుడే చెప్పడం కష్టం. కానీ కఠినమైన లక్ష్యాన్ని భారత్‌కు ఇస్తామని ఖచ్చితంగా చెప్పగలను' అని ఈ యువ పేసర్ అన్నాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.